ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698


తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 21.08.2024 | సంపుటి : 11 సంచిక : 42 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఎంపాక్స్ వ్యాధి కొవిడ్‌లా కాదు

- వైరస్ వ్యాప్తిని నియంత్రించొచ్చు
- డబ్ల్యూహెచ్ఓ ప్రకటన



న్యూయార్క్(జనంసాక్షి): కరోనా సృష్టిం చిన కలవరాన్ని మర్చిపోతున్న తరుణంలో తాజాగా ఎంపాక్స్ కలకలం రేపు తోంది. ఆఫ్రికా దాటి పలు దేశాలకు ఈ వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ ఆందోళన సమయంలో ప్రపంచ

మిగతా 2లో..



## ప్రమాదాలపై రైల్వేబోర్డు కీలక నిర్ణయం

- అన్ని రైలు ఇంజిన్‌లలో ఏఐ సీసీటీవీ కెమెరాలు

ప్రయాగ్‌రాజ్(జనంసాక్షి): దేశంలో పెరుగుతోన్న రైలు ప్రమాదాలను నియంత్రించేందుకు రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని లోకోమోటివ్‌లు (రైలు ఇంజిన్‌లు), ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో ఏఐ

మిగతా 2లో..

# రాజీవ్ విగ్రహాన్ని టచ్ చేయండి..
# తడాఖా చూపెడతాం





## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్

**రాజీవ్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు**

**రాష్ట్ర సచివాలయం ఎదుట విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం**

హైదరాబాద్(జనంసాక్షి): కేటీఆర్ కామెంట్స్‌పై రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ జాగ్రత్త అంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సోమాజీగూడలో రాజీవ్ విగ్రహానికి సీఎం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. ఎవడికైనా చేతనైతే రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకోండి. రాజీవ్ విగ్రహాన్ని ముడితే చెప్పు తెగే దాకా కొడుతాం. రాజీవ్ విగ్రహం ఎవరు ముడుతారో, ఎప్పుడు ముడుతారో చెపితే మా జగ్గారెడ్డిని పంపిస్తాం. తాగుబోతులు, దొంగల విగ్రహాలకు సచివాలయం ముందు స్థానం లేదు. తొందరలోనే రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకుందాం. పండగ వాతావరణంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం. రాజీవ్ విగ్రహాన్ని పెడతామంటే తొలగిస్తామని కొందరు సన్నాసులు అంటున్నారు. అధికారం పోయినా బలుపు తగ్గలేదు. బలుపును తగ్గించే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకుంటారు. వాళ్ల అయ్య విగ్రహం పెట్టుకోవాలని కేటీఆర్ అనుకుంటున్నాడు. వాళ్ల అయ్య పోయేదెప్పు డు? విగ్రహాన్ని పెట్టేదెప్పుడు. ఉద్యమం ముసుగులో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొన్నారు. తాగుబోతు సన్నాసి విగ్రహం సెక్రటేరియట్ ముందు పెడుతారా?. తెలంగాణను దోచుకున్న దొంగ విగ్రహం పెట్టాలా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పొద్దున లేస్తే తాగేవాడి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు పెడుతారా? నీ అయ్య విగ్రహం కోసం రాజీవ్ విగ్రహాన్ని తొలగించాలని అంటావా?. అధికారంలోకి వస్తే అని మాట్లాడుతున్నాడు... బిడ్డా.. మీకు అధికారం ఇక కలనే.. ఇక మీరు చింతమడకకే పరిమితం. పదేళ్లు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టని వాళ్లు ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే బాధ్యత మాది. మా చిత్తశుద్ధిని ఏ సన్నాసి శంకించనవసరం లేదు.

మిగతా 2లో..

**రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించేలా**

## తెలంగాణ తల్లి విగ్రహం

- ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): డిసెంబర్ 9న సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు విగ్రహం ఏర్పాటు కోసం సచివాలయం ఆవరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని సూచించిన ముఖ్యమంత్రి, పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

మిగతా 2లో..



## వైద్యుల భద్రతకు టాస్క్‌ఫోర్స్

**ప్రోటోకాల్ ఏర్పాటు**

- కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటనపై ఎఫ్ఐఆర్‌లో ఆలస్యంపై సుప్రీం ఆగ్రహం
- పని ప్రదేశాల్లో భద్రతపై సీజేఐ ఆందోళన
- మరో అత్యాచారం కోసం ఎదురుచూడొద్దు
- విచారణకు సంబంధించి స్టేటస్ రిపోర్ట్ ఇవ్వండి
- ఆందోళనకారులపై బలప్రయోగం సరికాదు
- ఆసుపత్రుల్లో వైద్యుల భద్రతపై ధర్మాసనం కీలక సూచనలు

దిల్లీ(జనంసాక్షి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన పై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈసందర్భంగా దారుణం చోటుచేసుకున్న ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ తీరుపై మండిపడింది. అంత ఘోరం జరిగితే.. ఆత్మహత్య అని ఎలా చెప్పారంటూ ప్రశ్నించింది. కొన్ని మీడియా సంస్థలు బాధితురాలి ఫొటో, పేరును ప్రచురించడంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ సందర్భంగా బెంగాల్ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులు, మెడికల్ కాలేజీ అధికారుల తీరుపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. "ఈ ఘటనలో నేరాన్ని ఉదయాన్నే గుర్తించినట్లు తెలిసింది. కానీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మాత్రం దీన్ని ఆత్మహత్య కేసుగా సమాచారం అందించే ప్రయత్నం చేశారు. అతడి ప్రవర్తనపై అనుమానాలు ఉన్నప్పుడు.. వెంటనే మరో కాలేజీకి ఎలా నియమిం చారు? ఇక, ఎఫ్ఐఆర్ నమోదు కూడా ఆలస్యమైంది. మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 4 గంటల మధ్య శవ పరీక్ష పూర్తయ్యింది. కానీ, మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన 3 గంటల తర్వాత రాత్రి 11.45 గంటలకు ఎందుకు నమోదు చేయాల్సివచ్చింది?

మిగతా 2లో..

## మాజీ ప్రిన్సిపాల్‌కు బిగుస్తున్న ఉచ్చు

కోల్‌కతా(జనంసాక్షి): పశ్చిమబెంగాల్‌లో హత్యాచార ఘటన వేళ.. ఆర్‌జీ కార్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. తాజాగా ఆయనపై కోల్‌కతా పోలీసు అవినీతి

మిగతా 2లో..

## రుణమాఫీపై ధర్నాలకు బీఆర్ఎస్ పిలుపు

- రేపు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు



హైదరాబాద్(జనంసాక్షి): రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 22వ తేదీన అన్ని మండల కేంద్రాలు,నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ధర్నాలు చేపట్టాలని బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతన్నలు కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ప్రయోజనం పొందకపోవడంతో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే.. మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని.. కార్యక్రమం కొనసాగుతుందని చెబుతున్నారని అన్నారు. ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతూ రైతన్నలను

మిగతా 7లో..

## రుణమాఫీలో ఆలస్యం సరికాదు

**రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు రూ.18 వేల కోట్లు ఇస్తే రైతులకు చేరింది రూ. 7500 కోట్లు మాత్రమే**

- లక్ష్యం మేరకు బ్యాంకర్లు సహకరించాలి
- వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముక
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సీఎం భట్టి సూచనలు



హైదరాబాద్(జనంసాక్షి): రుణాల మాఫీలో వారం ఆలస్యమైనా ఫలితం ఉండదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రజా భవన్‌లో జరిగిన బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక కామెంట్స్ చేశారు. లెక్కలు కాదు ఆత్మ ఉండాలన్నారు. ఇప్పటి వరకు రూ. 18 వేల కోట్లు బ్యాంకులకు అందించామని.. రైతులకు మాత్రం నేటి వరకు రూ. 7,500 కోట్లు మాత్రమే చేరాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలను వేగంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముకగా భావిస్తామన్నారు. రుణమాఫీ, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, భారీ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నామని భట్టి తెలిపారు. ఉచితంగా 24 గంటల విద్యుత్తును అందిస్తున్నామన్నారు. రెండు లక్షల రుణమాఫీ ద్వారా రైతులను రుణ విముక్తులను చేస్తున్నామని.. ఇది వ్యవసాయం అనుబంధ రంగాలను బలోపేతం చేస్తాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తుందన్నారు భట్టి విక్రమార్క. ఇన్నోవేటివ్ పాలసీలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి రూ. 36 వేల కోట్ల విలువైన ఎంఓఏలు కుదుర్చుకున్నారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుందని.. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు. ఇందిరా మహిళా శక్తి

మిగతా 2లో..

## వ్యవసాయ సలహాదారుగా పోచారం

**డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ చైర్మన్‌గా గుత్తా అమిత్ • రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**





హైదరాబాద్(జనంసాక్షి): బీఆర్ఎస్‌కు గుడ్ బై కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఒక్కొక్కరికి ప్రాధాన్యత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పార్టీ కండువా కప్పుకున్న నేతలకు పదవులు ఇవ్వగా.. తాజాగా ఒక యంగ్ లీడర్‌కు, మరో సీనియర్ నేతకు కీలక పదవులు ఇస్తూ రేవంత్ సర్కార్ జీవోలు ఇవ్వడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా పోచారం శ్రీనివాస్ రెడ్డి ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి

## నగరంలో భారీ వర్షం

- హైదరాబాద్ రోడ్లన్నీ జలమయం
- స్కూళ్లకు సెలవు ప్రకటించిన అధికారులు
- పార్సీగుట్టలో వరదకు ఓ వ్యక్తి గల్లంతు
- అత్యవసరమైతేతప్ప బయటకు రావద్దన్న అధికారులు



హైదరాబాద్(జనంసాక్షి): గ్రేటర్ హైదరాబాద్ వరిధిలో వర్షం దంచికొట్టింది. మంగళవారం వేకువ జాము నుంచి కుండపోతగా వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లుగా పలు ప్రాంతాల్లో వర్షం కుమ్మరించింది. దీంతో హైదరాబాద్‌లో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో వాహనాలు కొట్టుకుపోయాయి. పార్సిగుట్ట, సనత్‌నగర్‌లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వర్షపు నీటిలో కొట్టుకుపోయారు. హైదరాబాద్‌లో

మిగతా 2లో..

**జీహెచ్‌ఎంసీ పూర్తిస్థాయి**

## కమిషనర్‌గా ఆమ్రపాలి

**తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్‌ల బదిలీ**

**కొందరికి అదనపు బాధ్యతలు అప్పగింత**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేయడంతో పాటు కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఆమ్రపాలికి పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించింది. హెచ్ఎండీఏ, మూసీ అభివృద్ధి, హెచ్‌జీసీఎల్ అదనపు బాధ్యతల నుంచి ఆమ్రపాలిని ప్రభుత్వం రిలీవ్ చేసింది. మూసీ అభివృద్ధి కార్పోరేషన్ ఎండీగా దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా..

మిగతా 2లో..

**లేటరల్ ఎంట్రీ దుమారం..**

## దిగొచ్చిన కేంద్రం

**ప్రకటన రద్దు చేయాలంటూ యూపీఎస్సీకి కేంద్ర మంత్రి లేఖ**

**రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను కాంగ్రెస్ పరిరక్షిస్తుంది:రాహుల్**




దిల్లీ(జనంసాక్షి): లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లోని ఖాళీల భర్తీ విధానంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతోన్న తరుణంలో కేంద్రం దీనిపై వెనక్కి తగ్గింది. లేటరల్ ఎంట్రీ కోసం ఇచ్చిన ప్రకటనను రద్దు చేయాలని యూపీఎస్సీ హెడ్‌కు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ లేఖ రాశారు. ప్రధాని మోదీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. సామాజిక న్యాయంపై మోదీ సర్కారు దృష్టి సారించిన నేపథ్యంలో ఈ అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో 45 మంది సంయుక్త కార్యదర్శులు, ఉప కార్యదర్శులు/ డైరెక్టర్ల నియామకానికి యూపీఎస్సీ ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించింది. దీన్ని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. దానిని జాతి వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారని ఆరోపించారు. ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం దక్కడం లేదని.. దీన్ని మెరుగుపరిచే బదులు.. లేటరల్ ఎంట్రీ ద్వారా వారిని ఆ పదవులకు దూరం చేస్తున్నారన్నారు. సమాజ్‌వాదీ, బీఎస్పీ సైతం ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. భాజపా తమ అనుయాయులను పెద్ద పదవుల్లో కూర్చోబెట్టేందుకు చేస్తున్న కుట్రగా పేర్కొన్నాయి. దీన్ని జాతివిద్రోహ చర్యగా అభివర్ణించిన ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్.. అక్టోబర్ 2న దీనిపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బీఎస్పీ అధినేత్రి లేటరల్ ఎంట్రీలను రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా అభివర్ణించారు. ప్రతిపక్షాల

మిగతా 2లో..

**మహారాష్ట్రలో చిన్నారులపై స్వీపర్**

## లైంగిక దాడి

- ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహావేశాలు
- రైలుపట్టాలపై బైఠాయించి ఆందోళన
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

ముంబై(జనంసాక్షి): అభం శుభం తెలియని మూడు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులపై టాయిలెట్‌లో ఓ స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మహారాష్ట్రను కుదిపేస్తోంది. థానే జిల్లాలోని బద్లాపూర్‌లో ఓ స్కూల్‌లో జరిగిన ఈ అమానవీయ ఘటనను ఖండిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. చిన్నారులపై దుశ్చర్యకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ దాదాపు ఏడు గంటలుగా బద్లాపూర్ రైల్వేస్టేషన్‌లో పట్టాలపై బైఠాయించి రైళ్ల రాకపోకల్ని అడ్డుకొంటున్నారు. రైళ్ల రాకపోకల్ని అడ్డుకోవద్దంటూ

మిగతా 2లో..



## ఐదేళ్లలో 70 ఉపగ్రహాల ప్రయోగం

**చంద్రయాన్ 4, 5 డిజైన్లు సిద్ధంగా ఉన్నాయి**


**ప్రభుత్వం నుంచి ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాం**

**డిసెంబరులో గగన్‌యాన్ చేపట్టే అవకాశం : ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్**



న్యూఢిల్లీ(జనంసాక్షి): చంద్రయాన్ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త అప్డేట్స్ ఇచ్చారు ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్. చంద్రయాన్ 4, 5 డిజైన్లు పూర్తి అయ్యాయని, వాటికి ప్రభుత్వం నుంచి ఆమోదం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. చంద్రుడిపై అన్వేషణలో భాగంగా అనేక ప్రయోగాలు చేస్తున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ– ఇస్రో, అక్కడ నుంచి రాళ్ల, మట్టి తీసుకువచ్చే లక్ష్యంతో మరిన్ని ప్రయోగాలకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా చంద్రయాన్ 4, చంద్రయాన్ 5 డిజైన్లు పూర్తైనట్లు ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం ఇవి కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొందే ప్రక్రియలో ఉన్నాయని చెప్పారు. దిల్లీలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ఇండియన్ స్పేస్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు మీడియాకు చెప్పారు. రానున్న ఐదేళ్లలో ఇస్రో దాదాపు 70 ఉపగ్రహ ప్రయోగాలు చేపట్టనుందని తెలిపారు."చంద్రుడిపై అన్వేషణ

మిగతా 2లో..



## నీట మునిగిన విలాస నౌక

**సిసిలీ వద్ద సముద్రంలో దిగ్గజాల గల్లంతు**

సిసిలీ(జనంసాక్షి): సిసిలీ వద్ద సముద్రంలో బోల్తాపడిన బయేసియాన్ అనే విలాసవంతమైన యాట్ నీటమునగగా హైప్రొఫైల్ వ్యక్తులు గల్లంతయ్యారు. ఇప్పటికే ఈ ప్రమాదంలో అటానమీ కార్పొరేషన్ వ్యవస్థాపకుడు మైక్ లించ్ ఆచూకీ గల్లంతైన విషయం తెలిసిందే.

మిగతా 2లో..



సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్

# మహారాష్ట్రలో చిన్నారులపై స్వీపర్ లైంగిక దాడి

ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సైతం లెక్క చేయకుండా తమ నిరసనలు కొనసాగిస్తున్నారు. మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ నిరసనకారుల్ని శాంతింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బాధిత బాలికలకు న్యాయం చేయాలని, అరెస్టు చేసిన నిందితుడిని ఉరితీయాల్సిందేనంటూ ఆందోళనకారులు నినదించారు. రైల్వే ట్రాక్‌లను ఖాళీ చేయాలంటూ మంత్రి విజ్ఞప్తి చేసినా.. 'హ్యాంగ్.. హ్యాంగ్' అంటూ నినాదాలతో ఆ పరిసరాలను హోరెత్తించారు. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు సన్నిహితుడైన మంత్రి గిరీశ్ మహాజన్.. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదుల్ని తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారుల్ని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేసిందని.. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరు గంటలకు పైగా కొనసాగుతోన్న రైల్ రోకోతో పలు లోకల్ రైళ్లు రద్దవ్వడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిరసనకారుల డిమాండ్లకనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. అయినా ఆందోళనకారులు నిరసనల్ని విరమించలేదు. మరోవైపు, ఈ ఘటనపై డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనను మహిళా ఐపీఎస్ నేతృత్వంలో విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఐజీ ర్యాంకు కలిగిన ఐపీఎస్ అధికారిణి ఆర్తి సింగ్‌ను దర్యాప్తు అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా విచారించాలని, ఛార్జిషీట్‌ను దాఖలు చేయాలని, విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ముందు ఈ అంశాన్ని ఉంచాలను కుంటున్నట్లు ఫడణవీస్ తెలిపారు. ఇలాంటి అనాగరిక, అమానవీయ చర్యకు తక్షణమే శిక్ష పడేలా పోలీసులు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు సుప్రియా సూలే, ఉద్ధవ్ ఠాక్రే వంటివారు చూస్తున్నారని దేవేంద్ర ఫడణవీస్ ఆరోపించారు. ఇలాంటి ఘటనలతో రాజకీయ లబ్ధి పొందాలని విపక్షాలు చూడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విపక్షాలకు ఎలాంటి సానుభూతి లేదన్నారు. ఠాక్రే ఒక రాజనీతిజ్ఞుడిలా ప్రవర్తించాలి తప్ప ఇలాంటి సున్నితమైన అంశాలను రాజకీయం చేయరాదని హితవు పలికారు. ఈ నిరసనలు రాజకీయ ప్రేరేపితమని భాజపా ఎమ్మెల్యే కిషన్ కథోర్ ఆరోపించారు. ఆందోళనకారులంతా బద్లాపుర్ నుంచి కాకుండా పొరుగు ప్రాంతాల నుంచి వచ్చినవారేనని వ్యాఖ్యానించారు. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# రాజీవ్ విగ్రహాన్ని టచ్ చేయండి.. తాడాఖా చూపెడతాం

విచక్షణ కోల్పోయి అర్థంపర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం మిమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తుంది. కలలో కూడా నీకు అధికారం రాదు. పది సంవత్సరాల్లో తెలంగాణ తల్లి విగ్రహం గుర్తు రాలేదా? బీఆర్ఎస్ నాయకులు ఇష్టమున్నట్టు మాట్లాడితే సామాజిక బహిష్కరణ చేస్తాం. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతాం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో విప్లవాత్మక మార్పులకు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రీకారం చుట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలు ఆయన హయాంలోనే బలోపేతం అయ్యాయని తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. పంజాగుట్టలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా భారాస నేతలపై సీఎం మండిపడ్డారు. అధికారం పోయినా.. వారికి అహంకారం తగ్గలేదని విమర్శించారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని అంటున్నారని.. అనవసర ఆరోపణలు చేస్తే భారాస నేతలను తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని రాష్ట్రంలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలుగా మారుస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన తొలిరోజే బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తా మని విమర్శించారు. నా మాటలు గుర్తుపెట్టుకో చీఫ్ మినిస్టర్ అని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. నీలాంటి ఢిల్లీ గులాములు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణ ఖ్యాతిని అర్థం చేసుకోలేరని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. చిన్న పిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుందని అన్నారు. మానసిక రుగ్మత నుంచి రేవంత్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పరిస్థితులు ఎలా ఉన్నాయో వివరించేందుకు ఇవే తార్కాణాలు అని ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండు ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు. నిజామాబాద్‌లో పోలీసుల వేధింపులతో విసుగుచెందిన ఓ స్వీట్ షాపు యజమాని తన దుకాణాన్ని మూసివేస్తూ ఒక బ్యానర్ పెట్టారని తెలిపారు. ఒకవైపు ఇలా నిజామాబాద్‌లో చిన్న వ్యాపారులను వేధించడంలో బిజీగా ఉంటే.. మరోవైపు వరంగల్‌లోని రద్దీ రహదారిపై నిర్వహించిన కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో ఏసీపీ పాల్గొన్నారని వెల్లడించారు. ఈ వేడుకల్లో క్రాకర్స్ కాల్చడం వల్ల అమాయకులు గాయపడ్డారని మండిపడ్డారు.

### రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం

ఏర్పాటు చేసేందుకు పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని సీఎం సూచించారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు కోసం సచివాలయం ఆవరణను ఆయన పరిశీలించారు. విగ్రహం ఏర్పాటు కోసం స్థలం, నమూనాపై అధికారులతో చర్చించారు. డిసెంబర్ 9న సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే వెల్లడించారు. సోమాజీగూడ కూడలిలో ఉదయం నిర్వహించిన రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే బాధ్యత తమదని, తమ చిత్తశుద్ధిని ఎవరూ శంకించనవసరం లేదని స్పష్టం చేశారు. విచక్షణ కోల్పోయి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం, సామాజిక బహిష్కరణ చేస్తుందని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి మార్పు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా తుది రూపంపై చర్చలు జరుగుతున్నాయని, అసెంబ్లీలో నిర్ణయం తీసుకుంటామని గతంలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడించేలా, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందని వివరించారు.



# ఐదేళ్లలో 70 ఉపగ్రహాల ప్రయోగం

- చంద్రయాన్ 4, 5 డిజైన్లు సిద్ధం
- ప్రభుత్వం నుంచి ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాం
- డిసెంబరులో గగన్‌యాన్ చేపట్టే అవకాశం
- ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్

కోసం వరుస ప్రయోగాలు చేపడుతున్నాం. ఇప్పటికే చంద్రయాన్ 3 పూర్తయ్యింది. చంద్రయాన్ 4, 5 డిజైన్లు పూర్తయ్యాయి. ప్రభుత్వ ఆమోదం పొందే ప్రక్రియలో ఉన్నాయి. రానున్న కాలంలో ఇస్రో మొత్తంగా 70 శాటిలైట్ ప్రయోగాలు చేపట్టనుంది. ఇందులో వివిధ శాఖల అవసరాల కోసం తక్కువ ఎత్తులో చేపట్టే నావిక్, రిసోర్స్‌శాట్, కార్టోశాట్ వంటి ప్రయోగాలు ఉన్నాయి" అని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పేర్కొన్నారు. శుక్ర గ్రహం కోసం చేపట్టాల్సిన మిషన్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని తెలిపారు.మరోవైపు, మానవ రహిత గగన్‌యాన్ ప్రాజెక్టు ఈ ఏడాది డిసెంబరులో చేపట్టే అవకాశం ఉందని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పేర్కొన్నారు. అందుకు సంబంధించి అన్ని విభాగాల రాకెట్లు శ్రీహరి కోటకు ఇప్పటికే చేరుకున్నాయని చెప్పారు. మరోవైపు చంద్రయాన్ 4 మిషన్ 2028లో చేపట్టే అవకాశం ఉన్నట్లు ఇస్రో అధికారులు వెల్లడించారు.ఇటీవల పునర్వినియోగ వాహక నౌక పుష్పక్‌ను వరుసగా మూడోసారి ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ప్రతికూల పరిస్థితుల మధ్య నిర్వహించిన ప్రయోగంలో స్వయంప్రతిపత్తిగల ల్యాండింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు ఇస్రో పేర్కొంది. అంతరిక్షం నుంచి వచ్చిన నౌక కోసం అప్రోచ్ ల్యాండింగ్ ఇంటర్‌ఫేస్, హై స్పీడ్ ల్యాండింగ్ పరిస్థితులను సిమ్యులేట్ చేయడం ద్వారా పుష్పక్? అభివృద్ధికి అవసరమైన అత్యంత క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించినట్లు తెలిపింది. కర్ణాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్‌లో పుష్పక్‌కు సంబంధించిన చివరి పరీక్ష ఇదేనని వివరించింది

## నీట మునిగిన విలాస నౌక

తాజాగా ఇదే పడవలో మోర్గాన్ స్టాన్లీ బ్యాంక్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ జోనాథన్ బ్లూమర్, ఆయన సతీమణి, క్లిఫ్‌ఫోర్డ్ ఛాన్స్ లాయర్ క్రిస్ మోరవిల్లో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సిసిలీ సివిల్ ప్రొటెక్షన్ విభాగాన్ని ఉటంకిస్తూ బీబీసీ వెల్లడించింది. మిగిలిన నలుగురు ఎవరనే విషయం బయటకు రావాల్సి ఉంది.దాదాపు 56 మీటర్ల పొడవున్న బయేసియాన్ అనే విలాసవంతమైన యాట్ మొత్తం 22 మందితో ప్రయాణం మొదలుపెట్టింది. వీరిలో బ్రిటన్, అమెరికా, కెనడా వాసులు ఉన్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో తీవ్రమైన సుడిగాలి కారణంగా పడవ బోల్తాపడింది. ప్రమాదం నుంచి 15 మందిని కాపాడారు. షిప్ కుక్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ ట్రిప్‌ను తన సహోద్యోగుల కోసం లించ్ ప్లాన్ చేసినట్లు ఆయన ప్రతినిధి వెల్లడించారు. అమెరికాలో ఓ మోసం కేసులో లించ్ ఇటీవలే నిర్దోషిగా బయటపడ్డారు. లించ్‌పై అమెరికా టెక్ దిగ్గజం హెచ్‌పీ సాఫ్ట్‌వేర్ చౌర్యంపై గతంలో కేసు వేసింది. ఈ కేసులో లించ్‌తోపాటు ఆరోపణలు ఎదుర్కొన్న స్టీఫెన్ చాంబర్లైన్ కూడా నేడు యాదృచ్ఛికంగా ప్రాణాలు కోల్పోయాడు. యాట్ మునిగిన గంటల వ్యవధిలోనే ఈ ఘటన జరిగింది. కేంబ్రిడ్జ్‌షైర్‌లో స్టీఫెన్ శనివారం జాగింగ్ చేస్తుండగా ఓ కారు ఢీకొంది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడి లైఫ్ సపోర్టింగ్ వ్యవస్థపై ఆసుపత్రిలో ఉన్నాడు. లించ్ మరణించిన గంటల వ్యవధిలోనే అతడు కూడా ప్రాణాలు వదిలాడు.

### వ్యవసాయ సలహాదారుగా పోచారం

కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఛైర్మన్‌గా గుత్తా అమిత్ రెడ్డిని నియమించారు.

### జీహెచ్‌ఎంసీ పూర్తిస్థాయి కమిషనర్‌గా ఆమ్రపాలి

హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ కమిషనర్‌గా కోట శ్రీవాస్తవ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్, హైదరాబాద్ జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి మయాంక్ మిత్తల్‌ను బదిలీ చేసింది.

### ప్రమాదాలపై రైల్వేబోర్డు కీలక నిర్ణయం

టెక్నాలజీతో కూడిన సీసీటీవీ కెమెరాలను అమర్చనున్నట్లు రైల్వే బోర్డు ఛైర్‌పర్సన్, సీఈవో జయవర్మ సిన్హా వెల్లడించారు.ఏవైనా అసాధారణ పరిస్థితులను గుర్తించడంలో ఈ కెమెరాలు ఉపకరిస్తాయని ఆమె పేర్కొన్నారు. కుంబమేళాకు రైల్వేశాఖ సన్నద్ధతపై పలు రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లతో ఆమె సమీక్షించారు.ఈ సందర్భంగా రైల్వే ట్రాక్ భద్రతపై జయవర్మ సిన్హా మాట్లాడారు. కుంభమేళా సమయంలో సంఘ విద్రోహశక్తులు ట్రాక్‌లను ధ్వంసం చేయకుండా చూసేం దుకు భద్రతా ఏజెన్సీలు ట్రాక్‌లను నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు.

# నగరంలో భారీ వర్షం

మరో రెండు గంటలపాటు భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ వెల్లడించింది. నగరానికి ఎల్లో అలర్ట్ జారీచేసింది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. భారీ వర్షం కారణంగా స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డీఈవోలు ఆదేశాలు జారీచేశారు. కాగా, పంజాగుట్టలోని అపార్టుమెంట్ సుఖ్ నివాస్ అపార్టుమెంటు వద్ద పిడుగుపడింది. షెడ్డుపై పిడుగు పడి కారు ధ్వంసమయింది. దీంతోపాటు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు,సిబ్బంది అప్రమత్తమ య్యారు. ప్రజలు అవసరమైతేనే తప్ప బయటకు రాకూడదని హెచ్చరించారు. తెల్లవారు జాము నుంచి హైదరాబాద్ వ్యాప్తంగా వాన దంచికొట్టడంతో దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పార్సిగుట్టలో వర్షపు నీటిలో గుర్తుతెలియని వ్యక్తి గల్లంతయ్యాడు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్, కొంపల్లి, మాదాపూర్, దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, సరూర్‌నగర్, ఎల్బీనగర్, నాగోల్, అల్కాపురి, వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్ భారీ వర్షం కురిసింది. మలక్‌పేట, ఖైరతాబాద్, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్ నగర్, అబిడ్స్, నాంపల్లి, కుత్బుల్లాపూర్, బాలానగర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట, బహదూర్ పల్లి, సూరారం, సుచిత్ర, గుండ్ల పోచంపల్లి, పేట్ బషీరాబాద్, జీడిమెట్ల, నాగారం, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట, బాచుపల్లి, నిజాంపేట, ప్రగతినగర్, ముషీరాబాద్, రామ్‌నగర్, పార్సిగుట్ట, బౌద్ధనగర్‌లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. దీంతో రోడ్లలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. పలుచోట్ల మోకాలిలోతు వరకు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మలక్‌పేట రైల్వే స్టేషన్ వద్ద ఆర్వోబీ నీట మునగడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మలక్‌పేట రైల్వే స్టేషన్ నుంచి ముసారాంబాగ్, సంతోష్‌నగర్ వరకు, కోఠీ వైపు చాదర్‌ఘాట్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఇక ఉస్మానియా మెడికల్ కాలేజీవద్ద రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పార్సిగుట్టలో భారీగా వరద రావడంతో పలు ప్రాంతాలు ప్రమాద అంచుల్లో ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తి వర్షపు నీటిలో కొట్టుకుపోయారు. కొన్ని కార్లు కొట్టుకుపోయాయి. కాగా, నగరంలో మరో 2 గంటలపాటు భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించింది. భారీ వర్షాలకు జీహెచ్‌ఎంసీ, డిజాస్టర్ సిబ్బంది అప్రమత్త మయ్యారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# రుణమాఫీలో ఆలస్యం సరికాదు

పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో ఇవ్వనున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. వారికి సహకరించి పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడాలని బ్యాంకర్లకు సూచించారు భట్టి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్‌లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. మొదటి క్వార్టర్‌లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులు ఇప్పటివరకు 40.62? వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం నగదు నిల్వల నిష్పత్తి మొదటి క్వార్టర్‌లో 127. 29 శాతానికి మెరుగుపడడం మరో ఆసక్తికరమైన అంశం అని అన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని.. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ ముందంజలో ఉండేలా తమ ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వరి ఉత్పత్తిలో పెరుగుదల అంశం.. ఎఫ్‌సీఐకి వరిని సరఫరా చేసే రాష్ట్రాల్లో ప్రధాన రాష్ట్రంగా ఎదగడానికి వీలు కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగుకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. రాబోయే త్రైమాసికంలో నిర్దేశించిన రుణ ప్రణాళికను అధిగమించేందుకు బ్యాంకర్లు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు భట్టి పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి 36 వేల కోట్ల విలువైన ఎంఓఏలు కుదుర్చుకున్నారు. సూక్ష్మ, మధ్యతరహ పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుంది. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించండి. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో ఇవ్వనున్నాం. వారికి సహకరించి పారిశ్రామిక అభివృద్ధి చేయండి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్ లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నాను. మొదటి క్వార్టర్ లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులో ఇప్పటివరకు 40.62శాతం వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయం. రాష్ట్రం యొక్క నగదు నిల్వలనిష్పత్తి మొదటి క్వార్టర్లో 127. 29 శాతానికి మెరుగుపడడం మరో ఆసక్తికరమైన అంశం. ఇకపోతే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బ్యాంకర్లది కీలకపాత్ర అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుల ఖాతాల్లో తప్పులు సరిదిద్ది వారికి లబ్ది చేకూరేలా చేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ ఏడాది దేవుడి దయతో వర్షాలు పుష్కలంగా పడుతున్నాయని మంత్రి తుమ్మల అన్నారు. ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టకాలంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పథకం కింద రూ.18వేల కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని తుమ్మల చెప్పుకొచ్చారు. కొంత మంది రైతులకు ఇంకా మాఫీ కాలేదని, అందుకు రకరకాల కారణాలు ఉన్నాయని చెప్పారు. వాంటన్నింటినీ త్వరలోనే పరిష్కరించి రైతులకు తోడుగా నిలవాలని బ్యాంకర్లకు మంత్రి సూచించారు. నగదు జమ కాని రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన పని లేదని మంత్రి చెప్పుకొచ్చారు.గ్రామస్థాయిలో పని చేసే బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లను రైతుల రుణ ఖాతాల్లో తప్పులు సరిదిద్దేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సిందిగా బ్యాంకర్లను మంత్రి తుమ్మల కోరారు. రుణ మాఫీ చేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రుణమాఫీ కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేయడానికి సహకారం అందించాలని బాధ్యత బ్యాంకర్ల ఉందన్నారు. అంకెలు చదువుకోవడానికి ప్రతి మూడు నెలలకోసారి మీటింగులు, బ్యాంకర్ల సదస్సు నిర్వహించడంలో అర్థం లేదని తుమ్మల పేర్కొన్నారు. ప్రజలకు పథకాల ద్వారా ఆర్థిక ఫలాలు అందేలా చేయడంలో కీలకంగా వ్యవరించాలని కోరారు.

# దిగొచ్చిన కేంద్రం

విమర్శలను భాజపా దీటుగా తిప్పికొట్టింది. లేటరల్ ఎంట్రీ నియామకాల్లో పాటించే నిబంధనలను గుర్తుచేసే పలు ఆదేశాలను ఉటంకించింది. ఈ విధానంలోనూ రిజర్వేషన్లను కచ్చితంగా పాటించాలంటూ 2020లో కేంద్ర హోంశాఖ విడుదల చేసిన ఓ మెమోను గుర్తుచేసింది.రాహుల్ గాంధీ చెప్పేవన్నీ అబద్ధాలని కొట్టి పారేసింది. ఈ విమర్శలపై ఇదివరకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. "ఉన్నతోద్యోగాల్లో లేటరల్ ఎంట్రీపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని సూచిస్తున్నాయి. ఈ విధానాన్ని తీసుకొచ్చింది గత యూపీఏ ప్రభుత్వమే. 2005లో వీరప్ప మొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో ఎస్సార్సీ సైతం ఈ విధానాన్ని బలంగా సమర్థించింది. దాన్ని అమలుచేసేందుకు ఎన్‌డీయే ప్రభుత్వం పారదర్శక విధానాన్ని తీసుకొచ్చింది" అని అన్నారు.

**రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను కాంగ్రెస్ పరిరక్షిస్తుంది:రాహుల్**

లేటరల్ ఎంట్రీ విధానంపై కేంద్రం వెనక్కి తగ్గింది. ఈ పద్ధతి ద్వారా ప్రభుత్వంలో పలు శాఖల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఇచ్చిన ప్రకటనను రద్దు చేయాలంటూ యూపీఎస్సీకి కేంద్రం లేఖ రాయడంపై రాహుల్ గాంధీ స్పందించారు.రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను కాంగ్రెస్ పరిరక్షిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు."రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ వ్యవస్థను అన్నివిధాలా పరిరక్షిస్తాం. లేటరల్ ఎంట్రీ వంటి భాజపా కుయత్నాలను అడ్డుకుంటాం. మళ్లీ చెబుతున్నా.. 50% రిజర్వేషన్ పరిమితిని తొలగించడం ద్వారా కుల గణన ఆధారంగా మేం సామాజిక న్యాయాన్ని అందిస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు .ఆగస్టు 17న యూపీఎస్సీ 45 సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీలను ప్రభుత్వంలోని పలు శాఖల్లో నిపుణుల పేరిట లేటరల్ ఎంట్రీ విధానం ద్వారా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

# వైద్యుల భద్రతకు టాస్క్‌ఫోర్స్

ఆసుపత్రి అధికారులు, కోల్‌కతా పోలీసులు అప్పటివరకు ఏం చేస్తున్నారు?. మృతదేహా న్ని చూపించేందుకు తల్లిదండ్రులు గంటల పాటు వేచిచూసేలా ఎందుకు చేశారు? " అని సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. కేసు దర్యాప్తు స్టేటస్ రిపోర్ట్‌ను ఆగస్టు 22 కల్లా సమర్పించాలని కోర్టు సీబీఐని ఆదేశించింది.

**మరో అత్యాచారం కోసం ఎదురుచూడొద్దు**

"మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే.. పనిచేసే ప్రదేశంలో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్లే. ఈ రోజుల్లో చాలామంది యువ డాక్టర్లు 36 గంటలు ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం ఓ జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరం. మాపై విశ్వాసం ఉంచండి. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందుకు మరో అత్యాచారమో లేదా హత్యనో జరిగేవరకు మనం ఎదురుచూడొద్దు" అని ధర్మాసనం వెల్లడించింది. దీనికోసం 10 మందితో ఓ జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఏర్పాటుచేసింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. నాగేశ్వర్ రెడ్డి, సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి శరిన్, ఎయిమ్స్ దిల్లీ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు సభ్యులుగా ఉంటారని తెలిపింది. వైద్యుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై మూడు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇవ్వాలని ధర్మాసనం ఈ కమిటీని సూచించింది. ఈసందర్భంగా ఘటనను నిరసిస్తూ జరిగిన ఆందోళనలపై బెంగాల్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "శాంతియుత నిరసనకారులపై అధికారం చెలాయించొద్దు. ఇది దేశమంతా ఆందోళన వ్యక్తం చేస్తున్న అంశం. డాక్టర్లు, పౌరసమాజాన్ని అడ్డుకోవడం సరికాదు. క్రైమ్ సీన్‌ను రక్షించాల్సిన, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే" అని ధర్మాసనం మందలించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 22వ తేదీకి వాయిదా వేసింది.

**ఆసుపత్రుల్లో విజిటర్ల సంఖ్యపై పరిమితి విధించండి..**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది.ఈసందర్భంగా వైద్య సిబ్బంది భద్రత విషయమై ఆసుపత్రులు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది. అలాగే నిరసన వ్యక్తంచేస్తోన్న వైద్యులు తిరిగి విధుల్లోకి రావాలని ఈసందర్భంగా కోరింది. సీఐఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఘటన జరిగిన ఆర్‌జీ కార్ ఆసుపత్రి వద్ద భద్రత కల్పించాలని ఆదేశించింది. ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు అందించే గదుల వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు అవసరం కావొచ్చు. ఆసుపత్రుల్లోకి ప్రమాదకర వస్తువులు రాకుండా బ్యాగేజీ స్క్రీనింగ్ చేయాలి. పేషంట్లు కాకుండా..లోపలికి వచ్చే విజిటర్స్ సంఖ్యపై పరిమితి ఉండాలి.రద్దీని నిర్వహించడానికి సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. లింగంతో సంబంధం లేకుండా వైద్యులు, నర్సులకు రెస్ట్ రూమ్‌ల వసతి కల్పించాలి. అక్కడ బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ ఏర్పాట్లు ఉండాలి. ఆసుపత్రి ప్రాంగణంలోని అన్ని ప్రాంతాల్లో సరిపడా వెలుతురు ఉండాలి. అలాగే సీసీ కెమెరాలను అమర్చాలి. రాత్రి పది నుంచి తెల్లవారుజామున ఆరు గంటల మధ్యలో రవాణా సదుపాయం కల్పించాలి. బాధ, సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వర్క్‌షాపులను నిర్వహించాలి. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ప్రతి మూడు నెలలకొకసారి ఆడిట్ చేపట్టాలి. ఖూాఊః ంఞబి (మహిళా ఉద్యోగులందరికీ సురక్షితమైన పనివాతావ రణాన్ని కల్పించడం) వైద్య సంస్థలకు వర్తిస్తుంది కాబట్టి.. అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి వైద్య నిపుణులకు అత్యవసర పరిస్థితుల కోసం హెల్ప్‌లైన్ నంబర్స్ అందుబాటులో ఉంచాలి. "మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే.. పనిచేసే ప్రదేశంలో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్లే. ఈ రోజుల్లో చాలామంది యువ డాక్టర్లు 36 గంటలు ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం ఓ జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరం" అని విచారణ సందర్భంగా వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపింది. వైద్యుల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై మూడు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇవ్వాలని ధర్మాసనం ఈ కమిటీని సూచించింది. అలాగే రెండు నెలల్లోగా తుది నివేదిక సమర్పించాలని వెల్లడించింది.

### మాజీ ప్రిన్సిపాల్‌కు బిగుస్తున్న ఉచ్చు

కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో ఆర్థిక అవకతవలపై జూన్‌లో ఫిర్యాదు నమోదైనట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. అప్పటినుంచి దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారని పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. ఈ ఘటన జరిగిన ఆర్‌జీ కార్ ఆసుపత్రికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను పరిశీలించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక సిట్‌ను ఏర్పాటుచేసి అధిపతిగా ఐజీ ప్రణవ్ కుమార్‌ను నియమించింది. నెలలోగా తొలి నివేదిక సమర్పించాలని కోరింది. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

# ఎంపాక్స్ కొవిడ్‌లా కాదు

ఆరోగ్య సంస్థ చెప్పిన మాట కాస్త ఊరటనిస్తోంది. ఎంపాక్స్ కొవిడ్ కాదని, దాని వ్యాప్తిని నియంత్రించొచ్చని తెలిపింది.డబ్ల్యూహెచ్‌ఓలో యూరప్ రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హాన్స్ క్లుగే మీడియాతో మాట్లాడుతూ.. ఎంపాక్స్ వ్యాప్తిని నియంత్రించేందుకు, నిర్మూలించేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమయంలో ప్రపంచం స్పందించే తీరు కీలకమని వ్యాఖ్యానించారు. "దీనిని కలిసికట్టుగా ఎదుర్కోవాలి. మనం ఈ వైరస్‌ను నియంత్రిస్తామా..మరోసారి నిర్లక్ష్యం, భయం వైపు వెళ్తామా..అనేది మన స్పందనపై ఆధారపడి ఉంటుంది. రానున్న ఏళ్లలో ఐరోపా, ప్రపంచానికి ఇది మరో పరీక్షే" అని హెచ్చరించారు.ఇదిల ఉంటే..మంకీపాక్స్ పై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు..బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని నౌకాశ్రయాల దగ్గర కూడా నిఘా పెంచాలని, మంకీపాక్స్ లక్షణాలు ఉన్న వారెవరైనా కనిపిస్తే వెంటనే తెలపాలని పేర్కొంది. మంకీపాక్స్ వైరస్ సోకిన వారిని ఐసోలేషన్‌లో ఉంచేందుకు, చికిత్స చేసేందుకు వీలుగా దేశరాజధాని దిల్లీలోని రామ్ మనోహర్ లోహియా, సఫ్దర్ జంగ్, లేడీ హార్డింగ్ ఆసుపత్రులను ఆరోగ్యమంత్రిత్వశాఖ గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంకీపాక్స్ నోడల్ కేంద్రాలుగా తమ పరిధిలోని కొన్ని ఆసుపత్రులను గుర్తించాలని పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం.. 2022 నుంచి ఇప్పటివరకు 116 దేశాలకు ఎంపాక్స్ వైరస్ విస్తరించింది. మొత్తం 99,176 కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాంగోలో వేగంగా వ్యాపిస్తోంది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 15,600 కేసులు నమోదు కాగా 537 మరణాలు సంభవించాయి.

# పర్యాటక ప్రాంతాలకు జీవం పోస్తాం

- సమస్యలను గుర్తించి నిధులు కేటాయిస్తాం..
- రాష్ట్రంలో చారిత్రక ప్రదేశాలకు ప్రాధాన్యత నిస్తాం..
- పర్యాటక ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తాం..
- ప్రజలు నెలకోసారి పర్యాటక ప్రాంతాలను సందర్శించాలి..
- మంత్రి జూపల్లి కృష్ణారావు..
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి : మంత్రి సీతక్క..
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంత్రుల సుడిగాలి పర్యటన





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పర్యాటక ప్రాంతాలకు నిధులు కేటాయించి జీవం పోస్తామని, చారిత్రక ప్రదేశాలకు ప్రాధాన్యత నిస్తామని, పర్యాటక రంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క లు సుడిగాలి పర్యటన చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన రేగొండ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని, రేగొండ పరిధిలోని బుగులోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆ తరువాత వచ్చిన మంత్రి సీతక్కతో కలిసి చారిత్రక ప్రదేశాలైన రేగొండ సమీపంలోని పాండవుల గుట్ట, గణపురంలోని కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలు నెలకోసారి పర్యటక ప్రాంతాలను సందర్శించాలన్నారు. అనేక నిధులు వెచ్చించి పర్యాటక రంగాలను బాగు చేసుకోవడం జరుగుతుందని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలతో కలిసి తల్లిదండ్రులు ఆహ్లాదకరమైన వాతావరణంలోకి తీసుకెళ్లి, చారిత్రక ప్రదేశాల చరిత్రను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో వారి మనసు కుదుట పడుతుందని చెప్పారు. తాను రాష్ట్రంలో వివిధ ప్రాంతాలను పరిశీలిస్తూ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయని తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అవసరమైన చోట నిధులు కేటాయించి పర్యాటక రంగానికి ప్రాధాన్యత నిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అంచెలంచెలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. పాండవుల గుట్ట గురించి గతంలోనే విన్నామని, ఈ ప్రాంతంలో అవసరమైన నిధులు కేటాయించి, రూప్ వే ఏర్పాటు, మెట్ల నిర్మాణం, కాటేజీలు, హోటళ్ల ఏర్పాటు పర్యాటకులకు అవసరమయ్యే వసతులన్నీ కల్పించేందుకు నిధులు కేటాయిస్తామని అన్నారు. మైలారం గూహలు, గణపురం కోటగుళ్లు, అనేక చోట్ల అపురూపమైన చారిత్రక కట్టడాలు ఉన్నాయని, వాటిని పరిశీలించి నిధులు కేటాయిస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు, పురాతన కట్టడాలు, దేవాలయాలు, జలాశయాలు, అడవులు ఉన్నాయని, పాండవుల గుట్టకు ఎంతో ప్రాధాన్యం ఉందని, పాండవులు ఇక్కడ వనవాసం చేసిన ఆనవాళ్లు ఉన్నట్లు తెలిపారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ గుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం వల్ల ఈ ప్రాంత యువతకు, ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. గొప్ప చారిత్రక ప్రదేశమని, ఈ గుట్టలో ఆనాటి కాలపు పెయింటింగ్స్ ఇప్పటికి చెక్కుచెదరలేదని తెలిపారు. పాండవుల గుట్ట రాష్ట్ర, దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేస్తామని అన్నారు. అన్ని వయస్సుల వారు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రోప్ వే, ట్రెక్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల మంత్రులు ద్వారా రహదారి కనెక్టివిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్యాటకులు రావడానికి రహదారులు చాలా ముఖ్యమని తెలిపారు. పర్యాటకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు చాలా చక్కటి ప్రదేశమని తెలిపారు. పర్యాటకులు ఇక్కడ బస చేసేందుకు ఆహారం సౌకర్యాలు కల్పనకు పర్యాటక శాఖ ద్వారా క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. శాశ్వత తాత్కాలిక వసతులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సిబ్బంది ఈ ప్రాంతంలో పర్యటించి అన్ని అంచనాలను తయారు చేయాలని ఆయన పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల ద్వారా నిధులు మంజూరుకు కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

### వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి..: మంత్రి సీతక్క..

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. గణపురంలో జరిగిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలైన జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయని, వాటి చరిత్ర ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లోనే టూరిజం ఉండేదని కాలక్రమేనా రోజులు గడిచిన కొలది మారుమూల ప్రాంతాల్లో కూడా అద్భుతమైన కట్టడాలు శిల్పాలు బయటపడుతున్నాయని, వాటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో పల్లెల జీవన విధానంలో అనేక మార్పులు ఉంటాయన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పల్లెలు ఉంటాయని చెప్పారు. ఈ ప్రాంతానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రావడం అభినందనీయమని ఈ ప్రాంత పర్యాటక ప్రాంతాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, తన వంతు కూడా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి సీతక్క హామీ చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్లమెంటు సభ్యులు డా కడియం కావ్య, భూపాలపల్లి, వర్ధన్నపేట శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, నాగరాజు, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్, పర్యాటక శాఖ ఎండి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అటవీ శాఖ అధికారి వసంత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి

- క్రెడాయ్ సమావేశంలో మంత్రుల స్పష్టీకరణ




**హైదరాబాద్, ఆగస్ట్ 20 (జనంసాక్షి) :** గతంలో వైఎస్ ప్రభుత్వం చేపట్టిన పనుల వల్లే హైదరాబాద్ అభివృద్ధికి బీజం పడిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. క్రెడాయ్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వల్లే అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడికి వచ్చాయి. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ కోసం కందుకూరు వైపు అభివృద్ధిపై దృష్టి పెట్టాం. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐతో చర్చించాం. స్థిరాస్తి వ్యాపారుల సమస్యల్ని మంత్రిమండలి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను. భారాస ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది. ఒక్కో సమస్యను తీరుస్తూ వస్తున్నాం. సోనియా ఇచ్చిన తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అని కోమటిరెడ్డి పేర్కొన్నారు. స్థిరాస్తి రంగ వ్యాపారులకు అండగా ఉంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. క్రెడాయ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్రాన్ని మరో స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి రాకముందు వైమానిక రంగంలో పని చేశాను. హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో పోటీ పడుతుందనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. నగరానికి కృష్ణ, గోదావరి జలాలను తీసుకొచ్చిన ఘనత, మెట్రో నిర్మించిన ఘనత కాంగ్రెస్‌దేనని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

### ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టం.. యువకుడి సూసైడ్

**నల్గొండ, ఆగస్ట్20 (జనంసాక్షి) :** ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భారీగా డబ్బులు పోగొట్టుకుని.. అప్పులు చేసిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్గొండలో వెలుగుచూసింది. నల్గొండ మున్సిపాలిటీలోని నెహ్రూ నగర్‌కు చెందిన సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాలియా 14 మైల్స్ వద్ద సాగర్ ఎడమ కాల్వలో దూకేశాడు. బెట్టింగ్‌లో రూ.2 కోట్లు పోగొట్టుకున్న సాయికుమార్, అప్పులు ఎక్కువ కావడంతో సూసైడ్ చేసుకున్నట్లు అతను రికార్డ్ చేసిన సెల్ఫీ వీడియోతో స్పష్టమైంది.

# రుణమాఫీ కానీ వారు ఆందోళన చెందొద్దు

- రైతులు బిఆర్ఎస్,బీజేపీ చట్రంలో పడద్దు
- బీజేపీ ఈ పది సంవత్సరాల్లో రైతులుకు ఏమైనా చేసిందా?
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**భీమదేవరపల్లి, ఆగస్టు 20 (జనం సాక్షి) :** రుణమాఫీ కానీ వారు ఆందోళన చెందొద్దని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. భీమదేవరపల్లి మండలంలోని కొత్త కొండ వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం రుద్ర హెూమం లో పాల్గొన్నారు. వీరభద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలవి ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో ఉండాలనీ,రైతులు మంచి పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని రుద్ర హెూమం లో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేనని రవాణా బీసీ, సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.ప్రతిపక్షాలు రైతాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని రైతులు బిఆర్ఎస్,బీజేపీ చట్రంలో పోవద్దని సూచించారు.ఇప్పటి వరకు రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ పూర్తి అయిందని,ఎవరికైనా రుణమాఫీ కాకపోతే రైతాంగం ఆందోళన చెంద వద్దని మండల కార్యాలయాల్లో వ్యవసాయ అధికారులను కలసి అప్లికేషన్ ఇవ్వాలని సూచించారు.వారు పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అమలు అయ్యేలా చూస్తారని పేర్కొన్నారు.రైతు రుణమాఫీ 2018 డిసెంబర్ 12 కంటే మందు,2023 డిసెంబర్ 9 తరువాత లోన్ తీసుకున్న వారిని రుణమాఫీ వర్తించదని పేర్కొన్నారు.బిఆర్ఎస్ 10 ఏళ్లలో లక్ష రూపాయల రుణమాఫీ ఎన్ని విడతల చేశారు.? ఎంత మంది కి ఇచ్చారు? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయంలో లక్ష రూపాయలు రైతు రుణమాఫీ విడతల వారిగా చేయడానికి 5 సంవత్సరాలు పట్టిందని, మాటమీద నిలబడే ప్రభుత్వం మాది ఒకేసారి రుణమాఫీ చేసి మాటన నిలబెట్టుకున్నం,అది తెలంగాణ రైతాంగం మ్నెత్తానికి ఒకే దశలో రైతు రుణమాఫీ పూర్తి చేశామని తెలిపారు.పూజ కార్యక్రమంలో పాల్గొన్న వారు అలయ ఈవో పి కిషన్ రావు,ఉప ప్రధానార్చకులు కే రాజయ్య, ముఖ్య అర్చకులు రాంబాబు,అర్చకులు శ్రీకాంత్, రమేష్, వినయ్ శర్మ, సందీప్,చంద్ర శివకుమార్,శ్రావణ్,గురు ప్రసాద్,నక్షత్ర దీక్ష స్వాములు భక్తులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కాలేదని రైతుల రాస్తారోకో

- రేషన్ కార్డు ప్రాతిపదికన రుణమాఫీ పై రోడ్డెక్కిన రైతాంగం
- అధికార పార్టీ నాయకులే రోడ్డెక్కిన వైనం



**బయ్యారం, ఆగష్టు 20 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేసిన రైతు రుణమాఫీ పై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మూడు దశలలో విడుదల చేసిన రైతు రుణమాఫీ లో పంద్రాగస్టు కు%తీ% రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి సహా మంత్రులు కూడా అనేక వేదికలపై ప్రకటించగా రుణమాఫీ పట్ల రైతులు ఆశాభావంతో ఉండగా చివరికి వారి ఆశలపై నీళ్లు చల్లింది రేవంత్ సర్కార్.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం రెండు లక్షల రైతు రుణమాఫీ అర్హులైన ప్రతీ ఒక్కరికి అందాల్సి ఉండగా దశలవారీగా మూడు దఫాలుగా రుణమాఫీ ని విడుదల చేసినప్పటికీ మండలంలో దాదాపు 60శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని అధికార పార్టీ నాయకులే బహిరంగ ప్రకటన చేస్తున్న తరుణంలో మంగళవారం బయ్యారం మండల కేంద్రంలో ఇల్లందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల నాయకులు భూక్యా రవినాయక్ మాట్లాడుతూ... మండలంలో రైతుల రుణమాఫీ విషయం లో తీవ్ర అన్యాయం జరిగిందని, రేషన్ కార్డు ఆధారంగా రుణమాఫీ చేయడంతో కుటుంబం లోని భార్య భర్తలిద్దరిపై ఉన్న బకాయిలు రెండు లక్షల పైగా ఉండడంతో అలాంటివారికి రుణమాఫీ అవ్వలేదని, ఈ విషయంపై ముఖ్యమంత్రి చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బానోత్ సుధాకర్ మాట్లాడుతూ... రెండు లక్ష ల రుణమాఫీ పై బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో రెండు లక్షల పై ఉన్న బకాయిని తొలుత చెల్లిస్తేనే రెండు లక్షల రుణమాఫీ అమలవుతుందని రైతులను మభ్యపెడుతున్నారని, దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి రుణమాఫీ బాధితులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో జిల్లా కేంద్రంలో రైతులతో ధర్నా చేపడతామని అన్నారు.

### అధికార పార్టీ నాయకులే రుణమాఫీ పై ఆందోళనకు ఆంతర్యమేంటి!?

రైతులకు అండగా రుణమాఫీ బాధితులకు అధికార పార్టీ నాయకులే ఆందోళన చేపట్టడంతో మండలంలో చర్చ నీయాంశంగా మారింది.రానున్న స్థానికల ఎన్నికలే లక్ష్యంగా సొంత గ్రామాల్లో రైతుల నుండి వ్యతిరేకతను అడ్డుకునేందుకే రైతుల పక్షాన నిలబడినట్లు స్పష్టంగా అర్థమౌతుందని పలువురు చర్చిస్తున్నారు.



# మాకేది రుణమాఫీ?

- మేము అర్హులం కాదా? అని రైతులు నిలదీత
- అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నామని పలువురు ఆవేదన

**బోథ్ ఆగస్ట్ 20(జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అంత గందరగోళంగా మారింది.జాబితాలో పేరు ఉన్న కొందరికి రుణమాఫీ కాలేదు. రుణమాఫీ అయిందా లేదా అని తెలుసుకుందామని రైతులు బ్యాంకులకు వెళ్తే బ్యాంకులన్ని రైతులతో కిటకిటలాడు తున్నాయి. దీంతో మండల కేంద్రంలోని మంగళవారం అంబేద్కర్ కూడాలి వద్ద మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎటువంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 లోపు రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తా నాని రైతులను మోసగించి దాని అందుకే ఈ రోజు వ్యవసాయ పొలంలో ఉండే రైతు రోడ్డెక్కి పరిస్థితి నెలకొందని అని అన్నారు. రోడ్లపై ధర్నాలు రాస్తారోకోలు చేయడం చాలా సిగ్గుచేటని రైతుల గోస తప్పక తగులుతుంది అన్నారు. అనంతరం ధర్నా చౌక్ నుండి బోథ్ తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి స్థానిక తహసిల్దార్ కు రైతులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ బోడ్డు శ్రీనివాస్,మాజీ సర్పంచ్ లు శ్రీదర్ రెడ్డి, సురేందర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్ , దివాకర్ రెడ్డి,రాజా రెడ్డి, కుడల స్వామి,తుల హరీష్,మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీలతో పాటు మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మరణంలోని వీడని బంధం



- రోడ్డు ప్రమాదంలో ట్విన్స్ మృతి

ఖమ్మం రూరల్, ఆగష్టు 20 (జనం సాక్షి) : వారిరువురు (ట్విన్స్) కలిసే జన్మించారు. కలిసే ఇన్నాళ్లు జీవించారు... చివరకు విధివక్రీకరించి రోడ్డు ప్రమాదంలో మరణంలోనూ ఇద్దరూ కలిసే మృత్యు ఒడిలోకి వెళ్ళారు. ఈ హృదయ విదారకరమైన సంఘటన ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రామన్నపేటకు చెందిన ఇద్దరు కవలలు (ట్విన్స్) కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి ముగ్గురు కలిసి ఖమ్మం నుంచి జక్కేపల్లి వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి ఖమ్మం వస్తున్న ఓ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు కవలలు అక్కడికక్కడే మృతిచెందగా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను అన్నం ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పూరి వివరాలు తెలియాల్సివుంది.

# సహజ సిద్ధమైన ఉత్పత్తులను వినియోగించండి



- ఎమ్మెల్యే మురళీ నాయక్

**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్టు 20 ( జనం సాక్షి):** ప్రకృతి సహజ సిద్ధమైన ఉత్పత్తులను వినియోగించి కాలుష్య రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కల్పవృక్ష ఆయుర్వేద ఓపీసీపీవీటీ ఆధ్వర్యంలో సేంద్రీయ సాగు పంట ఉత్పత్తుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించి జ్యూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. సేంద్రియ సాగు పంటలు మానవాళి కి ఆరోగ్య రక్షణ అని అన్నారు. రసాయన ఎరువులు క్రిమీ సంహారక మందుల వాడకంతో పండించిన పంటలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులు కలుషితమై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విషతుల్యమైన ఆహార పదార్థాలను లను ఉత్పత్తి చేసి భావితరాలకు ముప్పు కలిగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# లెటరల్ ఎంట్రీపై మోడీ యూ టర్న్



**కేంద్రంలో 45 మంది ఐఏఎస్‌ల లేటరల్ ఎంట్రీ ప్రకటనను వెనక్కు తీసుకునే విధంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసేసారు. పీఎం నరేంద్ర మోడీ వెనక్కు తగ్గే పరిస్థితి వచ్చింది. అసలే పార్లమెంట్‌లో మెజారిటీ లేక ఎన్డిఏ కూటమి లోని ఎంపిల మద్దతుతో మోడీ మూడో సారి పీఎం అయ్యారు. మునుపటి లాగా, గత పది ఏండ్ల మాదిరి ఏకపక్ష పాలన ఇప్పుడు ఉండదు!**

ఈసారి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. 230 స్థానాలు సాధించి ఇండియా కూటమి బలంగా ఉన్నది. అందుకే నిపుణులను రిజర్వేషన్ లేకుండా భర్తీ చేయడానికి ఇచ్చిన నోటిఫికేషన్ ను రద్దు చేసే పరిస్థితి వచ్చింది. అన్నిరకాల భర్తీలలో ఏ సామాజిక వర్గం వారు ఎంత మంది ఉంటే వారిది అంత భాగస్వామ్యం ఉండాలని, కుల గణన జరిగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తూ వస్తున్నారు.కేంద్రంలో ఎస్సి,ఎస్టీ, వెనకబడిన తరగతుల రిజర్వేషన్ ల కు తూట్లు పొడిచే విధంగా గతంలోనే బీజేపీ ప్రభుత్వం 63 ఐఏఎస్ లను, నిపుణులను లేటరల్ ఎంట్రీ ద్వారా భర్తీ చేసింది. మరోసారి అదే పద్దతి ని అవలంబించే కుట్ర ను ముందు రాహుల్ గాంధీ, ఆ తర్వాత మాజీ యూపీ సీఎం అఖిలేష్ యాదవ్, తమిళనాడు సీఎం స్టాలిన్ లతో పాటు అందరూ ఇండియా కూటమి లోని అందరూ కేంద్రం లేటరల్ నియామకాలను వ్యతిరేకిస్తూ మాట్లాడారు.ఆందోళన కు ఇండియా కూటమి సిద్ధం అయింది. మరో వైపు ఎన్డిఏ భాగస్వామ్యం లో ఉన్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడ లేటరల్ పద్దతిని బహిరంగంగా వ్యతిరేకించారు. దీనితో కేంద్రానికి ఆ పద్దతిని ఉపసంహరించుకుంటున్నట్లు, సామాజిక న్యాయం కోసమనే ఒక ముక్కను తగిలించారు. జు ఖానే వాలా రహాతో కెత్నే భి తురుమ్ ఖాన్ కు, స్పెషల్లి మన తానాషాహీ పీఎం నరేంద్ర మోడీకో జుక్నా పడేగా?అవును కచ్చితంగా తప్పును, తప్పు అని రుజువు చేసి ఒత్తిడి చేసేవారు ఉంటే, తప్పు ను తప్పును ఒప్పుకోక తప్పదు. ఇప్పుడు పీఎం మోడీ వెనక్కు తగ్గడం, ఆయనకు డివి నుంచి భువికి దిగిరాక తప్పలేదు, అనక తప్పదు!ఇండియా కూటమి విజయం ఇది! బీజేపీ విధానాలు రాజ్యాంగం కు, రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్ లకు వ్యతిరేకం అనేది ఇప్పుడైనా గుర్తించే వారు గుర్తిస్తే మంచిది. సోషల్ జస్టిస్, సామాజిక న్యాయం అని కేంద్రం ఇప్పుడు ఎన్ని ముచ్చట్లు చెప్పినా, లేటరల్ ఎంట్రీ మీద వారి వద్ద సమాధానం లేదు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు త్వరగా జరుగనున్న నేపథ్యంలో లేటరల్ ఎంట్రీ నిర్ణయం పై తప్పని పరిస్థితుల్లో కేంద్రం యూ టర్న్ భారీగానే బీజేపీ కి నష్టం, కష్టం కలిగించే విషయమే అంటే అతిషయోక్తి కాదు.

• ఎండి.మునీర్

# పదవి కాంక్ష వర్సెస్ నిజాయితీ



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

*పదవీ కాంక్ష వర్సెస్ నిజాయితీ గల నేతల మధ్యన ఇప్పుడు పోటీ పెరిగింది. పదవి కోసం నానా గడ్డి కరిచే నేతలు ఒక దిక్కు, నిజాయితీగా ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చిన, వచ్చే వారు ఒకవైపు కనిపిస్తున్నారు. ప్రజల నుంచి, ప్రజల కోసం పుట్టుకొచ్చిన నాయకుల్లో 5 శాతం నుంచి పదిశాతం మందికే పదవులు లభించగా, నడిమంత్రపు సిరులు ఒలకబోసి పదవులు సంపాదించుకున్నవారే ఎక్కువ కనిపిస్తున్నారు.*

దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఎటు చూసినా, కుడి, ఎడమల దగా, దగా, అన్నట్లు వీరే కనిపిస్తారు. ప్రజల సమస్యలు వీళ్లకు







పట్టవు అనేకన్నా, వీరికి తెలియవు అనవచ్చు, వీరికి అవగాహనే ఉండదు. తెలుసుకునే ప్రయత్నం చేయరు! వీరికన్నా తెలివిగలోళు ్ళ వీరికి దూరంగా ఉండాలనే చూస్తారు.దేశంలో, రాష్ట్రాల్లో ఏమిజరుగుతున్నదో వీరికి పట్టదు,

**అంతా ఫక్తు స్వంతం కోసమే..**

ఫక్తు స్వంత ప్రాపకం, స్వమర్యాదలు, స్వకార్యాలు, దండాలు పెట్టించుకునుడు, దండలు వేసుకునుడు, అందులోనే 'రంగా ఖుష్' వారికి, వారి వెంట తిరిగే, అసలు జనంలో ఏమాత్రం గుడ్ విల్ లేని, వ్యక్తులతోనే వారి పొద్దు గడుస్తుంది. అస్సలు, అధ్యయనం, ఆచరణ ఉండదు!ప్రస్తుతం దేశంలో రాజకీయాలు మొత్తం ఉపశమనపు రాజకీయాలు అయిపోయాయి. రాజకీయాలు ఇప్పుడు ఒక తోపుడు బండి టిఫిన్ సెంటర్‌లు అయ్యాయి. పగలు టిఫిన్స్ అమ్ముకుని మధ్యాన్నం బంద్. నేల మీది నిజం ను వీళ్ళు జీర్ణించుకోలేరు. నిజం వారికి వ్యతిరేకతగా కనిపిస్తుంది. సూచన, సలహా మరీ వారిని తప్పుదారి పట్టిస్తున్నారనే అభిప్రాయం తో కూడిందిగా కనిపిస్తుంది.ఎవరికి వినరు! తమకు తెలిసిందే వేదం అనుకుంటారు. నా అనుభవంలో నేను అలాంటి వారిని చాలా మందిని చూసాను. చూస్తున్నాను! ఎందుకంటే ఇప్పటి నేతలవి అన్నీ 'టినోపాల్ 'రాజకీయాలు వారంతా రెడీమేడ్ లు కాబట్టి వారి మీద వారికే నమ్మకం తక్కువ,ఇక ఇతరులను,ఒకరిని నమ్మే,పరిస్థితి ఉండదు!ఒకరి మాట మీద నమ్మకం లేకపోవడం, తమని తాము, అన్నీ తమకే తెలుసు అనే ఎక్కడలేని, ఎందుకు కూడా కొరగాని, పనికి రాని గర్వం, అహం,ప్రస్తుత రాజకీయాల కారణంగా వారిని ఆవహించడం చూస్తున్నాము. సమాజం పట్ల, సమాజ హితంలో పని చేస్తున్న వ్యక్తుల పట్ల వారు ఏ రంగం లో ఉన్నవాళ్లు అయినా ఒక అవగాహన లేక పోవడం వల్ల ప్రజల్లో అతి త్వరితగతిన వారు పచ్చి పులుసు కన్నా పలుచగా అయిపోతున్నారు.

**ప్రజలతో కాంటాక్ట్‌లో ఉండండి**

ప్రజలతో నేరుగా కాంటాక్ట్స్ ఇటీవల నేతలకు దెబ్బ తింటున్నాయి. ప్రజలతో నేరుగా వారు కాంటాక్ట్ లో ఉండడానికి ఇష్టపడరు. ఇందుకోసం మధ్యవర్థుల లొల్లి అడ్డం పడుతుంటుంది. కుల, మత రాజకీయాలకే ప్రాధాన్యత ఉంటున్నది. ఒక కేంద్ర హోమ్ శాఖ మంత్రిగా ఉండి సోమవారం మంచిర్యాల లో ఒక పాఠశాల లో కార్యక్రమం కు వచ్చిన బండి సంజయ్ తెలంగాణ విద్యా రంగం లో మావో, మార్క్స్ భావజాలం ను అమలు చేసే ప్రమాదం ఉందని అంటారు.హిందూ భావజాలం, సమాజం ను కాపాడుకుందాం అంటారు. ఒక విద్యా సంస్థ కార్యక్రమం లో పాల్గొన్న కేంద్ర మంత్రి ఉపన్యాసం ఆయన స్థాయికి తగిన విధంగా లేదు. అందరూ ఇలాగే తయారు అయ్యారు. సమాజం పట్ల,కులమతాలకు అతీతంగా జీవిస్తున్న సెక్యూలర్ భారతదేశంలో జనంను విభజించించి మాట్లాడడం ఆందోళనకరం. రాజకీయాల్లో ఇప్పుడు సమాజం పట్ల గౌరవం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన ప్రజా ప్రతినిధులకు అవసరం. అధికారం ఎప్పుడు ఒక్కరికే, ఒక పార్టీకే గుత్త కాదు,కొంత సమయం పడుతుంది ఏమో కాని,అధికారం ఎవరి జాగీరు కాదు. మార్పు ఖాయం. ఆ విషయం దృష్టిలో పెట్టుకుని నాయకులు మెదలాలి. నిలబడాలి. అధికారంలో ఉన్నాము కదా అని ఎక్కువ తనాషాహీగిరి చేస్తే, అందలం ఎక్కించిన వారే నేల కేసి కొడతారు. అచ్చు తెలంగాణ లో చెప్పాలంటే, జాడిచ్చి కొడుతరు. అధికారం ఇక్కడ ఎవరికి శాశ్వతం కాదు! పుట్టుక, చావు ఎట్ల గ్యారంటీనో, అధికారం అనేది కూడ ఎప్పటికి ఒక్క పార్టీ, వ్యక్తుల చేతిలో శాశ్వితంగా ఉండదు! అనేది అందరూ గుర్తెరిగి ఉంటే మంచిది.పదవి కాంక్ష మనిషిని పరస్పరం శత్రువును, ఒక్కోసారి క్రిమినల్ ను చేస్తున్నది. అదే నిజాయితీ మనిషి గా నిన్ను సమాజం లో నిలబెట్టి, జనం గుండెల్లో శాశ్వత చోటును కల్పిస్తున్నది!బీ అలర్ట్! సభ్య సమాజం గమనిస్తున్నది! సమాజానికి భయపడండి! **(ఎవరికి వర్తిస్తే వారికి)**

**న్యాయం కోసం ఆర్‌జీ కర్ హాస్పిటల్**

# జూనియర్ వైద్యుల పోరాటం



కేశవ్

ప్రపంచీకరణ గాలుల్ని ఒకసారి మనం పరిశీలిస్తే మనకు మరిన్ని విషయాలు అర్థమవుతాయి. 1990ల తర్వాత భారతదేశంలో ప్రపంచీకరణ గాలులు ఆరంభమయ్యాయి. భారతదేశం బయట దేశాల పెట్టుబడులను విపరీతంగా ఆహ్వానించింది. ఇలా మాత్రమే దేశం ముందుకు వెళుతుందని, దేశం ఎదుర్కొంటున్న ఫారెక్స్ క్రైసిస్ ని తట్టుకోగలదని ఆనాడు భారత ప్రజానీకానికి నాయకులు, ఆర్థికవేత్తలు అర్థం చేశారు. 30 సంవత్సరాల తర్వాత భారతదేశాన్ని ఒకసారి మనం పరిశీలించి చూస్తే, ఈ విధానాలు ఎంత తప్పుడు విధానాలో, ఎంత ప్రజా వ్యతిరేక విధానాలో మనకు అర్థమవుతాయి గత 30 సంవత్సరాల్లో కుబేర్లు మరిన్ని వేల కోట్లు సంపాదించుకొని అపర కుబేరులు అయ్యారు. ఆర్థిక విధానాలు వీరికే విపరితమైన డిస్కౌంట్లు ఇస్తుంది. విపరీతమైన రాయితీలు ఇస్తూ, మీరు మరింత బలంగా తయారయ్యేలా ఆ విధానాలు సహకరించాయి. ఈ 30 సంవత్సరాల్లోనే మనం ఏం చూసాం. అంటే, సాధారణ ప్రజలు మరింత పేదరికంలోకి నలిగిపోయారు. పరిశ్రమలు తగ్గిపోయాయి. ప్రభుత్వం దగ్గర, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న పరిశ్రమలు మెల్లమెల్లగా ప్రైవేటు వారి యాజమాన్యంలోకి వెళ్లాయి. మరికొన్ని మూతపడ్డాయి. అత్యంత పెద్ద రైల్వే పరిశ్రమ కూడా నేడు విపరీతమైన కష్టాల్లో ఉంది. నిరుద్యోగం తాండవిస్తోంది. సరైన నాణ్యమైన విద్యను కూడా మనం అందించలేకపోయాం. ఆరోగ్యం అనేది కూడా ప్రైవేటు వారి చేతుల్లోకే వెళ్లిపోతుంది. బడా పెట్టుబడిదారులు ఆరోగ్య పరిస్థితిని ముడిసరుగ్గా తీసుకొని విపరీతమైన లాభాలను గడిస్తున్నారు. పాలసీల పేర్లు చెప్పి వేల కోట్ల రూపాయల వ్యాపారం నడుస్తుంది. ఉద్యోగ నియామకాలు కూడా చాలా చాలా తగ్గిపోయాయి. ఇదే నేపథ్యంలో, మనం ఇప్పుడు నిర్వహిస్తున్న పరిశ్రమలలోకి, ఒక సంస్థల్లోకి ఒకసారి పరిశీలించి చూస్తే, హాస్పిటల్స్ లో సెక్యూరిటీ అనేది మొదట ప్రభుత్వం చేతుల్లో ఉండేది. నేడు, కాంట్రాక్ట్ పద్ధతిలో కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్ళింది. ఎన్నో ప్రభుత్వ హాస్పిటల్స్ లో సెక్యూరిటీని అందించాల్సిన అత్యంత ముఖ్యమైన అంశం ప్రభుత్వం చేతులు దులుపుకొని కాంట్రాక్టర్ల చేతుల్లోకి అందించింది. ఈ కాంట్రాక్టర్లు అత్యంత తక్కువ జీతం అందిస్తూ ఆసుపత్రులకు సెక్యూరిటీని అందిస్తున్నారు. పోలీసుల నియామకాలు కూడా తగ్గిపోయి, అత్యంత తక్కువ జీతంలో సివిక్ వాలంటీర్ల నియామకాలు ఆరంభమయ్యాయి. ఈ సివిక్ వాలంటీర్ల నియామకాలకు పెద్ద సరంజామా ఏమీ లేదు. పెద్ద పరీక్షలు ఏమీ లేవు. పార్టీ నాయకులకు అందుబాటులో ఉండి, వారి ఆశీర్వాదం దొరుకుతూ ఉంటే చాలు. ఇలా ఒక కాంట్రాక్టర్ రాజ్యం సివిక్ వాలంటీర్లలోను హాస్పిటల్స్ సెక్యూరిటీలోని ఇంకా ఇతర సంస్థల్లోనూ ప్రారంభమైంది ఇది పశ్చిమ బెంగాల్ లోనే కాదు. చాలా రాష్ట్రాల్లో ఈ కాంట్రాక్టర్ పద్దతి 1990ల తర్వాతనే ఆరంభమైంది. ఉద్యోగులకు ఏ రకమైన హక్కులు లేవు. అత్యంత తక్కువ జీతంలో మీరు దొరికిపోతారు. చూడ్డానికి, వినడానికి ఇది బాగానే ఉంటుంది. కానీ, పౌరులకు అందాల్సిన న్యాయం విషయంలో ఈ కాంట్రాక్టర్ విదానం అడ్డుగా ఉంటుంది. పర్మనెంట్ ఉద్యోగులు తగ్గి, కాంట్రాక్టు ఉద్యోగాలు పెరిగేటప్పుడు సంస్థాగత బాధ్యత తగ్గిపోతుంది. వైఫల్యం పెరిగిపోతుంది. ఏదైనా ఒక నియామకం ప్రభుత్వం చేతుల్లో ఉండడం వేరు. కాంట్రాక్టర్ల చేతుల్లో ఉండడం వేరు నిర్వహణలో చాలా తేడా వచ్చేస్తుంది. హాస్పిటల్స్ లో దినం వేళల్లో రోగులు, రోగుల కుటుంబ సభ్యులు ఎక్కువ సంఖ్యలో వచ్చేటప్పుడు సెక్యూరిటీని అందించే ఈ సంస్థలు, రాత్రి వేళల్లో రోగులు, రోగుల కుటుంబాలు, కుటుంబ సభ్యులు అధిక స్థాయిలో హాస్పిటల్ లోకి వచ్చే పరిస్థితి లేకపోయినప్పుడు ఆ సెక్యూరిటీని తగ్గించడం సహజం. ఏదైనా ఒక విషయం కాంట్రాక్టర్ల మీద ఆధారపడేటప్పుడు జరిగేది విష పరిణామాలు ఇలానే ఉంటాయి. ఈరోజు ఆర్జీ కర్ హాస్పిటల్ లో రాత్రి వేళల్లో అవసరమైనంత సెక్యూరిటీ లేకపోవడానికి కారణం వ్యవస్థాగతమైన లోపం. ఎయిర్ పోర్ట్ లో ఉండే సెక్యూరిటి హాస్పిటల్స్ లో ఎందుకు ఉండదు? హాస్పిటల్ అనేది ఒక అత్యంత ముఖ్యమైన సంస్థ. ఎంతో మంది సిరియస్ పేషెంట్లు అక్కడ ట్రీట్మెంట్ తీసుకుంటూ ఉంటారు. ఎంతో నిపుణులైన వైద్యులు సేవలు అందిస్తూ ఉంటారు. ఎవరి పనుల్లో వాళ్ళు బిజిగా ఉంటారు. జూనియర్ వైద్యులు రెండేసి రోజులు విరామం లేకుండా పని చెయ్యాల్సిన గడ్డు పరిస్థితి. రోగుల సంఖ్య కూడా చాలా ఎక్కువ. ఇలాంటి ప్రాంతంలో సెక్యూరిటీని అందించడం అన్నది అత్యంత ప్రాథమిక హక్కుగా ప్రభుత్వం బావించాలి. అది కూడా ప్రైవేటు కాంట్రాక్టర్ల ద్వారా కాదు. ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకోవాలి. కాబట్టి న్యాయం గురించి మనం మాట్లాడేటప్పుడు ఒక నేరస్థుడికి శిక్ష పడడం అన్న అంశం దగ్గరే మనం ఆగిపోకూడదు. సామాజిక న్యాయం కోసం దేశం మొత్తం మీద ప్రభుత్వ ఆసుపత్రులు అన్నీ కూడా సెక్యూరెటి ఏజెన్సీలను కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యతగా తీసుకొని నడపాల్సిన అవసరం ఉంది. దేశంలో ఒక ఎయిర్ పోర్ట్ లో ఎలా సెక్యూరిటీ అందిస్తున్నారో, దేశంలో ఒక పార్లమెంటుకు ఎలా సెక్యూరిటీ అందిస్తున్నారో, దేశంలో ఒక గవర్నర్ ఆఫీస్ కు ఎలా సెక్యూరిటీని అందిస్తున్నారో, అదే సెక్యూరిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా అందించాలి. వైద్యుల సెక్యూరిటీ నాయకుల సెక్యూరిటీ కంటే తక్కువేమీ కాదు. అందుకోసం, విధానాల్లో మార్పు జరగాలి. అందుకోసం, పార్లమెంట్లో కొన్ని బిల్లులు ఆమోదం అవ్వాలి. ఇదంతా జరిగితేనే, మరోసారి ఇలాంటి సంఘటన దేశంలోని ఏ హాస్పిటల్ లో కూడా మనం వినం. అలానే, దేశంలోని కీలక సంస్థల్లో సిసిటీవి ల ద్వారా డిజిటల్ మేనేజ్మెంట్ ద్వారా సెక్యూరిటీని ఎలా నియంత్రిస్తున్నారో, అలానే హాస్పిటల్స్ లో కూడా సిసిటీవీలలో సర్వేలెన్సు చెయ్యాలి. ఒకవేళ అలానే జరిగి ఉంటే, ఈ రోజు ఒక వైద్యురాలు ఇంత భయంకరమైన అన్యాయానికి గురికాక పోయి ఉండేది. భారతదేశంలో వైద్యులు ఇలానే చాలా తక్కువ. అవసరమైన జనాభాకు అనుగుణంగా వైద్యులు లేరు. మెడికల్ ఎడ్యుకేషన్ అనేది చాలా కాస్ట్లీ వ్యవహారం. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ వైద్య విద్యలోకి రాలేకపోతున్నారు. కాస్త కూస్తా డబ్బున్న వాళ్ళే ఈ రంగంలోకి ప్రవేశించగలుగుతున్నారు. పేదవాళ్లు, సాధారణ మధ్యతరగతి వారు నేటికి కూడా ఈ వైద్య రంగంలోకి, వైద్య విద్య లోకి తమ పిల్లలకి పంపించలేకపోతున్నారు. దాంతోపాటు ఇలాంటి సంఘటనలు తల్లిదండ్రులు వింటే ఇక రావాల్సిన అమ్మాయిలు కూడా వైద్యరంగంలోనికి రాడానికి భయపడతారు. ఇలాంటి విషమ పరిస్థితిని సరి చేయాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉంది. అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండెంటికి ఉంది. ఇన్ని సవాళ్లను ఎదుర్కొని ఒక మహిళ వైద్య విద్యను అభ్యసించి, ఇంకా అందులో ఎన్నెన్నో మెలకువలను నేర్చుకొని భారత ప్రజానీకానికి తనకు ప్రాణం ఉన్నంతవరకు వైద్య సేవలు అందించాలని నిరంతరం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఆ వైద్యురాలిని ఇంత అమానుషంగా హత్య చేసేయడం అనేది ఒకవైపు ఆ కుటుంబానికి అన్యాయం. మరోవైపు, ఆమె సేవలను అందించాల్సిన ఇంకెన్నెన్నో వేల, లక్షల రోగుల కుటుంబాలకు అందకుండా చేయడం అన్యాయం. దాంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థ మీద నమ్మకం పెట్టుకున్న భారత పౌరుడికి ఇది చాలా పెద్ద దెబ్బ .78వ స్వాతంత్ర్యందినం జరుపుకుంటున్నాం మనం. నేటికి, ఇలాంటి అన్యాయాలను చూస్తుంటే, భారత ప్రజానీకం అత్యంత ఆవేదనకు గురవుతుంది. కాబట్టి నేరస్తులకు శిక్ష పడాలి. ఇది ఒక కోణం. ఈ నేరం వెనక ఎంత పెద్ద చేపలు ఉన్నా వ్యవస్థ పట్టుకుని తీరాలి. మరోవైపు, హాస్పిటల్లో సెక్యూరిటీని అత్యంత ఎమర్జెన్సీ ప్రక్రియగా భావించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ఎయిర్పోర్ట్ కు, ఒక పార్లమెంటుకు, ఒక గవర్నర్ ఆఫీసుకు, ఒక ప్రెసిడెంట్ ఆఫీస్ కు ఇవ్వాల్సిన సెక్యూరిటీని ఇవ్వాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయం మీద సిరియస్‌గా ఆలోచిస్తాయి అనే నమ్మకం ప్రజలకు వచ్చేలా చర్చలు జరగాలి. ఇలాంటి ఘాతుక చర్య స్వతంత్ర భారత చరిత్రలో ఇంకెప్పుడూ పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. వ్యవస్థాగతమైన లోపాలు ఎన్ని ఉన్నాయో వాటిని సరిదిద్దాలి. ఒకవేళ ఏ రకమైన వ్యవస్థాగత లోపాలు లేకుండా, ఒకే ఒక వ్యక్తి మాత్రమే ఇందుకు కారణం అని పరిశోధనలో చిట్టచివరిగా తేలితే, అందుకు కూడా వ్యవస్తే మళ్ళీ కారణమవుతుంది. ఒక సాధారణ వ్యక్తికి మానసిక రోగిగా మార్చడంలోనూ, అందుబాటులో సారాయి, పోర్నోగ్రఫీ, మత్తు మందులు ఉండే పరిస్థితి సమాజంలో ఉన్నప్పుడు, అది వ్యవస్థాగత లోపమే అవుతుంది. పోలీసుల వైఫల్యం, పాలకవర్గం వైఫల్యం అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యాపార ప్రయోజనాల కోసం సమాజాన్ని అనారోగ్యకరంగా మార్చేస్తున్నప్పుడు, ఆరోగ్యకరమైన సమాజం కోసం, ఆరోగ్యకరమైన వ్యవస్థ కోసం ఈ పోరాటం ఒక్కరోజే కాదు. నిరంతరం సాగాల్సిన అవసరం ఉంటుంది. అందులో యువత పాత్ర చాలా ఉంటుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో, ఆర్థిక, సామాజిక న్యాయం కోసం కొంచెం నిష్క్రియాపరులైన యువత నేడు మరలా మెల్లమెల్లగా స్వేచ్ఛా వాయువుల కోసం, న్యాయం కోసం, సంస్థాగతమైన మంచి మార్పుల కోసం ముందుకు రావడం ఒక మంచి పరిణామం.

**(అధ్యాపకులు, రచయిత, ఆర్థిక, సామాజిక విశ్లేషకులు)**

## కవిత్వం అంటే..

కవిత్వం అంటే
ఏంటా అని
కనకయ్యజి
ఓ సామాజిక కవిని
అడిగాడు
విషయం ఏదైనా కానీ
అది
ఏ భౌతిక పరిస్థితుల్లో
ఉందో చూడు
అది సమాజానికి
చేటా
శోభితమా చూడు
చేటైతే
నీ భాషలోనే
ఖండించు నిరసించు
శోభితమైతే
సమర్థిస్తూ మెచ్చుకో
దాహంతో ఉన్న
దళితుడైన ఇంద్రవాల్
మట్టికుండలోని
నీళ్లు తాగాడని
అంటరానోడని
అగ్రవర్ణపు గురువే
చంపిన తీరును
నిరసిస్తూ
పతాక శీర్షికతో
పదిమందికి తెలియజేయి
దేశభక్తులమని
చెప్పుకునే వాళ్ళు
యాభై రెండేళ్లు
జెండాకు వందనం
చేయలేదు గాని
జెండావందనం నాడు
పెయిమీద నూలు పోగోలేకున్నా
చిట్టిపొట్టి పిల్లవాండ్లు
చాటిన దేశభక్తిని మెచ్చుకో
దోపిడీ విలువలే లక్ష్యంగా
పయనమవుతున్న పాలనలో
మానవత్వపు విలువలు
ఎలా ఉహించగలమంటూ
పీజీ డాక్టరమ్మను
చెరిపేసి చంపేసిన
క్రూర మానవ మృగాలకు
మరణ దండనేనని
నినదిస్తూజి
నీ కలాన్ని ఎత్తు
శవాలు గంగానదిలో తేలినా
దేశ ఆర్థిక పరిస్థితి
చిన్నాభిన్నమైనా
నిరుద్యోగం విలయతాండవం
చేసినా
పట్టించుకోని పాలకుల వైనాన్ని
నీ కలంతో గళంతో ఎత్తు
సామాజిక మార్పునిచ్చే
చూడచక్కని సందేశాన్నిచ్చే
పలుకులతో ముగించు
అంతా విన్న కనకయ్య
దేశంలో ఏం జరుగుతోందో
సోయి తెప్పించే కవిత్వమే
నిజమైన కవిత్వమని
ఎన్ని అలంకారాలతో
భాషా పాండిత్యంతో
ముస్తాబై ఉన్నా
అర్థం కాని కవిత్వం
వ్యర్థం అన్నాడు

**డా.మార్క శంకర్ నారాయణ**
**9908416664**


### ప్రభుత్వ పనితీరుపై ప్రజల దృష్టి మళ్ళితే..

# ఇన్‌స్టంట్ రాజకీయాలు పనికిరావు

**భారతదేశ ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థ గడిచిన 78 సంవత్సరాలు పరిశీలించినట్లయితే భారత రాజకీయాలు రోజు రోజుకు దిగజారిపోతున్నాయని చెప్పవచ్చు. ముఖ్యంగా స్వాతంత్రం సాధించిన భారతదేశంలో సాధారణ ఎన్నికలు 25 అక్టోబర్ 1951, 21 ఫిబ్రవరి 1952 మధ్య జరిగాయి. భారతదేశం 1947లో స్వాతంత్ర్యం పొందిన తర్వాత మొదటి జాతీయ ఎన్నికలు.**

ఓటర్లు మొదటి లోక్ సభ , దిగువ సభ 489 మంది సభ్యులను ఎన్నుకున్నారు. భారత పార్లమెంటుల. చాలా రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. మొదటి తరం రాజకీయాలు ప్రజాస్వామ్యం, చట్టం న్యాయం ధర్మ వ్యవస్థపై నిర్మితమైన రాజ్యాంగ వ్యవస్థ అనుసరించి పరిపాలించారు. నాటి నుండి నేటి వరకు ఒక్కసారి పరిశీలిస్తే రాజకీయాలు దిగజారుడు వ్యవస్థను నిర్వహిస్తున్నాయి. దేశమంతా ఒకే రాజకీయ వ్యవస్థ, పరిపాలన వ్యవహారాలు నిర్వహించడం పరిపాటిగా ఉండేది. దేశంలో రోజుకో కొత్త పార్టీ గల్లి కోటి ఢిల్లీ కోటి పార్టీలు పుట్టుకొచ్చి రాజకీయాలను కలుషితం చేసినా అని చెప్పవచ్చు. ప్రాంతీయ అవసరాల కోసం ఏర్పడిన రాజకీయ పార్టీలు కూడా ప్రజా మనలను పొందే విధంగా పరిపాలన వ్యవస్థను నిర్వహించడం లేదు. ఒడ్డెక్కిన ఓడ మల్లయ్య, దిగినంక బోడ మల్లయ్య రాజ్యాధికారం చేతికి వచ్చిన తర్వాత ప్రజలను ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్నికలలో పేర్కొన్న మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కేవలం టూతూ మంత్రంగా అమలు చేసి చెప్పుకోవడమే తప్ప నూటికి నూరు శాతం అమలు చేయడం విఫలమవుతున్నారు. కాబట్టి ప్రజలు అమాయకులని రాజకీయ నాయకులు భావిస్తే అవసరం వచ్చినప్పుడు క్రరు కాల్చి బాధ పెట్టడం తప్పనిసరి. కాబట్టి ఒక్కసారి ప్రజల దృష్టి మలితే మళ్లీ మనం ఎన్ని ఇన్స్టంట్ రాజకీయాలు చేసినా ప్రజలు మనకు ఓటు వేయరు. కాబట్టి ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన వ్యవస్థ ఉండాలి ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలి. లేకపోతే మళ్లీ గతంలో అనుభవించిన రోజులు పట్టే గతి ఉంది. ఏది ఏమైనా రాజకీయ నాయకులు అధికారంలో లో ఉన్నప్పుడు ఒక విధంగా లేనప్పుడు ఒక విధంగా వ్యవహరిస్తే ప్రజలు వీటిని మర్చిపోరు. కాబట్టి ప్రజలపై పెట్టే ఆంక్షలు, పథకాలు అమలు చేసేటప్పుడు ఆంక్షలు విధించడం ప్రభుత్వాలకు మంచిది కాదు ఎన్నికలలో ఇచ్చిన మేనిఫెస్టోలో ఆంక్షలు ఎక్కడ పేర్కొనలేదు కదా. మరి ఇప్పుడు ఎందుకు ఆంక్షలు పెడుతున్నారు అని ప్రశ్నలు తలెత్తక మానదు. కాబట్టి ప్రజలు తమ దృష్టిని మళ్లించుకున్న తర్వాత చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్లు ప్రభుత్వ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

1.రాజకీయాలు (ప్రాచీన గ్రీకు నుండి (politiká) 'నగరాల వ్యవహారాలు') అనేది సమూహాలలో నివసించే వ్యక్తులు ప్రణాళికాబద్ధమైన నిర్ణయాలు తీసుకునే మార్గం. రాజకీయం అంటే ప్రజలు తెగలు , నగరాలు లేదా దేశాలు వంటి సమూహాలలో కలిసి జీవించేలా వారి మధ్య ఒప్పందాలు చేసుకోవడం. దేశాల వంటి పెద్ద సమూహాలలో, కొందరు వ్యక్తులు అలాంటి ఒప్పందాలు చేసుకునేందుకు ఎక్కువ సమయం వెచ్చిస్తారు. ఇలాంటి వారిని రాజకీయ నాయకులు అంటారు . రాజకీయ నాయకులు కొన్నిసార్లు ఇతర వ్యక్తులు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. రోజువారీ జీవితంలో, "రాజకీయం" అనే పదం దేశాలు పరిపాలించే విధానాన్ని , మానవ సమాజాన్ని సరిగ్గా నిర్వహించడానికి ప్రభుత్వాలు నియమాలు , చట్టాలను రూపొందించే మార్గాలను సూచిస్తుంది. కంపెనీలు, క్లబ్బులు, పాఠశాలలు చర్చిలు వంటి ఇతర సమూహాలలో కూడా రాజకీయాలు చూడవచ్చు. భారత రాజకీయాలు :దేశ రాజ్యాంగంలోని చట్రంలో పనిచేస్తాయి . భారతదేశం ఒక పార్లమెంటరీ లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగ ఉంది ,




దీనిలో భారత రాష్ట్రపతి దేశాధినేత ,భారతదేశ ప్రథమ పౌరుడు మరియు భారత ప్రధానమంత్రి ప్రభుత్వాధినేత . రాజ్యాంగంలోనే ఈ పదాన్ని ఉపయోగించనప్పటికీ, ఇది ప్రభుత్వ సమాఖ్య నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది. భారతదేశం ద్వంద్వ రాజకీయ వ్యవస్థను అనుసరిస్తుంది, అంటే ఫెడరల్ స్వభావం, ఇది కేంద్రంలో కేంద్ర అధికారాన్ని , అంచున ఉన్న రాష్ట్రాలను కలిగి ఉంటుంది. రాజ్యాంగం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సంస్థాగత అధికారాలు మరియు పరిమితులను నిర్వచిస్తుందిబీ ఇది బాగా గుర్తించబడింది, ద్రవం (రాజ్యాంగం పీఠిక దృఢమైనది. రాజ్యాంగానికి మరిన్ని సవరణలనునిర్దేశించడం), అత్యున్నతమైనదిగా పరిగణించబడుతుంది, అనగా దేశ చట్టాలు దానికి అనుగుణంగా ఉండాలి. రాజ్యాంగం ప్రకారం భారతదేశం అధికారికంగా లౌకిక, సామ్యవాద రాజ్యంగా ప్రకటించబడింది.

2.ప్రజాస్వామ్యం అనేది ప్రభుత్వ రూపంగా నిర్వచించబడింది, దీనిలో సర్వోన్నత అధికారాన్ని ప్రజలపై ఉంచారు. వారు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రాతినిధ్య వ్యవస్థ ద్వారా ఉపయోగించబడతారు, సాధారణంగా కాలానుగుణ ఉచిత ఎన్నికలు ఉంటాయి. సారాంశంలో, ప్రజాస్వామ్యం అనేది ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులచే నిర్వహించబడే ప్రభుత్వ రూపం. రాజకీయ పరిస్థితుల నెరవేర్పు రాజకీయ ప్రజాస్వామ్యానికి దారి తీస్తుంది. రాజకీయ ప్రజాస్వామ్యం పరిస్థితులను సాధించడానికి, ప్రజలలో అత్యున్నత అధికారాన్ని కల్పించే రాజ్యాంగాన్ని, చట్టాలను ఆమోదించడం చాలా అవసరం.

(మిగతా భాగం రేపటి సంచికలో..)

# రైతుల కొంప ముంచిన కల్వర్టు

- కాంట్రాక్టర్ స్వార్థం ఇంజనీర్ల నిర్లక్ష్యానికి పంట నష్టం
- స్పీకర్ సాబ్ ఆదుకోవాలని రైతుల మొర
- ఎన్నో ఏళ్లుగా తీరని రైతుల వెతలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 20 (జనంసాక్షి):**
కాంట్రాక్టర్ స్వార్థం.. ఇంజనీర్ల తప్పిదం వలన ప్రతి ఏడాది వందలాది ఎకరాల్లో రైతులు పంట నష్టపోతున్నారు. కల్వర్టుపై వరద ఉధృతంగా ప్రవహించి పంట నష్టం చేస్తుంది రైతుల కొంప ముంచుతుంది.. వివరాల్లోకి వెళితే వికారాబాద్ మండలంలోని మైలారం దేవరంపల్లి జిన్నారం గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించి దాదాపు 200 ఎకరాల్లో పత్తి వామ కూరగాయలు మొక్కజొన్న పంటలు వరద తాకిడికి కొట్టక పోయాయి . మరికొన్ని పంటలపై వండ్రు మట్టి పెట్టిన కారణంగా పంట నేలకు వంగింది మరికొన్ని పొలాల్లో నేల కోత గురి అయింది ఫలితంగా వందలాది ఎకరాల్లో వంట నష్టం జరుగుతుంది. దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న వాగు వర్షం కారణంగా పొంగి ప్రవహిస్తుంది. దాదాపు 18 సంవత్సరాల క్రితం ఈ రెండు గ్రామాల రాకపోకల కోసం రోడ్లు మరియు భవనాల శాఖ ఒక కల్వర్టు నిర్మించింది. ఈ కల్వర్టు నిర్మాణంలో ఇంజనీర్ల తప్పిదం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. వాగు వరద ఉద్రుక్తాన్ని అంచనా వేయకుండా ఇంజనీర్లు తూతూ మంత్రంగా కల్వర్ట్ నిర్మాణం చేశారు. భారీగా వరద నీరు వచ్చే వాగుకు చిన్న సైజు పైపులతో కల్వర్టు నిర్మాణం చేశారు. ఈ వాగులో భారీ వరద నీరు వస్తుందని కల్వర్టు చిన్నగా నిర్మిస్తే తమ పొలాల్లో పంటలు దెబ్బతింటాయని వరద నీరంతా పొలాల నుంచి ప్రవహిస్తుందని అప్పట్లో రెండు గ్రామాల ప్రజలు రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు కానీ వారి ఫిర్యాదును అధికారులు పరిగణలోకి తీసుకోకుండా కల్వర్టు నిర్మాణం చేశారు. రైతులు కల్వర్టు పనులు నిర్మాణం జరగకుండా అడ్డుకోవడంతో కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మాణం ఎత్తును పెంచి నిర్మిస్తామని నమ్మబలికాడు కానీ ఇప్పటివరకు ఎత్తు పెంచని కారణంగా వరద నీరంతా రైతుల పంట పొలాల నుంచి ప్రవహిస్తుంది. ఫలితంగా రైతుల వందలాది ఎకరాల్లో పంట నష్టం జరిగి ఒక్కొక్క రైతు లక్షల్లో నష్టపోతున్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులు పంటలు వేశారు ఇప్పటివరకు ఒక ఎకరం పై 40 నుంచి 50 వేల రూపాయలు ఖర్చు చేశారు ఇదే కల్వర్ట్ పైనుంచి వరద నీరు ప్రవహించడంతో రైతుల పంటలు పూర్తిగా నీలమట్టమయ్యాయి. ఇలా ప్రతి ఏడాది వర్షాకాలంలో జరుగుతుంది ప్రతి ఏటా రైతులు పంటలు నష్టపోతున్నారు ఈ విషయమై ప్రతి ఏడాది అధికారులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి మొరపెట్టుకున్న వారు ఎవరు పట్టించుకోవడం లేదు. ఏడాది మళ్లీ వర్షాకాలంలో పంట నష్టం జరుగుతుంది ఈ విషయమై



చర్య తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు చరవాణి ద్వారా సమాచారాన్ని చేరవేయడానికి గ్రామస్తులు ప్రయత్నించిన ప్రయోజనం లేకపోయింది. స్పీకర్ బిజీ బిజీగా ఉన్న కారణంగా రైతులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయనట్టు తెలుస్తుంది కొందరు వ్యక్తుల ద్వారా ఈ సమాచారాన్ని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లాలని రెండు గ్రామస్తుల ప్రజలు ప్రయత్నిస్తున్నారు మరో 5 రోజులపాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతుల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. స్పీకర్ సాబ్ ఈ విషయంలో చొరవ తీసుకొని కొత్త బ్రిడ్జి నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.



## జలమయమైన లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**కూకట్ పల్లి ఆగష్టు 20(జనంసాక్షి):**
ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఫతేనగర్ లో జలమయమైన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు,జలమయమైన లోతట్టు ప్రాంతమైన ఫతే నగర్ డివిజన్ పరిధిలోని దిన్ దయాళ్ నగర్ నూ పరిశీలించిన కూకట్ పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ఫతే నగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్,డి ఈ శ్రీదేవి, ఏఈ పవన్ బస్తీ నాయకులు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షానికి కూడా బస్తీ జీలమయం అయ్యేది రోడ్డును హైట్ లేపడం వల్ల అదే విధంగా మెయిన్ రోడ్ లో క్యాచ్ ఫీట్లు కట్టడం వల్ల ముంపు సమస్య పూర్తిగా పరిష్కరించడం జరిగిందన్నారు. అదేవిధంగా అదేవిధంగా నాలా రిటర్నింగ్ వాల్ పనులకు కూడా నిధులు మంజూరై టెండర్ దశలో ఉంది ఆ పనులు కూడా పూర్తయినట్లైతే జలదిగ్బంధం నుండి దీన్దయాల్ నగర్ బస్తి పూర్తిగా విముక్తి లభిస్తుందని తెలియజేశారు.


## మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచడమే నా లక్ష్యం



### చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**వికారాబాద్ రూరల్ ఆగస్టు 20 (జనం సాక్షి)**
నా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని మురుగుదొడ్ల పరిశుభ్రంగా ఉంచడమే నా లక్ష్యమని చేవెళ్లే పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 300కు పైగా ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల శుభ్రం చేస్తున్నా మనీ అన్నారు సమాజంలో బాధ్యత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి పాటుపడాలని తన వంతు సహాయం చేసి పిల్లల బంగారు భవిష్యతుకు బాటలు వెయ్యాలని పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మాధవ రెడ్డి, మర్పల్లి బిజెపి మండల పార్టీ అధ్యక్షులు రమేశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు కే పీ రాజుగారు, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, మండల జనరల్ సెక్రెటరీ సిరిపురం ఎర్రోళ్ల లక్ష్మణ్, శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, రమేష్, లక్కీ రామ్, ఎంఈఓ విద్యాసాగర్, మర్పల్లి జెడ్పిహెచ్ఎస్ కే అంజలయ్య, పండరి ప్రధానోపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు బిజెపి నాయకుల కార్యకర్తలు కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఇన్చార్జి రాములు, ముదిరాజ్ మర్పల్లి కోఆర్డినేటర్ శేఖర్, గరుడ టీం సంగమేశ్ ప్రశాంత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి



### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 20 (జనం సాక్షి)**
18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరును నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ సర్వే చేయాలని బూతు లెవల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ ము హాలు నుండి డిఎల్ఏంటిలు, ఏఎల్ఏంటిలకు ఏర్పాటు చేసిన ట్రైనింగ్ కార్యక్రమంలో మాట్లాడుతూ జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటర్ జాబితా సవరణ 2025 కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయదా ఓటరు జాబితా విడుదల చేయాలని, నవంబర్ 28, 2024 వరకు సదరు జాబితా పై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని అన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18, 2024 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారిగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధృవీకరణ చేపట్టాలని, ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫోటోలను తొలగించి ఓటర్ల నూతన ఫోటోలు అప్లోడ్ చేయాలని, జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు 100 శాతం వెరిఫికేషన్ మరియు పోలింగ్ స్టేషన్ మార్పు అవసరం ఉంటే చేయాలని అన్నారు. అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 28 వరకు జనవరి ఒకటి 2025 ప్రామాణికంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ ముసాయిదా జాబితాన్ని రూపొందించాలని అన్నారు. మరణించిన ఓటర్ల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటర్ జాబితా నుంచి ఫారం 7 ద్వారా తొలగించాలని అన్నారు. సమావేశంలో ఆర్డిఓ వాసుచంద్ర, జిల్లా స్తా యి, అసెంబ్లీ స్తా యి, మాస్టర్ ట్రైనర్స్, ఎనికల విభాగము సుపరింటెన్డెంట్ నేమత్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారించాలి

### కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 20 (జనంసాక్షి)**
ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా సంగారెడ్డి మండలం, పసల్ వాడి గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పర్యటించారు. గ్రామంలో ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగితెలుసుకున్నారు. ఎంక్వైరీ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎల్ ఆర్ ఎస్ పరిశీలించి అర్హత గల దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలని గతంలో ఏవైనా డాక్యుమెంట్లు అప్లోడ్ చేయనట్లయితే ఇప్పుడు అప్లోడ్ చేసేందుకు అవకాశం ఉన్నందున అలాంటి వాటిని గుర్తించి అప్లోడ్ చేయించాలన్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ దేవదాస్, సంబంధిత రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## పైశాచిక ఆనందంలో బిఆర్ఎస్

- ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటాం
- పూజారులు భూభకాసురుల మాయలో పడొద్దు
- విలేకరుల సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి

**పెబ్బేరు ఆగస్టు 20 (జనం సాక్షి)**
బిఆర్ఎస్ నేతలు కేటీఆర్ హరీష్ రావులు పైశాచిక ఆనందం పొందుతున్నారని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఘాటుగా విమర్శించారు. మంగళవారం సాయంత్రం పెబ్బేరులో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ, తెలంగాణలో రాచరికపు పాలనకు స్వస్తి పలికి ప్రజాపాలన విజయవంతంగా సాగుతున్న తరుణంలో దాన్ని జీర్ణించుకోలేక బిఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతూ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు మాఫీ చేశామని అందుకోసం మొత్తం 31 వేల కోట్ల బడ్జెట్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. అందులో ఇప్పటివరకు 17 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగతా డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని రెండు లక్షలకు పైగా ఉన్న వారు పైన ఉన్న అమౌంటు చెల్లిస్తే 2 లక్షలు మాఫీ అవుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలలో కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇబ్బందులు ఉన్న వాటిని సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారని ప్రభుత్వమిచ్చిన హామీలన్నింటిని తూచా తప్పకుండా అమలు చేస్తుంది అన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ అక్కి సుశీల, జిల్లా నాయకులు మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, దయాకర్ రెడ్డి, అక్కమ్మ, సత్యం నాయుడు, షకీల్, యుగంధర్ రెడ్డి, రాములు, శివ సాయి, వెంకటాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనసత్కారం

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డికి ఘనసత్కారం.. ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం సివి ఆర్ భవనంలో ఇండియన్ మెడికల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెని పుష్పగుచ్ఛంను అందించి శాలువతో ఘనంగా సత్కారించి కేక్‌ను కట్ చేశారు. ఇకార్యక్రమంలో ఇండియాన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై.మల్లి కార్జున్ కోశాధికారి గీత విశ్వనాథ్ పద్మకళ అక్షిత ప్రసాద్ శెట్టి సచిన్ మంగిల్గి తదితరులు పాల్గొన్నారు

## వరద నివారణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

### జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి

జ గత మూడు నాలుగు రోజులుగా నగరంలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల జనజీవనం పూర్తిగా స్తంభిస్తుందని, ప్రజా రవాణా, దైనందిన కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రజా జీవనాన్ని మెరుగుపరచడానికై శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, వాటర్ లాగింగ్ పాయింట్స్ ను యుద్ధ ప్రాతిపదికన క్లియర్ చేసి నీటిని తొలగించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నెక్టార్ గార్డెన్స్??, గచ్చిబౌలి రోడ్, బయోడైవర్సిటీ కూడలి, ఇందిరా నగర్, ఆలిండ్ కాలనీ, లింగంపల్లి ప్రాంతాలలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి జడ్‌సి ఉపేందర్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రహదారులపై నిలిచిన వరద నీటిని, తదనుగుణంగా శానిటేషన్ సిబ్బంది చేపడుతున్న నివారణ చర్యలను పరిశీలించి పలు సూచనలు చేసారు. అనంతరం జోనల్ కమీషనర్ మాట్లాడుతూ వరదనీరు కాలనీలను ముంచెత్తకుండా నాలాల్లో అడ్డుపడే వ్యర్థాలను వెంటనే తొలగించాలని, ఓపెన్ డ్రైనేజీలలోకి నీరు వెళ్లిపోయేలా, ఎటువంటి ఆటంకాలున్నా యుద్ధ ప్రాతిపదికన నాలాలలో వరద నీరు సులభంగా తరలి వెళ్లేలా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో మూడు ప్రాంతాలలో వరద నీటిని మళ్లించేందుకు హోల్డింగ్ స్ట్రక్చర్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు వివరిస్తూనే వాటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రహదారులు, నాలాల పక్కన ఎటువంటి వ్యర్థాలు పేరుకోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, లేని పక్షంలో ముంపుకు దారి తీసే ప్రమాదం ఉందని జోనల్ కమీషనర్ హెచ్చరించారు. మాన్ సూన్ బృందాలు క్షేత్రస్థాయిలో ఉండి వరద నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు.




వర్షాలవల్ల దెబ్బతిన్న రహదారులకు తక్షణ మరమ్మతులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా జెడ్సి ఉపేందర్ రెడ్డి స్పష్టం చేసారు. ఆయన వెంట ఎస్ఈ శంకర్, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, రమేష్ ఇతర అధికారులు, సిబ్బంది న్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్

**కొడంగల్ ఆగస్టు20(జనం సాక్షి):**
కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన నిధులతో పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం కొడంగల్ కడ కార్యాలయంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణపేట్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. మంజూరు అయిన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులకు ప్రారంభించి పూర్తి చేయాలనీ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల విస్తరణ, రోడ్ల బలోపేతంకు సంబంధించి పంచాయతి రాజ్, ఆర్అండ్‌బి శాఖల ఇంజనీయర్లు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, భూసేకరణ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. కొడంగల్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నీటి ట్యాంకుల నిర్మాణాలకు, పైపులైన్ల పనుల నిమిత్తం అవసరమైన నిధుల నిమిత్తం ప్రతిపాదన పంపాలని కలెక్టర్ తెలిపారు. కడ కింద నియోజకవర్గంలో మంజూరైన చెక్ డ్యాంల నిర్మాణ పనులపై, అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్ల లో ఎక్కడ కుడా గుంతలు ఉండరాదని, ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని, ప్రతి వారము నిర్వహించే సమీక్ష లో ప్రోగ్రెస్ ఉండాలని, కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన మన ఊరు మన బడి క్రింద చేపట్టిన పనులను పూర్తి చేయాలనీ ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్, విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రూ.3కోట్లతో బస్ స్టాండ్ నిర్మాణం పనులు

### బస్టాండ్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల,ఆగష్టు 20(జనంసాక్షి)**
చేవెళ్ల కేంద్రంలో నిర్మిస్తున్న బస్ స్టాండ్ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అధికారులకు, గుత్తేదారుకు సూచించారు. మండల కేంద్రంలో రూ.3కోట్లతో బస్ స్టాండ్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక నాయకులతో కలిసి మంగళవారం బస్ స్టాండ్ అవరణ అంతా కలియ తిరిగి పనులను పరిశీలించి ఆర్టీసీ అధకారులకు, గుత్తేదారుకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ...బస్ స్టాండ్ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకు రావాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా బస్ స్టాండ్ ఆవరణలోని డబ్బాల్లో జీవించే వారికి కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ నెలాఖరులోగా నూతంగా చేపడుతున్న ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణం పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సున్నపు వసంతం, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బండారి ఆగి రెడ్డి, పడాల రాములు, మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, పెంటయ్య గౌడ్, మాజి ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21 ఆగస్టు 2024

# రైతులు ఆందోళన చెందవద్దు

- ప్రతిపక్షాలు రైతాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయి
- రాజీవ్ గాంధీ విగ్రహాన్ని టచ్ చేసే ధైర్యం ఉందా..?
- కేటీఆర్ ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, ఆగస్ట్ 20,(జనంసాక్షి):**

దేశంలో చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు ఏకకాలంలో 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేనని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్షాలు రైతాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని రైతులు బిఆర్ఎస్ ,బీజేపీ చట్రంలో పడవద్దని సూచించారు. ఇప్పటి వరకు 2 లక్షల వరకు రైతు రుణమాఫీ పూర్తి అయిందని, ఎవరికైనా రుణమాఫీ కాకపోతే రైతాంగం ఆందోళన చెందవద్దని మండల కార్యాలయాల్లో వ్యవసాయ అధికారులను కలిసి అప్లికేషన్ ఇవ్వాలని సూచించారు. వారు పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అమలు అయ్యేలా చూస్తారని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ 2018 డిసెంబర్ 12 కంటే ముందు, 2023 డిసెంబర్ 9 తరువాత లోన్ తీసుకున్న వారివి రుణ మాఫీ వర్తించదని పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో సింగిల్ విండో ద్వారా 4000 మంది రైతులు సభ్యులుగా ఉంటే 900 మంది మాత్రమే అప్పు తీసుకున్నారు.. బిఆర్ఎస్ హయంలో లక్ష రూపాయల రైతు రుణమాఫీ విడతల వారిగా చేయడానికి 5 సంవత్సరాలు పట్టింది అది తెలంగాణ రైతాంగం మొత్తానికి తెలుసు..కానీ తమ ప్రభుత్వం ఒకే దశలో రైతు రుణమాఫీ పూర్తి చేశామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో లక్ష రూపాయల రుణమాఫీ వరకు 18,260 మంది రైతులకు రుణమాఫీ జరిగగా మొదటి దశలో రూ. 96.26 లక్షలు విడుదలయ్యాయన్నారు. రెండవ దశలో లక్ష 50 వేల వరకు రైతు రుణం ఉన్న వారికి ఉన్న వారికి 9436 మంది రైతులకు రూ. 87.36 కోట్ల రూపాయలు రుణమాఫీకి విడుదల అయ్యాయనీ పేర్కొన్నారు. మూడవ దశలో 2 లక్షల లోపు రైతు రుణమాఫీ ఉన్న వారికి 7136 మంది రైతులకు రూ. 87.06 కోట్లు విడుదల అయ్యాయని ,ఒక హుస్నాబాద్ నియోజకవర్గంలోనే 34,882 మంది రైతులకు 269.6 కోట్లు రుణమాఫీ పూర్తి అయిందనీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలియజేసారు. నియోజకవర్గంలో 70 శాతం మంది రైతులు లోన్ తీసుకున్నారు. ఇందులో రైతు రుణమాఫీ పూర్తి కానీ వారు 2018 డిసెంబర్ 12 కి ముందు ,2023 డిసెంబర్ 9 తరువాత లోన్ తీసుకున్న వారు ఉన్నారన్నారు. ఇంకా ఎవరైనా రుణమాఫీ పూర్తి కానీ వారు ఉంటే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. 2005 -06 తమ ప్రభుత్వంలో దేశం మొత్తం ప్రతి రైతుకు లక్ష రూపాయల రుణమాఫీ అమలు చేసిన ఘనత తమదేనని ,ఇప్పుడు చరిత్రలో దేశంలో ఎక్కడా లేని విధంగా 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన చరిత్ర తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వందన్నారు. బిఆర్ఎస్10 ఏళ్లలో లక్ష రూపాయల రుణమాఫీ ఎన్ని విడతల్లో చేశారు..?ఎంత మందికి ఇచ్చారు..? అని ప్రశ్నించారు. సెక్రటేరియట్ ముందు బరా బర్ రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టీ తీరుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.రాజీవ్ గాంధీ విగ్రహాన్ని టచ్ చేసే ధైర్యం ఉందా అని సవాలు విసిరారు. సెక్రటేరియట్ ముందు తాము ఎవరి విగ్రహం తొలగించలేదని..ఎవరిని ఇబ్బంది పెట్టలేదన్నారు. కేటీఆర్ ఆయన విగ్రహం పెట్టుకోవాలనుకున్నారో ఏమో అని సందేహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని ఆయన విగ్రహంపై మాట్లాడుతున్న కేటీఆర్ ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలన్నారు.

# జాతీయ రహదారులన్నిటిని గ్రీన్ ఫీల్డ్ హైవేగా మారుస్తాం



**తూప్రాన్ ఆగస్టు 20(జనంసాక్షి):**

జాతీయ రహదారులన్నింటిని ఫీల్డ్ హైవేస్‌గా మార్చాలని కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు ఏఎన్నార్ హైవేస్ హెడ్ శంకర్ గణేషన్ తెలిపారు తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద మొక్కలు నాటిన సందర్భంగా మాట్లాడారు అధిక సంఖ్యలో వాహనాలు వాడడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగి భూమి మీద అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తీర్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి లభించడం అనేకమంది శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. వీటిని నివారించడానికి దేశంలోనే అన్ని జాతీయ రహదారులను హైవేగా మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద మియావాకీ ప్లాంటేషన్ మరియు మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం బ్యానర్‌ను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, జియంఆర్ హైవేస్ హెడ్ శంకర్ గణేశన్ ఇండిపెండెంట్ ఇంజనీర్ హాజ్రాత్ రెడ్డి, చేతులమీదుగా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మహాత్మ జ్యోతి బాపులే మరియు సాంఘిక సంక్షేమ విద్యాలయాల విద్యార్థులచే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు మరియు జి.యం.ఆర్ హైవేస్ హెడ్ శంకర్ గణేశన్ ఇంజనీర్ హాజ్రాత్ రెడ్డి, ఇతర ప్రతినిధులకు, అధికారులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం మొక్కలను నాటడడం జరిగినది. ఈ సందర్భంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ హైవేలను గ్రీన్ కవర్‌తో నింపే దృక్పథాన్ని సాకారం చేసేందుకు, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వివిధ ప్రదేశాలలో జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న ల్యాండ్ పార్శిల్స్‌లో మియావాకీ ప్లాంటేషన్‌ను నాటడానికి ఒక ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. మియావాకీ ప్లాంటేషన్లను స్థాపించడానికి వివిధ ప్రదేశాలలో 53 ఎకరాలకు పైగా మొత్తం భూభాగాన్ని గుర్తించారు. జాతీయ రహదారులన్నిటిని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేస్ గా మార్చడమే మా లక్ష్యం అని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల సంస్థ ప్రతినిదులు, జిమ్మెర్ పోచంపల్లి హైవేస్ ప్రతినిదులు, రక్ష సిబ్బంది, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇన్స్‌పైర్ మనక్ నామినేషన్లను వేగవంతం చేయాలి..!

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):**

ఇన్స్పైర్ మనక్ నామినేషన్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుండి ఐదు నామినేషన్లను ఆన్లైన్లో సెప్టెంబర్ 15 లోపు అప్లోడ్ చేయాలని ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తో కలిసి ఇన్స్పైర్ మనక్ గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అర్హత గల అన్ని పాఠశాలల నుండి విద్యార్థుల నామినేషన్లను అప్లోడ్ చేసి జిల్లా నుండి ఎక్కువమంది ఎంపిక అయ్యేటట్లు కృషి చేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే విధానం..పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించి ఉత్తమమైన ఐదు ఆలోచనలను ఎంపిక చేసి ప్రతి పాఠశాల నుండి ఐదు నామినేషన్లను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. విద్యార్థి పూర్తి వివరాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఆధార్ నెంబర్, విద్యార్థి ఫోటో ప్రాజెక్టు రైట్ అప్ ను అప్లోడ్ చేయాలన్నారు. తదుపరి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు వీటిని పరిశీలించి అర్హత కలిగిన ప్రాజెక్టులకు 10000/-(పది వేల రూపాయలు) సంబంధిత విద్యార్థి బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారని చెప్పారు. వీటిని ఉపయోగించి ప్రాజెక్టు రూపొందించి జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొనాలని అన్నారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ఖమ్మం నుండి కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపధ్యంలో ప్రాణ ,ఆస్తి నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవిన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం అయన ఖమ్మం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలు, ధరణి, నూతన రెవిన్యూ చట్టంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న 5 రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని, అందువల్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండడంతో పాటు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ముఖ్యంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. నిర్లక్ష్యంగా ఉండవద్దని ,ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, స్థానిక పరిస్థితుల ఆధారంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడం లేదా నడిపించడం చేయాలని అన్నారు. ప్రస్తుత రెవెన్యూ చట్టంలో మార్పులతో తీసుకురానున్న కొత్త రెవిన్యూ చట్టంపై ఈనెల 23 ,24 తేదీలలో జిల్లా స్థాయిలో వర్క్ షాప్ నిర్వహించి మేధావులు, సీనియర్ సిటిజన్ల అభిప్రాయాలను తీసుకొని రాష్ట్ర స్థాయికి పంపించాలని ఆయన కోరారు. ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్లు పెండింగ్‌లో ఉన్న అన్ని ధరణి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పరిష్కరించాలన్నారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలని, గతంలో ఏవైనా డాక్యుమెంట్లు అప్లోడ్ చేయనట్లయితే ఇప్పుడు అప్లోడ్ చేసేందుకు అవకాశం ఉన్నందున అలాంటి వాటిని గుర్తించి అప్లోడ్ చేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి మాట్లాడుతూ రానున్న 5 రోజులపాటు, భారీ వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సాగునీటి ట్యాంకులు, చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, వంకలు, కల్వర్టులు పొంగి ప్రవహిస్తున్న చోట ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ,అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్ళించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రాష్ట్రస్థాయి అధికారులు హాజరుకాగా, జిల్లా నుండి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేవేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు, ఆర్‌డిఓ నవీన్, జిల్లా పరిషత్ సీఈవో వెంకట్ రెడ్డి, డిపిఓ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

### మాలల చైతన్య సమితి వనపర్తి జిల్లా అధ్యక్షుడు రవీందర్ దాస్

**వీపనగండ్ల ఆగస్టు 21 (జనం సాక్షి)**

ఎస్సీ ఎస్టీ లను రిజర్వేషన్లను వర్గీకరణను అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నేడు ఎస్సీ ఎస్టీ సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలల చైతన్య సమితి వనపర్తి జిల్లా అధ్యక్షుడు రవీందర్ దాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రసాదించిన హక్కులను కాపాడుకునేందుకు దేశంలోని ఎస్సీ ఎస్టీ సంఘాలు ఐక్యంగా ఏర్పడి భారత్ బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు మద్దతు తెలిపారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు భవిష్యత్ తరాలకు నష్టం కలిగిస్తుందని, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు పైన ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు, బిజెపి పార్టీలో ఉన్న ఎస్సీ, ఎస్టీ నాయకులు, మాలలు భారత్ బంద్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# విద్యార్థులు కంటి వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి



### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

విద్యార్థులు కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నారాయణపేట లోని విద్యార్థులకు కంటి పరీక్షా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలోని ఐదవ తరగతి నుండి పదవ తరగతి చదివే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కంటిలో గల దృష్టిలోపాలను నేత్ర పరీక్షల ద్వారా తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం అమలు జరిపే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సౌభాగ్య లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో ఐదు నుండి పదవ తరగతి చదివి విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ వేణుగోపాల్, డాక్టర్ సాయిరాం, డాక్టర్ రాఘవేందర్ రెడ్డి, డాక్టర్ మోనేష్, గోవిందరాజు, ఏఎన్ఎం రామేశ్వరి, అత్తాల్మిక్ నాగరాజు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఇచ్చిన మాటకు కట్టుబడే పార్టీ కాంగ్రెస్

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి
- చేర్యాలలో ఎడ్ల బండ్లతో కాంగ్రెస్ భారీ ర్యాలీ

**చేర్యాల ఆగస్టు 20 (జనంసాక్షి) :**

సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ చౌక్ నుండి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు ఎడ్ల బండ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ హయాంలో జనగామ నియోజకవర్గంలో నిర్మించిన రిజర్వాయర్ లతో నేడు పంటలు బాగా పండి రైతాంగమంత సంతోషంగా ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తుంటే ప్రతిపక్షాలు అనవసరమైన ఆరోపణలు చేస్తూ రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. గత పాలకుల హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల రాష్ట్రం చేసి అభివృద్ధి పథంలో నడుస్తున్న కాంగ్రెస్ పార్టీపై అనవసరమైన విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు అనవసరమైన ఆరోపణలు మానుకొని అభివృద్ధిలో కలిసి రావాలన్నారు.



# లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్ నగర్ రూరల్ ఆగస్టు 20 (జనం సాక్షి)**

మహబూబ్ నగర్ మండలం జమిస్తాపూర్‌కు చెందిన పసుల శరత్ కుమార్ విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులకు విద్యుత్ శాఖ నుంచి నష్టపరిహారంగా 5 లక్షల రూపాయలను వచ్చిన చెక్కును మంగళవారం మృతుని తండ్రి పసుల గోపాలుకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. అలాగే విద్యుత్ ఘాతంతో చనిపోయిన బర్రెల యజమానులకు కూడా నష్టపరిహారాన్ని ఆయన అందజేశారు. చనిపోయిన బర్రెలకు నష్టపరిహారం అందించారు. సుక్క పర్వతాలుకు (ధర్మాపూర్) 40 వేలు, గొల్ల బాలయ్యకు( ఫతేపూర్)40 వేలు, ఎండి హుస్సేన్(మాన్ పల్లి)కు 40 వేలు, హన్వాడ మండలానికి (లింగాన్న పల్లి) చెందిన గొల్ల బాలయ్యకు 14 వేల రూపాయలను ఎమ్మెల్యే అందజేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లు నర్సింహ్మారెడ్డి, ధర్మాపూర్ నర్సింహ్మారెడ్డి, మరియు ఎడిఇ మద్దిలేటి, ఎఇ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో 317 ఇంప్లిమెంటేషన్ వెంటనే చేపట్టాలి

- మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలి
- సమస్యల పరిష్కారం కోసం 21న నిరాహార దీక్ష
- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు




**సంగారెడ్డి ప్రతినిధి,ఆగస్టు 20 (జనంసాక్షి)**

మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన జీవో 317 ఇంప్లిమెంటేషన్ చేయడంలో జాప్యం జరుగుతున్నదని, వెంటనే ఇంప్లిమెంటేషన్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి సాయం విజ్ఞప్తి చేశారు. మంగళవారం యుటిఎఫ్ సంఘం ఆధ్వర్యంలో మునిపల్లి మండలంలో సభ్యత్వ నమోదుకార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మల్లికార్జున పల్లి జిల్లా పరిషత్ పాఠశాల, మునిపల్లి, మోడల్ పాఠశాల ను సందర్శించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీవో 317 ఇంప్లిమెంటేషన్ చేయడంలో జాప్యం జరుగుతున్నదన్నారు. కనీసం ప్రతినెల జీతానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తచేశారు. మోడల్ పాఠశాల టీచర్ల బదిలీలు గత 13 సంవత్సరాలుగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని, 010 హెడ్ కింద జీతాలు ప్రతినెల మొదటి తేదీన ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్ ఇచ్చి ఉచిత వైద్యం కల్పించాలని, నోషనల్ సీనియారిటీ వర్తింపజేయాలని, కారుణ్య నియామకాలు ఇవ్వాలని డిమాండ్స్ పరిష్కారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష, ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైనట్టు తెలిపారు. నిరాహార దీక్ష కార్యక్రమానికి మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి డి.మునేష్, ఎంఎస్‌టిఎఫ్ నాయకులు సునీల్, మహేష్, పాఠశాల ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎక్స్ గ్రేషియా మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదన

### జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 20 (జనం సాక్షి)**

గద్వాల జిల్లాలో సోమవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షానికి పిడుగులు పడి ముగ్గురు చనిపోయిన వారికి ఎక్స్ గ్రేషియా మంజూరు కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బిఎం. సంతోష్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ మండలం క్యాతూర్ గ్రామానికి చెందిన వేముల రాజు, గట్టు మండలం ఆరగిద్ద గ్రామానికి చెందిన తలారి నల్లారెడ్డి లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికి రూ. 6.00 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా మంజూరు కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని తెలిపారు. అలాగే మల్దకల్ మండలంలో కర్నూలు జిల్లా నందవరము కనకవీడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి కూడా పిడుగుపాటుకు మరణించినందున ఎక్స్ గ్రేషియా మంజూరు కొరకు ప్రతిపాదనలను కర్నూలు జిల్లా కలెక్టర్‌కు పంపడం జరుగుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

నిజమైన స్వాప్నికులం కావాలంటే మన ఊహలన్నీ వాస్తవ పరిస్థితులలో బలంగా వేళ్ళూనుకుని ఉండాలి, అలాగే ఆయా పరిస్థితుల నుండి ముందు కెళ్ళి కొత్త సంభావ్యతల గురించి కూడా ఆలోచించగలగాలి. సమకాలీన స్త్రీవాదానికున్న బలం ఏంటంటే తనని, తన మార్గాన్ని మార్చుకోగలగటం. పాతబడిపోయిన ఆలోచనలు, కార్యాచరణని పట్టుకు వేళ్ళాడే సామాజిక న్యాయ ఉద్యమాలన్నీ విఫలమవుతాయి. ముందు చూపున్న స్త్రీవాదానికి (విజనరీ ఫెమినిజం) 1960ల మొద˘ట్లోనే బీజాలుపడ్డాయి.



# ముందు చూపున్న స్త్రీవాదం

**బెల్ హుక్స్(అనువాదం: ఎ. సునీత)**

స్త్రీ విముక్తి ఉద్యమం మొదలయినప్పుడే కొంతమంది ఇటువంటి ముందు చూపున్న స్త్రీవాదులు ఇట్లా కలలు కనే వాళ్ళు: సంస్కరణ దశలో ఇప్పుడున్న జాత్యహంకార పెట్టుబడి దారీ పితృస్వామ్య వ్యవస్థలో పౌర హక్కులని సంపాదించుకోవటానికి స్త్రీవాదం పని చెయ్యాలి: కానీ, అదే సమయంలో దాని క్రింద గోతులు తవ్వి, ఆ వ్యవస్థనే కూల దొయ్యటానికి అవసరమయ్యే రాడికల్ విప్లవ దిశగా పని చెయ్యాలి. అధిపత్యంపై ఆధారపడిన సంస్కృతిని మార్చి వేరే సంస్కృతి సృష్టించాలి: ఒక సమూహ తత్వంలో వేళ్లానుకున్న భాగస్వామ్య ఆర్థికం, సామ్యవాదంతో కూడిన ప్రజాస్వామ్యం, జెండర్, జాతి పరమైన వివక్ష లేని ప్రపంచం, ఒకరి మీద మరొకరు ఆధారపడి, ఒకరిని ఒకరు చూసుకునే నైతికతతో కూడిన మానవ సంబంధాలు, ఈ భూగోళం మీద అందరూ శాంతియుతంగా, క్షేమంగా ఎలా బ్రతకాలో, అసలు భూగోళాన్ని ఎలా కాపాడుకోవాలో తెలిసిన సంస్కృతి. అటువంటి ప్రపంచం కోసం కలలు కన్నారు వీళ్ళు. ఉద్యమం ముందుకెళుతున్న క్రమంలో రాడికల్/విప్లవ స్త్రీవాద స్వప్నాలు మరింత స్పష్టతని, సంక్లిష్టతని సంతరించుకున్నాయి. అయితే వున్న సామాజిక వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే సంస్కరణ వాద స్త్రీవాదుల నిరంకుశత్వ నీడలో ఈ స్వప్నాలు మరుగున పడిపోయాయి. కొంతమంది జెండర్ ఆధారిత ఆర్థిక వివక్ష తగ్గితే తమ సామాజిక వర్గాల్లోని మగవాళ్ళతో సమానంగా తమకీ అవకాశాలు వస్తాయని నమ్మి దాని కోసం పని చేస్తే, మరి కొంత మంది సంస్కరణ వల్లే వాస్తవ పరిస్థితులలో కొంతయినా మార్పు వస్తుందని నమ్మారు. అయితే స్త్రీవాద సంఘర్షణకి గుండె కాయ అయిన విప్లవాత్మక భావనలని వదిలెయ్యటం వల్ల అది పెట్టుబడిదారీ పితృస్వామ్యం స్త్రీవాద ఉద్యమాన్ని వాడుకోవటానికి ఉపయోగపడిరది. సామాజిక వ్యవస్థలో పైకి వెళ్ళటం సాధ్యపడి, వర్గ ఆధిపత్యం, పైకి వెళ్లే అవకాశాల మోహంలో పడిన స్త్రీలలో తర్వాత అతి కొద్ది మంది వ్యవస్థని కూల దొయ్యటానికి సిద్ధ పడ్డారు. కారల్ గిల్లిగాన్ వంటి స్త్రీవాద ఆలోచనా పరులు మనకి 'స్త్రీలలో పురుషుల కన్నా ఇతరులని చూసుకునే గుణం
ఉంటుందనీ, అందుకే నైతికతతో ప్రవర్తిస్తుంటారని' చెప్పారు గానీ, తమ కంటే తక్కువ అధికారాలున్న స్త్రీలతో అధికారమున్న స్త్రీలు ఎలా ప్రవర్తిస్తారో చూస్తే మనకు తప్పకుండా వేరే అభిప్రాయం కలుగుతుంది. 'తమ' అనుకునే సమూహాల స్త్రీలతో (జాతి కావొచ్చు, రేస్ కావొచ్చు) స్త్రీల ఈ నైతిక ప్రవర్తన 'తమది' కాని సమూహాల స్త్రీలతో కలిసినప్పుడు కన్పించదు. ఆ సహానుభూతి, సంఫీ?భావం ఎక్కడా కనిపించవు. విశేషాధికారాలు వుండే స్త్రీలు (ప్రధానంగా తెల్ల జాతి స్త్రీలే కానీ కొంతమంది వేరే వాళ్ళు కూడా) శ్రామిక, పేద స్త్రీలని క్రిందికి తొక్కి పెట్టటం అనే కార్యక్రమంలో చాలా త్వరగా చేరి పోయారు. ముందు చూపు వున్న స్త్రీవాదం స్త్రీల పరిస్థితులని మార్చి, వారి వ్యక్తిగత అధికారాల్ని పెంచటం పైన ఎక్కువ శ్రద్ధ పెడుతుంది. దాని కోసం ఉద్యమం 'సమాన హక్కుల' ఎజెండా నుండి పక్కకి తొలిగి అందరు స్త్రీలు, ముఖ్యంగా పేద స్త్రీలని కలుపుకునే అక్షరాస్యతా ఉద్యమం వంటి దాన్ని చేపట్టాల్సి వస్తుంది. స్త్రీవాదాన్ని నేర్పించటానికి ఏ స్కూళ్ళు, కాలేజీలు లేవు. అటువంటివి స్థాపించటానికి ఏ ప్రయత్నం జరగలేదు. చదువుకున్న తెల్లజాతి స్త్రీలు ఉద్యోగ రంగంలో వివక్ష తొలగింపు చర్యల వల్ల బాగా ప్రయోజనం పొందారు. కానీ స్త్రీవాద సూత్రాల పైన ఆధారపడ్డ సంస్థల్ని నిర్మించటంలో పెద్దగా ఆసక్తి కన్పించలేదు. అటువంటి సంస్థలు పెద్ద పెద్ద జీతాలు ఇవ్వలేవు. బాగా డబ్బున్న స్త్రీవాద కార్యకర్తలు కూడా తమ డబ్బుని మౌలిక నైపుణ్యాలు లేని స్త్రీల ప్రయోజనాల కొరకు విద్యా కార్యక్రమాలను చేపట్టటం కోసం వినియోగించలేదు. ముందు చూపున్న స్త్రీవాద ఆలోచనా పరులు విస్తృత ప్రాతిపదికపై ఆధారపడిన వర్గంతో సంబంధం లేకుండా బాలికలు, బాలురు, ఆడవాళ్ళు, మగవాళ్ళు అందరికోసం స్త్రీవాద ఉద్యమ అవసరాన్ని ? అర్థం చేసుకున్నారు గానీ, దానికి సంబంధించిన సిద్ధాంతాన్ని అందరికీ అర్థమయ్యే, చెప్పగలిగే భాషలో రాయలేదు, రూపొందించలేదు. ఈ రోజుల్లో అకడమిక్ సర్కిళ్లలో అందరూ పొగిడే స్త్రీవాద సిద్ధాంతం కేవలం బాగా చదువుకున్న వారికి తప్ప వేరే ఎవరికీ అర్థంకాని అతి అధునాతన భాషలో ఉంటుంది. మన సమాజంలో అత్యధిక జనాభాకి స్త్రీవాదం గురించి మౌలిక అవగాహన కూడా ఉండదు. వాళ్ళు అర్థం చేసుకోగలిగే చోట ? స్కూళ్లల్లో, బయటా విరివిగా లభించే సమాచారంలో ? అది దొరకదు, ఎందుకంటే అసలు అటువంటి రచనలు లేనే లేవు. అందరికీ అవసరమైన స్త్రీవాద
ఉద్యమం నిర్మించాలంటే మనం అందరికీ అర్థమయ్యే స్త్రీవాద రచనలని సృష్టించటం కూడా అవసరం.
మనకి కూడా టెలివిజన్ ఛానెళ్లు, లేకుంటే ఆ ఛానెళ్లలో మనకొక టైం అంటూ ఉండేటంత వనరులని స్త్రీవాద కార్యకర్తలు ఇప్పటికీ సమకూర్చుకోలేదు. ఇప్పటికీ ఏ టెలివిజన్ ఛానెల్లో ఒక స్త్రీవాద వార్తా సంచిక గానీ రేడియో షో గానీ లేదు. చేయాలనుకునే వారి దారిలో పెద్ద అడ్డంకి ఏమిటంటే ? 'స్త్రీలు' వస్తువుగా వున్న ఏ వార్తయినా 'స్త్రీవాదం' గానే పరిగణించబడటం, దాన్లో ఏ మాత్రం స్త్రీవాద విశ్లేషణ, అవగాహనా లేకపోయినా సరే. మనకి స్త్రీల గురించి, జెండర్ గురించి మాట్లాడే రేడియో కార్యక్రమాలు వున్నాయి, కానీ వాటిని స్త్రీవాదం గురించి మాట్లాడేవిగా పరిగణించటం కష్టం. సమకాలీన స్త్రీవాదం సాధించిన గొప్ప విజయం ఏమిటంటే, ఇదివరకటితో పోలిస్తే ఇప్పుడు చాలా మంది జెండర్, స్త్రీల గురించి మాట్లాడటానికి సిద్ధపడటం. అయితే ఆ చర్చలు స్త్రీవాద దృక్పథం నుండి మాత్రం జరగట్లేదు.
ఉదాహరణకి, స్త్రీవాదం సమాజంలో ఒక సాంస్కృతిక విప్లవాన్ని తెచ్చి ఆడవాళ్లపై, పిల్లలపై మగవాళ్లు చేసే హింసని గురించి అందరూ ఎదుర్కోవాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చింది. ప్రసార సాధనాల్లో ఈ హింస గురించి చర్చలు అనేకం జరుగుతాయి గానీ, పురుషులు చేసే హింసని, పురుషాధిపత్యంతో, దాన్ని పితృస్వామ్యంతో అనుసంధించి చూడటం అరుదుగా జరుగుతుంది. ఈ దేశంలో అత్యధిక పౌరులు ఇప్పటికీ ఇళ్లల్లో పురుషులు చేసే దాష్టికానికి, సమాజంలో పురుషాధిపత్యానికి మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోలేదు. ఆ వైఫల్యమే, కుటుంబ సభ్యులను, స్నేహితులను, తోటి విద్యార్థులను క్రూరంగా హత్యలు చేసే యువకుల గురించి కార్యాచరణ విఫలం కావటానికి కూడా కారణం. ప్రసార సాధనాల్లో ఇటువంటి హింస గురించి జరిగే చర్చల్లో ఈ హింసని పితృస్వామ్య ఆలోచనా ధోరణులకు ఎప్పుడూ జోడిరచరు.
విస్తృతంగా విమర్శనాత్మక చైతన్యం పెంపొందించటం కోసం స్త్రీవాద విద్య అవసరం. దురదృష్టవశాత్తూ వర్గపరమైన కులీనతత్వం స్త్రీవాద ఆలోచనా రీతుల దిశని నిర్దేశించింది. అత్యధిక శాతం స్త్రీవాద ఆలోచన పరులు, సిద్ధాంత కర్తలు తమ పనిని విశ్వవిద్యాలయాల్లో చేస్తారు. చాలా వరకూ మనం పిల్లల పుస్తకాలు రాయం, స్కూళ్లలో చదువు చెప్పం. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చెప్పే చదువు ఎట్లా
ఉండాలనే దాని గురించి బలమైన లాబీ ఏర్పాటు చేసుకోము. స్త్రీవాద ఉద్యమం అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే నేను పిల్లల కోసం పుస్తకాలు రాయటం ప్రారంభించాను. అలాగే వినగలిగే పుస్తకాలు (ఆడియో పుస్తకాలు) చదవటం, రాయటం రాని వ్యక్తులకి కూడా ఈ సందేశాన్ని చేర వెయ్యటానికి పనికొస్తాయి. స్త్రీవాద ఉద్యమం కొత్తగా మొదలు పెట్టాలంటే మన రాజకీయాలు రాడికల్‌వనే సందేశాన్ని ప్రతి ఇంటి తలుపు తట్టి చెప్పటం అవసరం. రాడికల్ విషయాలని పాతాళంలోకి తొయ్యటం మన సమాజంలో మామూలే. కాబట్టి స్త్రీవాదం అందరి దృష్టిలోకి రావటానికి, అందరికీ చేరటానికి మనం చాలా పని చెయ్యాలి. స్త్రీవాదమంటే సెక్సిజం, సెక్సిస్టు ఆధిపత్యం, పీడన అంతం చెయ్యటానికి జరిగే ఉద్యమమని, దానిలో జెండర్ వివక్షని అంతం చేసి, సమానత్వాన్ని తేవటం భాగం కాబట్టి మనది మౌలికంగా ఒక రాడికల్
ఉద్యమమని చెప్పగలగాలి.
స్త్రీవాద ఉద్యమకారులు సెక్సిజంని సమూలంగా ప్రశ్నించకుండా సంస్కరణపై దృష్టి కేంద్రీకరించటంతో స్త్రీవాద రాడికల్ తత్వం గురించి అయోమయం తలెత్తింది. అనేక రకాల స్త్రీవాదాలు ఉండొచ్చు అన్న భావనని ముందుకు తీసుకెళ్ళటంతో సాంప్రదాయ వాదులు, ఉదారవాదులు దీన్ని వాడుకున్నారు. తమ అవకాశాలని మెరుగుపరుచుకునే స్త్రీల వర్గపరమైన ప్రయోజనాలకు సంస్కరణ వాదం చాలా ఉపయోగపడిరది. వీళ్ళే 'అధికార స్త్రీవాదం' (పవర్ ఫెమినిజం) అనే భావనని మొదటిగా వాడిన వాళ్ళు. వీళ్ళే నెమ్మదిగా స్త్రీవాదులు కూడా గర్భస్రావానికి వ్యతిరేకమైన వైఖరి తీసుకోవచ్చు అని చెప్పటం ప్రారంభించారు. ఇది ఇంకొక తప్పుడు భావన. తమ శరీరాలపై కనీస పౌర హక్కుని ఇవ్వటం ఒక మౌలిక స్త్రీవాద సూత్రం. ఆమె ఆ హక్కుతో గర్భస్రావం చేయించుకుంటుందా అన్నది వ్యక్తిగత నిర్ణయం. చేయించుకోవటం స్త్రీవాదానికి వ్యతిరేకం కాదు. కానీ ఆ నిర్ణయం తీసుకునే హక్కు ఉండటం ఒక మౌలిక స్త్రీవాద సూత్రం. వర్గపరమైన ప్రయోజనాలు, అధికారం, సంపద కోసం కాంక్ష రెండూ కలిసి పేద, శ్రామిక వర్గ స్త్రీల ప్రయోజనాలను కులీన స్త్రీలు తాకట్టు పెట్టటానికి దారి తీశాయి.
ఒకప్పుడు స్త్రీవాద ఆలోచనని స్వీకరించిన వాళ్ళు ఇప్పుడు సంక్షేమ వ్యతిరేక విధానాలని సమర్థిస్తున్నారు. ఈ రెండిరటి మధ్య వారికి ఏ వైరుధ్యం కనిపించట్లేదు. తమ తరహా స్త్రీవాదానికి తామే ఒక పేరు పెట్టుకుంటున్నారు. స్త్రీవాదాన్ని ఒక వస్తువుగా, ఒక లైఫ్ స్టైల్‌గా మార్చేయటంతో అసలు స్త్రీవాద రాజకీయాల ప్రాధ్యాన్యత మరుగున పడిపోయింది. ఇప్పుడు అనేక మంది ఆడవాళ్లు స్త్రీవాదం లేని పౌర హక్కులని కోరుకుంటున్నారు. బయట సమానత్వం ఉండాలి గాని ఇంట్లో పితృస్వామ్యం దెబ్బ తినకుండా ఉండాలని భావిస్తున్నారు. పితృస్వామ్యంతో ఇలా లాలూచీ పడటం, ఉదాహరణకి ఆడవాళ్లు బయట జీతం కోసం పని చెయ్యటం లాంటివి, ఆడవాళ్ళని ఇంకా బలహీనులని చేస్తాయని ముందు చూపున్న స్త్రీవాదులు ముందే ఊహించారు. వ్యవస్థలో మౌలిక మార్పులు లేకుండా ఇచ్చే హక్కులని, అంతే తేలిగ్గా మన పాలకులు వెనక్కి తీసేసుకోగలరు. ఇప్పటికే పునరుత్పత్తి హక్కుల విషయం, ప్రత్యేకించి గర్భస్రావం విషయంలో ఇది స్పష్టమయింది. పితృస్వామ్య సమాజంలో పౌర హక్కులు ఇవ్వటం ఒక రకంగా ప్రమాదకరంగా పరిణమించింది. ఎందుకంటే మన ఆధిపత్య నిర్మాణాలు మారుతున్నాయనీ, పరిస్థితులు పెద్దగా మారక పోయినప్పటికీ మనం బాగానే ఉన్నామనే భావనకీ దారి తీశాయి. వాస్తవంలో ఆడవాళ్లు స్త్రీవాదం నుండి దూరం జరగటంతో సామాజిక నిర్మాణాలు మరింత బలపడ్డాయి. తీవ్రమైన స్త్రీవాద వ్యతిరేకత (బాక్ లాష్ ) కూడా స్త్రీవాద ఉద్యమం బలహీనపడ్డానికి దారి తీసింది. ఈ బాక్ లాష్లో ప్రధాన భాగం అవకాశవాదం, సాంప్రదాయిక ఆడవాళ్ళ స్త్రీవాదం ఎంత పనికమాలిందో ఎత్తి చూపడం. ఉదాహరణకి డానియెల్ క్రిటెండన్ రాసిన

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

గాంధీభవన్‌లో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సవరణ మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో స్టేట్ మహిళ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సునీతా రావు ఆదేశాల మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కామని వనిత ఆధ్వర్యంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చెర్ల పద్మ హాజరయ్యారు. చందుర్తిలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకల సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ముత్తారంలో మండల యూత్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, మాజీ యూత్ అధ్యక్షుడు బియ్యని శివకుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనికాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు రుద్రంగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్ జలపతి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద మండల మాజీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కమ్మర్పల్లి మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని బస్టాండ్ దగ్గరలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించార పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి కార్యకర్తలు పాల్గొన్నారు. సైదాపూర్ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు సిరిసిల్లలోని గాంధీచౌక్‌లో రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్ గాంధీ భారతదేశానికి ప్రధానమంత్రి గా అనేక సేవలందించారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. యైటీంక్లయిన్ కాలనిలోని తెలంగాణ చౌరస్తాలో జరిగిన రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి హాజరై కేక్ కట్ చేసి మాట్లాడారు.


ఎల్లారెడ్డిపేటలో..




చందుర్తిలో..


గాంధీభవన్‌లో..


కమ్మర్‌పల్లిలో..


కమాన్‌పూర్‌లో..


ముత్తారంలో..


రుద్రంగిలో..


సిరిసిల్లలో..




సైదాపూర్‌లో..


తంగళ్లపల్లిలో..

# కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధియే ధ్యేయం

## నన్ను గెలిపించిన ప్రజలకు మేలు చేయడమే నా లక్ష్యం : కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి):**కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి బండి సంజయ్ కరీంనగర్ కలెక్టరేట్ కు విచ్చేశారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిసహా పలువురు అధికారులు బండి సంజయ్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ శాఖధిపతులతో ఏర్పాటు చేసిన ఇంటరాక్షన్ సమావేశానికి బండి సంజయ్ హాజరయ్యారు. శాఖల వారీగా కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న భాగస్వామ్యం, నిధులు వివరాలతోపాటు కేంద్ర పథకాల అమలు తీరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలు, స్మార్ట్ సిటీ వ్యవసాయం, పౌర సరఫరాలు; మహిళ, శిశు సంక్షేమం; వైద్య, ఆరోగ్యం; గ్రామీణ నీటి సరఫరా తదితర విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్, రూరల్), ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్), ప్రధానమంత్రి ఉజ్వల యోజన, జీఎం-జీకేఏవై, పోషణ్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకల అములు పైన సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను మంత్రికి తెలియజేయగా, ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులు గణాంకాలతో సహా వాటి ప్రగతిని వివరించారు.ముఖ్యంగా పీఎం స్వనిధి, నేషనల్ హెల్త్ మిషన్, స్మార్ట్ సిటీ, పోషణ్ అభియాన్, మధ్యాహ్నం భోజనం, పౌర సరఫరాలు, ఆయిల్ ఫాం, రోడ్ల నిర్మాణంపై పురోగతి వివరాలను కేంద్ర మంత్రి అధికారులను వివరించారు. ఆయా పథకాలు, అభివృద్ధి పనుల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, కేంద్రం నుండి అందాల్సిన సహకారంపైనా అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. కరీంనగర్ లో కేంద్ర నిధుల తో సీఐటీడీ భవనాన్ని ఏర్పాటు చేశామని, అయితే రూ.6 కోట్ల విలువైన మిషన్ ను ఇంకా ఏర్పాటు చేయలేదని అధికారులు చెప్పడంతో 'కష్టపడి కేంద్రాన్ని ఒప్పించి యువతకు శిక్షణ ఇప్పించేందుకు సీఐటీడీ భవనాన్ని ఏర్పాటు చేసుకున్నం. మిషన్ లేకపోతే ఎలా? ఏ ఇన్నాళ్లు ఆ విషయం ఎందుకు చెప్పలేదు. ఇకపై శాఖల వారీగా ఏ ఇబ్బంది ఉన్నా నా దృష్టికి తీసుకురండి"అని పేర్కొన్నారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులకు రెండు కళ్లులాంటివి. రాష్ట్ర ప్రథకాలే కాదు.. కేంద్ర పథకాల అమలుపైనా ప్రదానంగా ఫోకస్ పెట్టండి. 'నావల్ల మీకు ఏ ఇబ్బంది రానివ్వను. కేంద్ర పథకాలను పూర్తి



స్థాయిలో అర్హులకే అందిం చేలా చూడండి. మీకు అండగా ఉంటా. మీపై ఒత్తిళ్లు రాకుండా నేను కాపా డుకుంటా. పార్లమెంట్ నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేసేం దుకు పూర్తిగా సహకరించండి. జిల్లా అబివృద్ధి కోసం కేంద్రం నుండి అధిక నిధులు తీసుకొచ్చేందకు ప్రయత్నిస్తా" అని తెలిపారు.. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిపై చా లా మందికి అవగాహన లేకపోవడంతో లబ్ధి చేకూరడం లేదని అన్నారు.ప్రభుత్వం అం దజేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, ఎవరు వీటికి అర్హులు అనే పూర్తి సమాచారాన్ని అట్టడుగు స్థాయి వర్గాల ప్రజలకు వివరించి,వారు లబ్ధి పొందేవిధంగా చూడాలి అన్నారు

## రుణమాఫీపై ధర్నాలకు బీఆర్ఎస్ పిలుపు

అయోమయానికి, ఆవేదనకు గురిచేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రెండు లక్షల వరకు రుణమాఫీని అందరికీ వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఎన్నికలు కాగానే రైతు రుణమాఫీ కోసం రూ. 40 వేల కోట్ల రూపాయలు అవసరమని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారని.. కానీ కేబినెట్ మాత్రం కేవలం 31 వేల కోట్లకు మాత్రమే అనుమతిచ్చిందని అన్నారు. ఇక బ్జడెట్‌లో 26 వేల కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపి రైతులను మోసం చేశారని తెలిపారు. బ్జడెట్‌లో కేటాయించిన రూ. 26 వేల కోట్లలో నుంచి కేవలం 18 వేల కోట్ల రూపాయలే ఖర్చు చేసి రైతులను నిలువునా ముంచినట్లు తీవ్రంగా మండిపడ్డారు. రైతు రుణమాఫీ జరగక ఆందోళన చేస్తున్న రైతులకు అండగా ఉండాల్సింది పోయి.. మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను మరింత గందరగోళానికి గురిచేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం 40? మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ది చేకూరలేదని, క్షేత్రస్థాయి నుంచి తమకు సమాచారం అందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి కారణంగా లక్షలాది మంది రైతన్నలు రోజు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని వెంటనే చేయాలని, ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. డిసెంబర్ 9లోగా రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఆ తర్వాత ఆగస్టు 15 అంటూ మరోసారి మాట తప్పారని మండిపడ్డారు. అడ్డగోలు ఆంక్షలు పెట్టి రైతులకు రుణమాఫీ అందకుండా చేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. లక్షలాది మంది రైతన్నలకు అండగా ఉండేందుకు ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువచ్చేందుకే ఈనెల 22వ తేదీన అన్ని మండల కేంద్రాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతన్నలకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ అందే వరకు భారత రాష్ట్ర సమితి తరఫున ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

### సిఎం, మంత్రుల మధ్య అవగాహనా లోపం: హరీశ్

రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.31 వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేసినట్టు చెప్పడం హాస్యాస్పదమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తలాతోక లేకుండా రోజుకో తీరుగా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా ఆందోళన చేస్తున్నారని చెప్పారు. సీఎం, మంత్రులు ఇష్టానుసారం మాట్లాడి గందరగోళం సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు.

# పది రోజుల్లో ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి

- 23, 24వ తేదీల్లో నూతన రెవెన్యూ ముసాయిదాపై జిల్లాల్లో వర్క్ షాప్‌లు
- ఎల్ఆర్ఎస్ పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్
- వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, నూతన రెవెన్యూ చట్టం -2024 ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఐదు రోజులలో వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ఇరిగేషన్ అధికారులు జిల్లాలోని అన్ని ట్యాంకులను పరిశీలించాలని, వాటి పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి అధికారులు బ్రిడ్జిలు, కాజువేలను పరిశీలించాలని,వరదల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని తెలిపారు.మున్సిపల్ కమిషనర్లు అర్బన్ ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలను గుర్తించాలన్నారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరదల వల్ల ఎలాంటి సమస్య వచ్చిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనైనదని, 6281492368 నెంబర్ కు ఫోన్ చేసి సత్వర సహాయం పొందాలని సూచించారు. ఈ నెల 23న నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వివిధ రంగాల మేధావులతో వర్క్ షాప్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను ఇరిగేషన్ ఏఈ లకు లాగిన్ ఇవ్వడం జరిగిందని, దరఖాస్తుల పరిశీలించి అప్లోడ్ చేయాలని అన్నారు. ధరణి ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ,తిరస్కరించిన దరఖాస్తు లను సరైన కారణాలను దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు ట్యాంకుల వారీగా ఉన్న భూములను పరిశీలించి నివేదిక సమర్పించాలని, ముందుగా ఐదు కమిషనర్లు మున్సిపాలిటీలలో గల చెరువుల వద్ద గల భూములను పరిశీలించి నివేదిక అందజేయాలని తెలిపారు.వర్షాల వల్ల విద్యుత్ స్తంభాలు, వైర్లు ,పాడైన చోట విద్యుత్ శాఖ అధికారులు వెంటనే పరిశీలించి కొత్త వాటిని అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత, ఇరిగేషన్ ఈఈ సత్యనారాయణ, సిపిఓ కిషన్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, పిఆర్ ఈఈ మాధవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆర్టీసీ రాఖీ రికార్డ్..

- ఒక్క రోజే 46.78 లక్షల ఆదాయం..
- 51,095 కిలోమీటర్లు 68,457 మంది ప్రయాణికుల రాకపోకలు
- దేవరకొండ ఆర్టిసి డిపో ఆక్యుపెన్సి రేషియో లో రాష్ట్రస్థాయిలో 5వ స్థానం..
- నలగొండ రీజినల్ పరిధిలో మొదటి స్థానం
- తల్లాడ రమేష్ బాబు దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్

**దేవరకొండ ఆగష్టు 20(జనంసాక్షి):** దేవరకొండ ఆర్టీసీ డిపో రాఖీపౌర్ణమి పండుగ సందర్భంగా సోమవారం (19.08.2024) ఆక్యుపెన్సీ రేషియో(ఓ.ఆర్) లో ఉమ్మడి నల్గొండ రీజియన్ లో మొదటి స్థానం, రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం సాధించినట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డిపోలో కేక్ కట్ చేసి సంస్థ ఉద్యోగులకు, కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. అనంతరం డీఎం రమేష్ బాబు మాట్లాడుతూ.. రాఖీపౌర్ణమి రోజు 143.74 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓ.ఆర్)తో రూ.46.78 లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. 51,095 కిలోమీటర్లు బస్సులు నడిపి 68,457 మంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు క్షేమంగా చేర్చినట్లు తెలిపారు. ఉమ్మడి నల్గొండ రీజియన్ పరిధిలో 1వ స్థానం, రాష్ట్రస్థాయిలో 5వ స్థానం రావడం సంతోషకరంగా, గర్వంగా ఉందని అన్నారు. డిపోలోని ఉద్యోగులు, కార్మికులు సమిష్టి కృషితో కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఇక ముందు కూడా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ.. మంచి ఫలితాలు రాబడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో డిపోను నిలపాలని ఆశిస్తున్నట్లు సిబ్బందికి పలు సూచనలు చేస్తూ.. దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

# ట్రామా కేర్ సెంటర్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

## ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని సిద్ధం చేయాలి

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**నల్గొండ బ్యూరో,ఆగష్టు20, (జనంసాక్షి):** హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై కట్టంగూరు మండలం వామనగుండ్ల శివారులో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కు అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి కట్టంగూర్ తహసిల్దార్ ప్రసాద్ ను ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కట్టంగూరు మండలం వామన గుండ్ల గ్రామ సరిహద్దుల్లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కై స్థలాన్ని పరిశీలించారు.3 రోజుల్లో గుర్తించిన స్థలంలో ప్రభుత్వ స్థలం,ఖాళీ స్థలాన్ని స్పష్టంగా విభజించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అంతేకాక గుర్తించిన స్థలంలో చెట్లను తొలగించాలని,చెత్త,చెదారాన్ని తీసివేసి చదును చేయించాలని తహసిల్దార్ ను ఆదేశించారు.వామన గుండ్ల పంచాయతీ కార్యదర్శి జయసుధ తో గ్రామంలో ఫీవర్ సర్వే వివరాలను,శానిటేషన్,ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియలపై అడిగి తెలుసుకున్నారు.

## నల్గొండ ఎన్ జి కాలేజీలో

# విద్యార్థుల అవస్థలు

## నల్గొండ పరీక్ష తరగతి గదిలో నీరు





**నల్గొండటౌన్, ఆగష్టు 20(జనంసాక్షి)** నల్గొండ నాగార్జున గవర్నమెంట్ కాలేజీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వితీయ సంవత్సరం పీజీ కి సంబంధించిన విద్యార్థులు మధ్యాహ్నం 2 గంటల సమయం లో రూం నెంబరు 123 లో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు, పరీక్ష వ్రాసే తరగతి గది నిండా వర్షపు నీరుతో నిండిపోవడం జరిగింది, మరియు చెత్త చెదారంతో దుర్వాసన వెదజల్లడం జరిగింది, ఇందులో దాదాపు 45 మంది వరకు పరీక్ష వ్రాశారు, పరీక్ష వ్రాస్తున్నంత సేపు స్టూడెంట్స్ వారి యొక్క మోఖానికి గుడ్డలు అడ్డం పెట్టుకొని పరీక్షలు రాశారు, ఇందులో భాగంగా కొంతమంది విద్యార్థుల పరీక్ష జవాబు పేపర్లు వర్షపు నీటిలో పడడం జరిగింది, ఇతర తరగతి గదిలు ఖాళీగా ఉన్నప్పటికీ అందులో కూర్చోబెట్టకుండా, అదేతరగతి గది లో విద్యార్థులు అవస్థలు పడుతూ పరీక్షలు వ్రాశారు, ఈ విషయంపై పరీక్ష రాసేముందు విద్యార్థులు పరీక్ష రాయకుండా చాలాసేపు పరీక్ష తరగతి గది బయట నిలబడ్డారు, ఈ విషయంపై ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ అయినటువంటి అంతటి శ్రీనివాసులు కు తెలియజేసినప్పటికీ విద్యార్థుల బాగోగులు ఏమి పట్టించుకోకుండా విని విననట్టు వదిలేశారు, మరియు కళాశాల ప్రిన్సిపల్ అయినటువంటి ఉపేందర్ కనీసం పరీక్ష రాసే తరగతి గదిలను పట్టించుకోకుండా ఎగ్జామ్ పూర్తి అవకముందే ఇంటికి వెళ్లిపోయినట్టు ఆరోపనులు ఉన్నాయి. కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకొని జవాబు పరీక్ష పత్రాలు కింద పడిపోయినటువంటి విద్యార్థులకు న్యాయం చేయాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

# ఆందోళనొద్దూ.. రుణమాఫీ అవుతుంది..

## ఏడిఏ అప్జల్ బేగం

**చంద్రుగొండ ఆగష్టు 20 (జనంసాక్షి ):** రైతుల రుణాలు 2 లక్షలకు పైగా ఉంటే పై మొత్తాన్ని చెల్లించడం ద్వారా రెండు లక్షలు రుణమాఫీ అవుతుందని ఏడీఏ అఫ్జల్ బేగం స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని రైతులకు సూచనలు చేశారు. బ్యాంకులు, సొసైటీలలో రుణమాఫీ కాని రైతులు ఈనెల 30 లోపు దరఖాస్తును మండల వ్యవసాయ అధికారికి అందజేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మండల బిఆర్ఎస్ నాయకులు అధికారికి తెలపడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వినయ్, ఏఈఓ లు బిఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి

## భారీ వర్షాల కారణంగా ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి






**నలగొండ బ్యూరో,ఆగష్టు 20,(జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపద్యంలో ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవిన్యూ, సమాచార,పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.మంగళవారం అయన ఖమ్మం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా అధికారులతో భారీ వర్షాలు,ధరణి,నూతన రెవిన్యూ చట్టంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న 5 రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని,అందువల్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండడంతో పాటు,ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండాచూడాలని,ముఖ్యంగా ప్రజల ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు.వర్షాల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని,ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని,లేని పక్షంలో రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు.భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,స్థానిక పరిస్థితుల ఆధారంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడం లేదా నడిపించడం చేయాలని అన్నారు.ప్రస్తుత రెవెన్యూ చట్టంలో మార్పులతో తీసుకురానున్న కొత్త రెవిన్యూ చట్టంపై ఈనెల 23,24 తేదీలలో జిల్లా స్థాయిలో వర్క్ షాప్ నిర్వహించి మేధావులు, సీనియర్ సిటిజన్ల అభిప్రాయాలను తీసుకొని రాష్ట్ర స్థాయికి పంపించాలని ఆయన కోరారు.ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని,జిల్లా కలెక్టర్లు పెండింగ్లో ఉన్న అన్ని ధరణి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు.అదేవిధంగా ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలని,గతంలో ఏవైనా డాక్యుమెంట్లు అప్లోడ్ చేయనట్లయితే ఇప్పుడు అప్లోడ్ చేసేందుకు అవకాశం ఉన్నందున అలాంటి వాటిని గుర్తించి అప్లోడ్ చేయించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతి కుమారి మాట్లాడుతూ రానున్న 5 రోజులపాటు,భారీ వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని,ముఖ్యంగా సాగునీటి ట్యాంకులు, చెరువులు,కుంటల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు, వంకలు,కల్వర్టులు పొంగి ప్రవహిస్తున్న చోట ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులనుఏర్పాటుచేయాలని,అవసరమైతే ట్రాఫిక్ ను మళ్లించాలని తెలిపారు.ఈ నెల25 వరకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసిందని అన్నారు.పరిస్థితులను బట్టి ఆయా జిల్లాలలో పాఠశాలల ను మూసి వేయడం లేదా నడిపించడం చేయాలని అన్నారు.రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు రానున్న కొత్త రెవిన్యూ చట్టంపై ఈ నెల 23,24 తేదీలలో వర్క్ షాప్ లు నిర్వహించాలని ఆదేశించారు.పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులు అన్నింటిని ఒక కొలిక్కి తీసుకురావాలని,ఎక్కడైనా సందేహాలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఇతర అధికారులు రాష్ట్రస్థాయి నుండి హాజరుకాగా,జిల్లా నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,ఆర్ డి ఓ లు, మున్సిపల్ కమిషనర్లు,జిల్లా అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.



# ఉప్పుసాక ఆశ్రమ పాఠశాల వార్డెన్ పై ఎమ్మెల్యే ఆగ్రహం..

- మెనూ పాటించని వార్డెన్..
- వార్డెన్ రాములు పై చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా ఫిర్యాదు

**బూర్గంపహాడ్ ఆగష్టు 20 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలంలోని ఉప్పుసాక బాలుర ఆశ్రమ పాఠశాల వసతిగృహాన్ని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత విద్యార్థులకు సంబంధించి హాజరు పట్టికను పరిశీలించారు. అయితే వసతిగృహంలో 76 మంది ఉండగా 45 మందే హాజరు పట్టికలో ఉండటంతో వార్డెన్ రాములు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పాఠశాల, వసతిగృహంలో విద్యార్థులకు మెనూ పాటిస్తున్నారా... ఏం పెడుతున్నారని అడగ్గా మెనూ ఫోటో తీసుకువస్తానని చెప్పి వెళ్లి ఫోటోను ఎమ్మెల్యేకు చూపించడంతో అసహనం వ్యక్తం చేస్తూ ఐటీడీఏ పీవో, ఏటీడీవోలకు ఫోన్ చేసి వార్డెన్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం వసతిగృహం కలియతిరిగి వంటశాల, బాత్రూం తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ ప్రకారం అన్ని వంటకాలను వారికి అందించాలని ఆదేశించారు. వర్షాకాలం సీజన్ కావడంతో పిల్లలకు ఎలాంటి జ్వరాలు, వ్యాధులు రాకుండా చూడాలని, హాస్టల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ ఎందుకు పనిచేయడంలేదని, వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్ను ఆదేశించారు. ఎమ్మెల్యే పాయం వెంట సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇంగువ రమేష్, బాదం రమేష్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# దమ్మపేటలో భారీగా గంజాయి పట్టివేత..

## చాకచక్యంగా గంజాయి ముఠా న పట్టుకున్న దమ్మపేట ఎస్సై,టాస్క్ ఫోర్స్ సిబ్బంది..



**దమ్మపేట ఆగష్టు 20 (జనం సాక్షి):** దమ్మపేట మండలం అచ్చుతాపురం స్టేజ్ వద్ద దమ్మపేట పోలీస్ సిబ్బంది,ఎక్సైజ్ సిబ్బంది కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అశ్వరావుపేట వైపు నుంచి వస్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 508 కేజీల నిషేధిత గంజాయిని వాహనం నందు కనుగొన్నారు. దీని విలువ సుమారుగా1.77కోట్లు ఉంటుందని,ఇట్టి విషయాన్ని దమ్మపేట పోలీస్ స్టేషన్ నందు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో తెలిపారు.ఒరిస్సా రాష్ట్రం కొల్లాపూర్ నుంచి కొత్తగూడెం జిల్లా మీదుగా మహారాష్ట్ర తరలిస్తుండగా కెమికల్ బస్తాల మధ్యలో అక్రమ గంజాయి అమర్చుకొని వెళ్లే క్రమంలో ఎంతో చాకచక్యంగా పోలీసులు, టాస్కోర్స్ సిబ్బంది కనుగొని వాహనాన్ని, గంజాయి ముఠానీ పట్టుకున్నారు.పట్టుపడ్డ వాహనాన్ని సీజ్ చేసి దమ్మపేట స్టేషన్ కు తరలించారు.ఈ ముఠాలో ఆరుగురు సభ్యులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు.మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు గుర్తించి త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామని విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ తెలిపారు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నిషేధిత గంజాయి పై ఉక్కు పాదం మోపుతుందని జిల్లాలో గంజాయి అమ్మిన,సేవించిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి,సిఐ కరుణాకర్, టాస్క్ ఫోర్ సిఐ బెల్లం సత్యనారాయణ, ఎస్ఐ పవీణ్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమాచార విప్లవ పితామహుడు రాజీవ్ గాంధీ

## కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి



**చిట్యాల ఆగస్ట్ 20 (జనంసాక్షి):** చిట్యాల పట్టణంలో కనకదుర్గ ఆలయ సెంటర్ లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకట రెడ్డి అనంతరం మాట్లాడుతూ అతిపిన్న వయసులో భారతదేశానికి ప్రధాన అయినటువంటి రాజీవ్ గాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి చరిత్రలో నిలిచారు ముఖ్యంగా రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఆధునీకరణ, ఉదారీకరణలపై దృష్టి సారించింది. కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్లు వంటి రంగాలలో అతను అనేక ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టాడు. రాజీవ్ గాంధీని భారతదేశంలో సమాచార విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్ విప్లవం యొక్క ఘనత అతనికే చెందుతుంది. అతను విదేశీ విధానంలో చురుకైన పాత్ర పోషించాడు, శ్రీలంక, సోవియట్ యూనియన్ తో సంబంధాలను మెరుగుపరచడానికి కృషి చేశాడు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేశారు. రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటం వెంకన్న,పట్టణ పార్టీ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య యాదవ్, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య,రేముడాల లింగస్వామి, ఏళ్ల వెంకటరెడ్డి, బోడ స్వామి, జంపాల వెంకన్న, బట్టు ఐలేష్, జగిని బిక్షం రెడ్డి,సాగర్ల గోవర్ధన్, పాల శివ అమరోజు మదన్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిష్కరించాలి: టి పి టి ఎ ఫ్

**భద్రాచలం, ఆగష్టు 20 (జనంసాక్షి):** గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల అప్పీళ్లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ సంబంధిత అధికారులను కోరడం జరిగింది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బి.రాజు, జిల్లా కార్యదర్శి బి.బాలు, ఉపాధ్యాయ దర్శిని పత్రికా సంపాదకులు మునిగడప రామాచారి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.... తెలుగు మరియు హిందీ భాషా పండితులను వారి అంగీకారం లేకుండానే బాలికల పాఠశాల లకు కేటాయించడం జరిగిందని, వారి నుండి ఆన్లైన్ ద్వారా గాని, మ్యాన్యువల్‌గా గాని ఆప్షన్లు తీసుకున్న తర్వాతనే పాఠశాలలు కేటాయించాలని. బదిలీల సీనియారిటీలో సీనియర్లుగా ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వాళ్ళ యొక్క ఆప్షన్ల ప్రకారం పాఠశాలలు కేటాయించబడకుండా జూనియర్లకు కేటాయించబడటం జరిగిందన్నారు. జరిగిన నష్టాన్ని నివారిస్తూ న్యాయమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా పాఠశాల సహాయకులకు పాఠశాలల కేటాయింపులలో వివిధ రకాలుగా నష్టం జరగడాన్ని సరిచేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు శంకర్ పాల్గొని తమ మద్దతును ఉపాధ్యాయులకు తెలియజేశారు.

## గ్లైకోపైరోలేట్‌కు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం



**హైదరాబాద్, ఆగస్ట్ 20 (జనంసాక్షి) :** నరాల సంబంధిత సమస్యలతో ఉన్న వారు నోరూరడంలో తలెత్తే ఇబ్బందులకు ఉపయోగించే గ్లైకోపైరోలేట్ ఓరల్ సొల్యూషన్ కు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్డీఏ) ఆమోదం లభించిందని గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు. ఇది రిఫరెన్స్ లిస్టెడ్ డ్రగ్ అన్నారు. ఇది ఓరల్ సొల్యూషన్ 1 ఎంజీ/5 ఎంఎల్ కలవన్నారు. ఇది మూడు నుంచి పదహారేళ్ళ వయస్సు గల రోగులకు సూచించే యాంటికోలినెర్జిక్ మందు అన్నారు. అమెరికా మార్కెట్‌లో గ్రాన్యూల్స్ బలోపేతం అవుతుందన్నారు. ఈ ఆమోదం దృఢమైన నాణ్యతా ప్రమాణాలకు నిదర్శనమన్నారు.

## ఇన్ఫోసిస్ కీలక ప్రకటన




**హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** భారతీయ కంపెనీలు కూడా గత 10 ఏళ్ల నుంచి ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల ప్యాకేజీల్లో పెద్దగా మార్పులు చేయలేదనే విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి. ఈ సమయంలో రెండో అతిపెద్ద దేశీయ టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ కీలక ప్రకటన చేసింది. ఫ్రెషర్ల నియామకానికి సంబంధించి కొత్త ప్రోగ్రాం రూపొందిస్తున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా హైర్ చేసుకునే సిబ్బందికి ప్రారంభంలోనే 9 లక్షల వరకు ప్యాకేజ్ ఆఫర్ చేయనున్నట్లు స్పష్టం చేసింది. సాధారణ ఫ్రెషర్స్ హైరింగ్ కు ఇది పూర్తి భిన్నంగా ఉండనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా క్యాంపస్ ప్లేస్మెంట్ ల కోసం ఈ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వివరించింది. సాధారణంగా ఇన్ఫోసిస్ ఫ్రెషర్లకు 3 నుంచి 3.5 లక్షల మేర వార్షిక వేతన ప్యాకేజ్ ఇస్తుంది. అయితే లేటెస్ట్ టెక్నాలజీలు రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతిభ కలిగిన ఫ్రెషర్లను ఆకర్షించడం కోసం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రోగ్రామింగ్, కోడింగ్, సాఫ్ట్వేర్ లో సవాళ్లను గుర్తించగలిగే నైపుణ్యం కలిగిన కొత్త వారికి ఇందులో అవకాశం కల్పించనుంది. ఈ మేరకు రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పింది. వీరి వేతనాలు 4.5 లక్షల నుంచి ప్రారంభమై 9 లక్షల మధ్యలో ఉంటాయని అనౌన్స్ చేసింది. ఇదేరంగంలో అగ్రగామిగా వెలుగొందుతున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కూడా గతేడాది ఇదే తరహా ప్లాన్ రోల్ అవుట్ చేసింది. ప్రైమ్ గా పిలవబడే ఈ ప్రాజెక్టులో సాఫ్ట్వేర్ డెవలపర్‌గా ఎంపికైన వారికి 9-11 లక్షల ప్యాకేజీ అందించాలని నిర్ణయించింది. ప్రస్తుత బూమింగ్ టెక్నాలజీస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి సాంకేతికతల్లో ప్రావీణ్యులకు ఈ మేరకు జీతభత్యాలు ఆఫర్ చేయాలని భావించింది. ఇదే కాకుండా నింజా, డిజిటల్ పేరిట కూడా 3.6, 7.5 లక్షల ప్యాకేజీతో టీసీఎస్ ఫ్రెషర్స్ నియామకాలు చేపడుతోంది.




## భారీ లాభాల్లో ముగిసిన సెన్సెక్స్-నిఫ్టీ



**హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** మార్కెట్ల ముగింపు సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 378 పాయింట్ల లాభంలో ఉండగా మరో కీలక సూచీ నిఫ్టీ 126 పాయింట్ల మేర లాభంతో నేడు ప్రయాణాన్ని ముగించాయి. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 435 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 487 పాయింట్ల మేర గెయిన్ అయ్యాయి. ఈ క్రమంలో ప్రధానంగా ఫైనాన్షియల్ రంగానికి చెందిన కంపెనీ షేర్లు మంచి ర్యాలీని నమోదు చేశాయి. ఎన్ఎస్ఈలో ఎస్బీఐ లైఫ్, హెచ్డీఎఫ్సీ లైఫ్, బజాజ్ ఫిన్ సర్వ్, ఇండస్ఇండ్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, హిందాల్కో, గ్రాసిమ్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ బ్యాంక్, ఐషర్ మోటార్స్, బీపీసీఎల్, యాక్సిస్ బ్యాంక్, హీరో మోటార్స్, దివీస్ ల్యాబ్, సన్ ఫార్మా, విప్రో, నెస్లే, ఎన్టీపీసీ, డాక్టర్ రెడ్డీస్ కంపెనీల షేర్లు లాభాలతో టాప్ గెయినర్లుగా నిలిచాయి. ఇదే క్రమంలో ఎయిర్ టెల్, ఓఎన్జీసీ, అపోలో హాస్పిటల్స్, అదానీ ఎంటర్ ప్రైజెస్, సిప్లా, ఐటీసీ, టాటా కన్జూమర్, అదానీ పోర్ట్స్, జేఎస్డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ కంపెనీల షేర్లు నష్టాలతో టాప్ లూజర్లుగా నేడు తమ ప్రయాణాన్ని ముగించాయి.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 452 | ₹ 54 |
| వరంగల్ | ₹ 452 | ₹54 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| | |
|---|---|
| ₹72,770 (24 క్యారెట్లు) | ₹66,700 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹66,700 (22 క్యారెట్లు) | ₹72,770 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 91,000

## ఏపీలో హెచ్‌సిఎల్ భారీ విస్తరణ

- మరో 15 వేల ఉద్యోగాలకు అవకాశం
- మంత్రి లోకేశ్‌తో ప్రతినిధుల భేటీ



**అమరావతి, ఆగస్ట్20 (జనంసాక్షి) :** ఏపీలో తన కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు హెచ్‌సీఎల్ సన్నాహాలు చేస్తోంది. ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయిన హెచ్‌సీఎల్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివశంకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్‌లు మరో 15వేల ఉద్యోగాల కల్పనకు సుముఖత వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్‌సీఎల్ సంస్థలో 4,500 మందికి ఉద్యోగాలు లభించాయి. విస్తరణ ద్వారా రాష్ట్రంలో మరో 5,500 మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఫేజ్ -2లో భాగంగా నూతన కార్యాలయం నిర్మాణం చేపట్టి మరో 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఐటీలో ప్రస్తుతం అంతర్జాతీయంగా చోటుచేసుకున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న స్కిల్ సెన్సస్, సిల్క్ డెవలప్‌మెంట్‌లో తాము కూడా భాగస్వామ్యం వహిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విస్తరణకు కావాల్సిన కొన్ని అనుమతులు, గత ప్రభుత్వం నిలిపివేసిన రాయితీలు విడుదల చేయాల్సిందిగా హెచ్‌సీఎల్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ ని కోరారు. ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం యువత ఉపాధి అవకాశాలపై దృష్టి సారించింది. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను క్రమంగా భర్తీ చేస్తోంది. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం కంపెనీలతో చర్చలు జరుపుతోంది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వివిధ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. రాష్ట్రంలో కంపెనీలు నెలకొల్పి, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాల గురించి మాట్లాడుతున్నారు. ఆ క్రమంలో హెచ్‌సీఎల్ కంపెనీ ముందుకొచ్చింది. భారీ విస్తరణకు ప్రణాళికలు రచించింది. గతంలో 4500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఈ సారి 10 వేల మందికి ఉద్యోగం ఇస్తామని చెబుతోంది. మొత్తం 15 వేల మందికి ఉపాధి కల్పిస్తామని హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

## ఒక్కరోజే 1400 పెరిగిన బంగారం ధర



**హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలకు రెక్కలొచ్చాయి. గత నెల 23న కేంద్ర బడ్జెట్‌లో బంగారం, వెండి దిగుమతి సుంకాలను తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న దరిమిలా వాటి ధరలు కాస్త ఉపశమించాయి. కానీ దేశీయంగా గిరాకి పెరగడంతో దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర మంగళవారం ఒక్కరోజే రూ.1400 పెరిగి రూ.74,150లకు చేరుకున్నది. శుక్రవారం 24 క్యారట్ల బంగారం పది గ్రాములు రూ.72,750 వద్ద స్థిర పడింది. మరోవైపు మంగళవారం కిలో వెండి ధర రూ.3,150 వృద్ధి చెంది రూ.87,150 వద్ద స్థిర పడింది. శుక్రవారం కిలో వెండి ధర రూ.84 వేల వద్ద ముగిసింది.




## ట్రంప్ కేబినెట్‌లో ఎలాన్ మస్క్‌కు కీలక శాఖ!



**వాషింగ్టన్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తాను గెలిస్తే టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు క్యాబినెట్‌లో చోటిస్తానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అలా కాని పక్షంలో సలహాదారుడిగానైనా నియమించుకుంటానని తెలిపారు. మస్క్ చాలా తెలివైన వ్యక్తి అంటూ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఎక్స్ వేదికగా ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నారు. విద్యుత్ వాహనాలపై ఇస్తోన్న 7,500 డాలర్ల ట్యాక్స్ క్రెడిట్‌ను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తానని పేర్కొన్నారు. ట్యాక్స్ క్రెడిట్‌లు, పన్ను ప్రోత్సాహకాలు సాధారణంగా ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూర్చే అంశాలు కావని అభిప్రాయపడ్డారు. అధికారంలోకి వస్తే ఆ మేరకు నిబంధనల్లో మార్పు చేయనున్నట్లు తెలుస్తోంది. లేదా దాన్ని పూర్తిగా రద్దు చేసేలా కాంగ్రెస్‌లో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ తాజాగా వెల్లడించారు. అధిక ధరల వల్ల విద్యుత్తు కార్లకు అంతగా గిరాకీ లేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఇప్పటికీ తాను పెట్రోల్ కార్ల తయారీ వైపు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు. తనను క్యాబినెట్‌లోకి తీసుకుంటానన్న ట్రంప్ ప్రతిపాదనపై ఎలాన్ మస్క్ సానుకూలంగా స్పందించారు. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ'కి నేతృత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ బాధ్యతల్లో ప్రసంగిస్తున్నట్లుగా ఉన్న ఓ చిత్రాన్ని కూడా పోస్ట్ చేశారు. ప్రభుత్వ పెట్టుబడులను క్రమబద్ధీకరించి. వృథాను అరికట్టేలా ఓ విభాగాన్ని ఏర్పాటు చేయాలని ట్రంప్‌తో ఇటీవల జరిగిన చర్చలో మస్క్ ప్రతిపాదించారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌నకు మస్క్ తన మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయనపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. జేడీ వాన్స్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపిక చేయడాన్నీ ప్రశంసించారు. ఇటీవల వీరిద్దరి మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. ఈ మధ్యే ఇరువురూ ఎక్స్‌లో ఇంటర్వ్యూ తరహాలో వివిధ అంశాలపై చర్చించుకున్న విషయం తెలిసిందే. మస్క్‌కు కీలక పదవి ఇస్తానని ట్రంప్ అనడం ఇది తొలిసారేం కాదు. 2016లో గెలిచిన సమయంలో రెండు కీలక సలహా మండళ్లకు మస్క్‌ను ఎంపిక చేశారు. కానీ, పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి బయటకు రావాలనే ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2017లోనే ఆయన రాజీనామా చేశారు.

## వాగుబాయి తిమ్మప్పకు పీహెచ్‌డీ ప్రదానం



**హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీ అవార్డు వాగుబాయి తిమ్మప్పకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లా వారు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్డి) డిగ్రీని ప్రదానం చేశారు. "భారతదేశంలో స్వాతంత్ర్యానంతర భూసంస్కరణలు: తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక సూచనలతో కూడిన అధ్యయనం." అన్న అంశంపై పీహెచ్‌డీ ఇచ్చారు. ప్రొఫెసర్ వై.విష్ణుప్రియ పర్యవేక్షణ జరిగింది. వాగుబాయి తిమ్మప్పది మద్దెలబండ గ్రామం, మండలం మల్దకల్. ఆయన మద్దెలబండ తండా జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో సెకండరీ విద్యను పూర్తి చేశారు. గద్వాల్‌లోని జ్ఞానప్రభ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియేట్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. వాగుబాయి తిమ్మప్ప తన పాఠశాల విద్య నుండి విశ్వవిద్యాలయ విద్య వరకు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ద్వారా విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొనేవారు. తెలంగాణ ఉద్యమం (2009-2013)లో కూడా ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. అక్కడ తెలంగాణ స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌జేఏసీ) ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వరంగల్ కాకతీయ యూనివర్సిటీ వరకు 21 రోజుల పాటు 400 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. అందులో పాల్గొనడంలో కీలక పాత్ర పోషించారు. సవాళ్లు ఉన్నప్పటికీ, అతను తన విద్యకు కట్టుబడి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్న సమయంలో విలువైన జీవిత పాఠాలను నేర్చుకున్నాడు. వాగుబాయి విద్యాపరంగా సాధించిన విజయాలపై అభినందనలు తెలిపారు.

## ప్రమాదాల నివారణకు రైల్వేశాఖ ప్రణాళిక

- ఏఐ సీసీటీవీ కెమెరాలను బిగించనున్నట్లు చెప్పిన బోర్డు సీఈవో

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 (జనంసాక్షి) :** దేశంలో ఇటీవల రైలు ప్రమాదాలు భారీగా పెరిగాయి. ఈ క్రమంలో వాటి నివారణకు రైల్వేశాఖ ప్రణాళికను వెల్లడించింది. అన్ని రైళ్లు, యార్డుల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతో కూడిన సీసీటీవీ కెమెరాలను బిగించనున్నట్లు బోర్డు చైర్‌పర్సన్, సీఈవో జయ వర్మ సిన్హా ప్రకటించారు. ఏఐ సాంకేతికతో కూడిన సీసీ కెమెరాలు అసాధారణ పరిస్థితులను గుర్తిస్తాయని.. భద్రతా చర్యలను మెరుగుపరుచడంలో కీలకపాత్రను పోషించనున్నాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రాక్‌ల భద్రతపై సైతం స్పందించారు. వచ్చే ఏడాది కుంభమేళ జరుగనున్న నేపథ్యంలో ఎలాంటి దుశ్చర్యలు పాల్పడకుండా భద్రతా సంస్థలు రైల్వే ట్రాక్‌లపై నిరంతర నిఘా ఉంచుతాయనన్నారు. ఈ సందర్భంగా కుంభమేళా సన్నాహకాలపై సమీక్షించారు. కుంభమేళాకు ముందే అవసరమైన మౌలిక సదుపాయాలు, విస్తరణ ప్రాజెక్టులను పూర్తవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. 2019 కుంభమేళా సందర్భంగా సుమారు 530 ప్రత్యేక రైళ్లను నడిపించారని.. వచ్చే ఏడాది జరిగే కుంభమేళా కోసం 900 వరకు ప్రత్యేక రైళ్లను నడిపిస్తామన్నారు. ఈ సారి కుంభమేళాకు 30కోట్ల మంది వస్తారని అంచనా వేస్తున్నామని.. రద్దీ నివారణకు అవసరమైన ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రయాగ్‌రాజ్ జంక్షన్‌ను అమృత్ భారత్ స్టేషన్‌గా ఎంపిక చేశామన్నారు. అయితే, దేశంలో జరుగుతున్న రైలు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఆధునికీకరణ, భద్రతా చర్యలకు భారీగా నిధులు వెచ్చిస్తున్నా పట్టాలు తప్పడం, రైళ్లు ఢీకొనడం, లెవల్ క్రాసింగ్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.




## వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా సమన్లు, వారెంట్ల జారీ..

- కొత్త రూల్స్ తెస్తూ సర్కారు నోటిఫికేషన్..!

**న్యూఢిల్లీ, ఆగస్టు 20 (జనంసాక్షి) :** న్యాయ ప్రక్రియ మరింత సజావుగా నిర్వహించేందుకు, ప్రభావవంతంగా ఉండేలా మధ్యప్రదేశ్ ప్రభుత్వం కొత్త రూల్స్ అమలులోకి తీసుకువచ్చింది. ఇకపై సమన్లు, వారెంట్లను వాట్సాప్, ఈ-మెయిల్, టెక్స్‌ట్ మెస్సేజెస్ ద్వార పంపనున్నారు. ఆన్‌లైన్, ఇతర మాధ్యమాల ద్వారా సమన్లు, వారెంట్లు జారీ చేస్తున్న తొలి రాష్ట్రంగా మధ్యప్రదేశ్ నిలిచింది. ఈ మేరకు ఆ రాష్ట్ర హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇటీవల ప్రభుత్వం కొత్త చట్టం కోసం రూల్స్‌ను సిద్ధం చేసింది. ఈ మేరకు కోర్టు నుంచి సమన్లు, వారెంట్లు ఈ-మెయిల్ ద్వారా సమన్లు, వారెంట్ జారీ చేసినట్లుగానే పరిగణించనున్నారు. అయితే, ఈ-మెయిల్, ఫోన్ నంబర్లు, మెసేజింగ్ అప్లికేషన్స్ ఉపయోగించని వారికి మాత్రం కొత్త నిబంధనలు వర్తించవు. అలాంటి సందర్భాల్లో సాంప్రదాయ పద్ధతిలో అవలంభించనున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది సమన్లు, వారెంట్లను అందించనున్నారు. కొత్త నిబంధనలను అమలు చేసేందుకు హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ చర్య న్యాయ ప్రక్రియను వేగవంతం చేస్తుందని.. డిజిటల్ యుగంలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలకమైన అడుగని ప్రభుత్వం పేర్కొంది. కొత్త రూల్ అమలుతో న్యాయ ప్రక్రియలో సమయం, వనరులు ఆదాయ అవుతాయని.. అలాగే, కోర్టు ఉత్తర్వులు మరింత సమర్థవంతంగా అమలు చేయబడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## ముడా స్కాంపై బీజేపీ రాజకీయ డ్రామా

- కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్



**బెంగళూరు, ఆగస్టు 20 (జనంసాక్షి) :** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూకుంభకోణం కుంభకోణం వ్యవహారంలో ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతి ఇవ్వడంతో కర్ణాటక కాంగ్రెస్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలో సీఎం పదవికి సిద్ధు రాజీనామా చేయాలంటూ డిమాండ్లు వెల్లువెతుతున్నాయి. బీజేపీ సైతం సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటూ ఒత్తిడి పెంచుతోంది. ఈ అంశంపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. సిద్ధరామయ్య అమాయకుడని.. ఈ అంశంలో బీజేపీ రాజకీయ డ్రామాకు తెరలేపిందని వ్యాఖ్యానించారు. ఇండియా టుడే టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో శివకుమార్ మాట్లాడుతూ.. 'సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసే ప్రశ్నే లేదు. దేశంలోని చట్టం మా ముఖ్యమంత్రిని కాపాడుతుంది. సిద్ధరామయ్య అమాకుడు. ఈ అంశంలో బీజేపీ రాజకీయ డ్రామా చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ మొత్తం ముఖ్యమంత్రికి సపోర్ట్‌గా ఉంది. సీఎం తప్పు చేశాడని నిరూపించడానికి ఎలాంటి ఆధారాలూ లేవు' అని శివకుమార్ తెలిపారు. మరోవైపు తనపై ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతి ఇవ్వడాన్ని సిద్ధరామయ్య ఇటీవలే హైకోర్టులో సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును ఈ నెల 29న విచారణకు జాబితా చేసింది. కేసు విచారణ వరకు మధ్యంతర ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొంది. ఈ సందర్భంగా సమాధానం చెప్పాలని ప్రతివాదులను కోర్టు కోరింది.

### ఏమిటీ స్కాం?

బీజేపీ నేతలు, హక్కుల కార్యకర్తల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారులోని కెసరె గ్రామంలో సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూమిని సేకరించిన ప్రభుత్వం.. దానికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్ధరామయ్య కుటుంబానికి 38,283 చదరపు అడుగుల భూమిని కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ కేటాయింపు జరిగింది. అయితే, కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర అతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేత ఆర్ అశోక్ నిలదీశారు. క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే రూ. 4 వేల కోట్ల విలువజేసే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. ముడా భూకుంభకోణంలో సిద్ధరామయ్య కొడుకు యతీంద్ర పాత్ర ఉన్నదని, ఆయనే దీనికి అసలు సూత్రధారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఆరోపించారు. ఈ స్కామ్ మూలంగా వేల కోట్లు పక్కదారి పట్టాయని ముగ్గురు హక్కుల కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ.. లోకాయుక్త పోలీసులు సహా గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గవర్నర్ సీఎంపై విచారణకు అనుమతినిచ్చారు.




# సమిష్టి కృషితోనే డ్రగ్స్ రహిత సమాజం

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
డ్రగ్స్ నిర్మూలన కోసం అన్ని శాఖలు ఒకటిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన కోసం లైన్ డిపార్ట్మెంట్స్ ఒకటిగా కలిసి పనిచేయాలని తెలిపారు.ప్రతి స్కూల్, కాలేజీలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు అన్ని రకాల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిపై అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు.జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు వాలంటీర్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేయాలని కమిటీకి సూచించారు. డిఆర్డిఓ, డిడబ్ల్యుఓ వారి సంఘాల మీటింగులలో ఏజెండా ఐటమ్ గా ముందుగా చర్చించాలన్నారు. పాఠశాలలకు వంద మీటర్ల లోపున ఎలాంటి పాన్‌షాపుల లాంటి దుకాణాలు లేకుండా చూడాలని సూచించారు.అన్ని శాఖలు సమన్వయంతో మరకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డిఎస్పి రవి, ఆర్డీవోలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, డిడబ్ల్యుఓ నరసింహారావు, డిఎంహెచ్వో డాక్టర్ కోట చలం, డిఈఓ అశోక్,డ్రగ్ ఇన్స్పెక్టర్ సురేందర్, డిఐఈఓ బాలు నాయక్, సి సెక్షన్ సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరాజు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎక్సైజ్ అధికారి శీలం మల్లయ్య, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలలకు పెద్ద పీట: ఎమ్మెల్యే పాయం

- సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి.
- రూ.60లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..
- అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని వెల్లడి..
- పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి కృషి..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..



**బూర్గంపహాడ్ ఆగష్టు 20 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:- రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తున్నదని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపహాడ్ మండల పారిశ్రామిక ప్రాంతమైన సారపాకను పూర్తిస్థాయి లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని పాయం అన్నారు. మంగళవారం సారపాకలోని సుందరయ్యనగర్, పాత సారపాక, ఎస్సీ కాలనీ, వైఎస్ఆర్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కరెంటు లైన్ ఏర్పాటు కోసం రూ. 60లక్షల అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. మరో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రారంభోత్సవాల అనంతరం సుందరయ్యనగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయడంతో పాటు సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆ పథకాల అమలుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులకు సంబంధించి సంబంధిత వ్యవసాయ అధికారులు సమస్యను పరిష్కరించి త్వరలోనే వారికి రుణ మాఫీ అయ్యేలా చూస్తారన్నారు. త్వరలోనే అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను సైతం ఈనెలాఖరు నుంచి మంజూరు చేయడం జరుగుతుందని, నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయని, ఐదు విడతల్లో ఇళ్ల సంఖ్యను కూడా పెంచి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని, ఇందిరమ్మ ఇల్లు మహిళ పేరుతోనే మంజూరవుతుందని, ఆమె ఖాతాలోనే నగదు జమ అవుతుందని, ప్రధానంగా గడ్డి ఇళ్లు, రేకుల ఇళ్లు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందని పాయం అన్నారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధి చేయడంతో పాటు మండలంలో త్వరలోనే సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో -సునీల్ శర్మ, ఐకేపీ ఏపీఎం, పంచాయతీరాజ్ డీఈ, సారపాక ఈవో కంది మహేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇంగువ రమేష్, బెల్లంకొండ వాసుదేవరావు, బిసి సంఘ నాయకులు దాసరి సాంబ, మహిళా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షురాలు బర్ల నాగమణి, మండల అధ్యక్షురాలు గోనె రేణుక, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న సన్నిధిలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 (జనంసాక్షి):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరేళ్ల శారద కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆమె ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.స్వామివారికి కోడే మొక్కులు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు అద్దాల మండపంలో వేదోక్త ఆశీర్వచనం నిర్వహించగా ఆలయ ఈవో వినోద్ రెడ్డి స్వామి వారి శేష వస్త్రాలను ప్రసాదలను అందచేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి శ్రావణమాసం స్వామివారిని దర్శించుకునేందుకు వస్తానని ఈ క్రమంలో స్వామివారిని దర్శించుకోవడం జరిగిందన్నారు.రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి,నాగుల విష్ణు, ముడికే చంద్రశేఖర్, పాత సత్యలక్ష్మి,కనికరపు రాకేష్, అరుణ్ తేజ చారి,చందు పాల్గొన్నారు.

# బిజెపి గిరిజన మోర్చా ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం..



**దేవరకొండ ఆగష్టు 20(జనం సాక్షి):**
భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా దేవరకొండ నియోజకవర్గం ఆధ్వర్యంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి నిరసనగా స్థానిక బస్టాండ్ ఆవరణలో మహా ధర్నా నిర్వహించి రైతులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల ఏకకాల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం చేపట్టగానే రుణమాఫీ చేయకుండా రైతులకు మొండి చేయి చూపించిందని, ఏకకాల రెండు లక్షల రైతులను మాఫీ చేయాలని లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఏకం చేసి మరో మహా రైతు ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాలు నాయక్, జిల్లా ప్రధానకార్యదర్శి చేనమోని రాములు,జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్, ఎస్టి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్ నాయక్, ఎస్ టీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాలాజీ నాయక్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఏ టీ కృష్ణ, పట్టణ అధ్యక్షులు గుండాల అంజయ్య, ఎస్ టీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ బిక్షపతి జాదవ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జిల్లా స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రెండు లక్షల రుణమాఫీ జరిగే వరకు రైతు పక్షాన నిలబడతాం

## ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ




**టేకులపల్లి, ఆగష్టు 20 (జనం సాక్షి):**
ఆగస్టు 15న నాటికల్లా బ్యాంకులలో వ్యవసాయ రుణాలు పొందిన రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షలు పంట రుణమాఫీ జరిగే వరకు రైతు పక్షాన నిలబడి రైతుల కోసం టిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ హెచ్చరించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు లోని రైతు వేదికలో వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే వద్దకు చేరుకొని రైతుల పక్షాన ఆందోళనకు దిగారు. వ్యవసాయ రుణాలు ఇచ్చే ముందే రైతు యొక్క పలు పత్రాలు పరిశీలించిన తర్వాతనే రుణాలు మంజూరు చేస్తున్నారని, అలాంటి రైతు రుణాల పట్ల ఆంక్షలు విధించడం ఏమిటని, ఎందుకు చేయడం లేదని ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులను నిలదీశారు. ఆగస్టు 15 న రైతులందరికీ రుణమాఫీ అవుతుందని ఆర్భాటంగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయింది. రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేసి కొత్త పంటకు రుణాలు మంజూరు చేయాలి అని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు రైతు గోడును పట్టించుకోవడంలేదని, రైతులు పొలంలో పంటను వదిలేసి బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని అన్నారు. రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గం నుంచి రైతుల కోసం ఉద్యమం మొదలు పెడతామని అన్నారు. బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులని రుణమాఫీ పేరిట అన్ని విధాలుగా మోసం చేసిందని అన్నారు. రుణమాఫీ పై వ్యవసాయ అధికారులకు ఎలాంటి గైడెన్స్ ఇవ్వకుండా మభ్య పెట్టేందుకే గ్రీవెన్స్ డే ఏర్పాటు చేసి దరఖాస్తులు పెట్టుకోండి పరిశీలిస్తామని రైతులను మరొకసారి మోసపూరిత ప్రయత్నాలు చేయడం ప్రభుత్వానికి తగదని, ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం భేషరతుగా రెండు లక్షల రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రుణమాఫీ అయ్యేవరకు రైతులు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్, నాయకులు బానోతు కిషన్ నాయక్, కుమ్మరి కిరణ్ కుమార్, బానోతు రవి తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన..

**మెడికల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..**

**వసీంఖాన్ మృతికి సంతాపం. నల్ల బ్యాడ్జీలతో నిరసన, నివాళులు..**



**దేవరకొండ ఆగష్టు 20(జనంసాక్షి):**
దేవరకొండ పట్టణంలోని ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బంది మొహమ్మద్ కలీం మాట్లాడుతూ సూర్యాపేట ప్రభుత్వ హాస్పిటల్ లో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న వసీంఖాన్ అనే ఉద్యోగి ఆదివారం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆయన మృతికి నివాళులర్పించారు. గత మూడు నెలలుగా జీతాలు రాక పోవడంతో కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నాడని ప్రభుత్వం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు ప్రతి నెలా ఐదు లోపు జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని, ఇలాంటి చావులకు తావు ఇవ్వకుండా ఉద్యోగుల జీతాలు ప్రతినెలా క్రమం తప్పకుండా ఇవ్వాలని కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్, ప్రణయ్ కుమార్,గుండు నరేష్, కవిత, మొహమ్మద్ కలీం,పావని, దేవేందర్, ఆంజనేయులు, మహేష్,నందులాల్,చారీ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా మిషన్ పరివర్తన్

**గంజాయి సేవించి పట్టుబడిన 70 మంది యువకులకు వారి తల్లితండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్**



**నల్గొండటౌన్, ఆగష్టు 20(జనంసాక్షి):**
నల్లగొండ జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాయే లక్ష్యంగా మిషన్ పరివర్తన్ లో బాగంగా జిల్లా యస్పీ శరత్ చంద్ర ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ ఆధ్వర్యంలో నల్లగొండ సబ్ డివిజన్ పరిదిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దాదాపు 70 మంది గంజాయి సేవించి పట్టుబడిన యువకులకు వారి తల్లితండ్రుల సమక్షంలో గంజాయి సేవిస్తే ఆరోగ్యం పై పడే ప్రభావం, దాని వల్లనే కలిగే దుష్పరిణామాల, నష్టాల గురించి డాక్టర్ సైకియాట్రిస్ట్ శివ కుమార్ జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో అడిషనల్ యస్పీ మాట్లాడుతూ జిల్లా యస్పీ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తన్ లో బాగంగా గంజాయి/ డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా జిల్లా ను ఏర్పాటు చేయుటకు ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తున్నామని, గాంజా విక్రయించిన,సేవించిన, అక్రమ రవాణా చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ గంజాయి యుక్తవయస్సులో సేవించి దానికి అలవాటు పడి మీ యొక్క భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. యువత మాదక ద్రవ్యాల అలవాటు పడకుండా తల్లితండ్రుల పై బాధ్యత ఉందని అన్నారు.ఒక్క సారి గంజాయి/డ్రగ్స్ కి అలవాటు పడితే ఆర్ధికంగా,ఆరోగ్యం పై అనేక రకాలుగా ప్రభావం పడుతుందని అన్నారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి విక్రయించిన, రవాణా చేసిన, సేవించినట్లు తెలిస్తే వెంటనే డ్రగ్ కంట్రోల్ నంబర్ 8712670266 సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో డిసియర్బి డీఎస్పీ సైదా నల్లగొండ ఒన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి,2 టౌన్ సిఐ డానియల్ ఆర్ ఐ సంతోష్,యస్.ఐ లు సైదా బాబు,మానస సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ మంత్రి గారు మా గోస పట్టించుకోండి

- తరాలు మారినా తలరాతలు మారడం లేదు
- ప్రతి ఎన్నికల్లో హామీలు ఇచ్చి పట్టించుకోవడం లేదు
- మా సాగు భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోండి
- మా భూములకు ఎలాంటి ప్రభుత్వ రాయితీలు అందక అప్పుల పాలవుతున్నాము
- గిరిజన, దళిత, బీసీ వర్గాల రైతుల ఆవేదన



**టేకులపల్లి, ఆగష్టు 20 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బేతంపూడి రెవెన్యూ పరిధిలో గల సులానగర్ గ్రామానికి చెందిన గిరిజన, దళిత, బీసీ వర్గాలకు చెందిన రైతులు ఆవేదన చెందుతూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదుకోవాలని తమ గోడును విన్నవిస్తూ వేడుకుంటున్నారు. తర తరాలు మారిన తమ గోసను పట్టించుకునే వారు కరువయ్యారని, ప్రతి ఎన్నికల హామీలోను ప్రతి పార్టీకి చెందిన నాయకులు తమకు అండగా ఉండి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలి ఇప్పిస్తామని నమ్మిస్తూ ఓట్లు వేయించుకుంటు న్నారని, ఆ తర్వాత పట్టించుకోవడంలేదని, పేద రైతుల హృదయం తెలిసిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమకు పట్టాలి ఇప్పించి ఆదుకుంటారనే గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్నామని ఇక్కడ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రజాకార్ల హయాం కంటే ముందు నుంచి ఈ గ్రామంలో నివసిస్తున్న వివిధ వర్గాలకు చెందిన రైతులు జంగ్ సిపాయిలకు ఇనామ్ గా ఇచ్చిన భూములను వాటి పట్టాదారులైన ముస్లిం సిఫాయిలకు కొంతకాలం శిస్తు చెల్లిస్తూ వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకుంటూ జీవిస్తున్న ఈ పేద ప్రజల కోసం ఆనాటి సిపాయిలు సాగు చేసుకుంటున్నా రైతులకు కొంత సొమ్మును తీసుకొని ఆ భూములను వదిలేసి, దుబాయ్ లాంటి దేశాలకు వెళ్లిపోయారని, ఆ తరువాత కొంతకాలం ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తూ అడంగల్ పహానిలలో రైతులుగా కొనసాగుతున్నారు. బేతంపూడి రెవెన్యూ పరిధిలో సుమారుగా పదివేల ఎకరాల ఇనాము భూములలో రైతులు సాగు చేశారన్నారు. అదే జీవనాధారముగా తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇనాముగా ఉన్నటువంటి భూములు సుమారుగా ఏడు వేల ఎకరాల వరకు ఇప్పటివరకు పట్టా హక్కులను సాగులో ఉన్న గిరిజన, గిరిజనేతరులకు పట్టా హక్కులను కల్పించారు. బేతంపూడి రెవిన్యూ పరిధిలో బేతంపూడి, టేకులపల్లి, కోయగూడెం తదితర గ్రామాల రైతులకు ఇనాం భూముల పట్టా హక్కులు పొందారు. సులానగర్, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు, శాంతినగర్ కొద్ది మంది రైతులు మాత్రమే పట్టా హక్కులు పొందారు. ఇదే గ్రామాలకు చెందిన సుమారు 2 వేల ఎకరాల ఇనాం భూముల కు పట్టా హక్కులు అందించాల్సి ఉంది. దీంతో సాగు చేసుకుంటున్నా రైతులు ప్రభుత్వం పంటలకు ప్రోత్సహిస్తున్న రాయితీలు పొందలేక, వ్యవసాయ బ్యాంకు రుణాలు పొందలేక, రైతుబంధు సహాయం పొందలేక,చిన్న,సన్న కారు రైతులకు పాడి పశువులు, కుటీర పరిశ్రమల రుణాలను పొందలేకపోతున్నామని, కేవలం ప్రైవేటు అప్పులతో వ్యవసాయం చేసుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతూ నష్టపోతున్నామని రైతుల ఆవేదన చెందుతున్నారు. అప్పుల పాలవుతూ ఆత్మహత్యలకు పూనుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. పట్టాహక్కులు పొందకపోవడంతో పిల్లలను పెద్ద చదువులు చదివించలేక, తరతరాలు మారిన రైతులు, వారి పిల్లలు కూలీలు గానే మారిపోతున్నారు. తమకు పట్టాలు కాకపోవడంతో వ్యవసాయపరంగా తీవ్ర నష్టాలను చవిచూస్తూ, తరతరాలుగా తమ జీవన విధానంలో ఎలాంటి మార్పులు రాకపోగా అన్ని రంగాలలో కూడా చితికి పోతున్నామని, పట్టా హక్కులు పొందిన అందరి రైతులు లాగా తమకు పట్ట హక్కులు కల్పించి మెరుగైన జీవితాన్ని అందించాలని ఇక్కడి రైతాంగం వేడుకుంటున్నారు. పేదల పెన్నిధిగా పేరుగాంచిన, వ్యవసాయ కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ మంత్రిగా వ్యవసాయం చేసే రైతుల స్థితిగతులు ఎలా ఉంటాయో, వ్యవసాయం చేసుకునే రైతులకు వారి భూములకు తరతరాలుగా పట్టా హక్కులు లేకుంటే వారి ఆవేదనను తెలిసిన మంత్రిగా ఆదుకుంటారని బాధిత రైతులందరూ ముక్తకంఠంతో ఆశాభవాన్ని వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ టేకులపల్లి మండల పర్యటనలో భాగంగా రైతులు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో పట్టా సమస్యల గురించి రైతులు వివరించారు. రైతుల కష్టం తెలిసిన కలెక్టర్గా రైతులు సేద్యం చేస్తున్న పొలాలను సందర్శించి సాగు వివరాలను, వేసే పంటల వివరాలను, ఖర్చు వివరాలను రైతులతో ముఖాముఖిగా ముచ్చటిస్తూ వాణిజ్య పంటలే కాకుండా, కూరగాయలు, ఉద్యాన పంటలు, మునగ, ఔషధ తోటలను సాగు చేసుకోవాలని, అలాంటి పంటలకు ఈజీఎస్ ద్వారా ప్రోత్సాహాన్ని పొందవచ్చు అని రైతులకు అవగాహన కల్పిస్తూ సూచనలు చేస్తున్నారు. ఇటీవల మండల పర్యటనలో శాంతినగర్ గ్రామానికి చెందిన చేతుల కన్నయ్య అనే రైతు పొలాన్ని సందర్శించి రైతు తో మాట్లాడారు. రైతు కలెక్టర్ కి వివరిస్తూ తన భూమికి పట్టా హక్కులు లేవని తాతల కాలం నుండి భూములను సాగు చేసుకుంటున్నామని, పట్టా హక్కులు కల్పించకపోవడం వలన ప్రభుత్వం వ్యవసాయానికి అందించే ప్రోత్సాహాన్ని పొందలేకపోతున్నామని తెలిపారు. స్పందించినస్పందించిన కలెక్టర్ వెంటనే ఆ రైతు భూమికి పట్టా మంజూరు చేయాలని స్థానిక తహసిల్దారును ఆదేశించారు. టేకులపల్లి మండలంలోని పట్టా భూముల సమస్యలను జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఇక్కడి రైతాంగ సమస్యలను రెవెన్యూ మంత్రి, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని న్యాయం చేస్తారని ఆశిద్దాం...

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేముల



**రామన్నపేట, ఆగష్టు 20 (జనం సాక్షి) :**
మండలంలోని బోగారం గ్రామానికి చెందిన నేరటి రమేష్ , కనుకు శ్రీను అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఇరువురికి అందజేశారు. నేరటి రమేష్ 42000 ల చెక్కు, కనుక శ్రీను 23 వేల చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధికి సహకరించిన నకిరేకల్ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి వెంట బోగారం గ్రామ శాఖ అధ్యక్షుడు మధ్యపూరి ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు బొడ్డుపల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లోకి వినేశ్ ఫొగాట్

### సోదరితోనే పోటీ పడనుందా..?

పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హతకు గురై వార్తల్లో నిలిచిన భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్ కొత్త ఇన్నింగ్స్ మొదలు పెట్టనుంది. విశ్వ క్రీడల గ్రామంలోనే రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికిన ఆమె త్వరలోనే రాజకీయాల్లోకి రానుంది. ఒలింపిక్స్ పతకం చేజారినా కోట్లాది మంది మనసులు గెలిచిన వినేశ్.. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ పోటీ చేయనుందనే వార్తలు ప్రచారమవుతున్నాయి. 'అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాల్సిందిగా కొన్ని రాజకీయ పార్టీలు వినేశ్‌ను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాయి అని ఓ వార్త కథనం తెలిపింది. అయితే.. వినేశ్ ఎవరికి పోటీగా నిలబడనుందో తెలుసా.? సోదరి అయిన బబితా ఫొగాట్‌తో. దాంతో, ఎన్నికలు రసవత్తరంగా ఉంటాయని హర్యానా మీడియా కోడై కూస్తోంది. రజతం దక్కకపోవడం యావత్ భారతాన్ని నిరాశపరిచిన విషయం తెలిసిందే. ఆగస్టు 14న అర్బిట్రేషన్ కోర్టు వినేశ్‌కు పతకం ఇవ్వడం లేదంటూ చెప్పిన చేదు వార్త ఇంకా మింగుడు పడడం లేదు. అయితే.. ఏ కారణం చెప్పకుండానే వినేశ్ ఫొగాట్‌కు పతకం నిరాకరించడాన్ని అందరూ ప్రశ్నిస్తున్న నేపథ్యంలో కాస్ సోమవారం 24 పేజీల సుదీర్ఘ తీర్పును వెల్లడించింది. అందులో కాస్ ఏం చెప్పిందంటే..?' విభాగానికి సరిపోయేంత బరువు ఉండడం అనేది అథ్లెట్ల బాధ్యత అని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ మినహాయింపులు ఉండవని కాస్ చెప్పింది. వినేశ్ ఫొగాట్ విషయంలోనూ తాము అదే నియమాన్ని అనుసరించామ'ని అర్బిట్రేషన్ కోర్టు తన 24 పేజీల తీర్పులో తెలిపింది.



### అదనపు బరువుతో అనర్హత

పారిస్ ఒలింపిక్స్ పతకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వినేశ్ ఫొగాట్ కల చెదిరింది. 50 కిలోల విభాగంలో అదరగొట్టిన ఆమె అలవోకగా ఫైనల్లో అడుగుపెట్టింది. అయితే.. అనూహ్యంగా ఫైనల్ ఫైట్‌కు ముందు 100 గ్రాముల అదనపు బరువుతో అనర్హతకు గురైంది. ఆ బాధలోనే రెజ్లింగ్‌కు వీడ్కోలు కూడా చెప్పిన వినేశ్ తనపై వేటు సవాల్ చేస్తూ అర్బిట్రేషన్ కోర్టులో అప్పీల్ చేసింది. క్యూబా బాక్సర్‌తో పాటు సంయుక్తంగా తనకు రజతం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసింది. అయితే.. మూడు సార్లు తీర్పును వాయిదా వేసిన కాస్ చివరకు పతకం ఇవ్వలేమని చెప్పింది. దాంతో, నిరాశగా వినేశ్ స్వదేశానికి వచ్చేసింది. ఢిల్లీలో దిగిన ఆమెకు అపూర్వ స్వాగతం లభించింది. స్వగ్రామమైన బలాలిలో సన్మాన కార్యక్రమం అనంతరం వినేశ్ బంగారు పతకం అందుకున్న విషయం తెలిసిందే.

# మళ్లీ భారత్‌కు ఆడుతా..!

## ట్రిపుల్ సెంచరీ వీరుడి కల నిజమయ్యేనా..?



టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ అంటే మామూలు విషయం కాదు. సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్ వంటి దిగ్గజాలకు సైతం సాధ్యంకాని ట్రిపుల్ సెంచరీ మార్క్ అందుకున్న రెండో భారత క్రికెటర్ కరుణ్ నాయర్ ఈమధ్య రంజీల్లో అద్భుతంగా రాణించిన నాయర్.. తాజాగా మహరాజా టోర్నమెంట్‌లోనూ శతక గర్జన చేశాడు. మైసూర్ వారియర్స్ తరఫున మెరుపు సెంచరీ బాదిన కరుణ్.. భారత టెస్టు జట్టులోకి రావడమే తన లక్ష్యమంటున్నాడు. ఈ రైట్ హ్యాండర్ టీమిండియాకు ఆడి ఏడు ఏండ్లు అవుతోంది. అతడికి మళ్లీ ఇండియా జెర్సీ వేసుకొనే చాన్స్ వస్తుందా? లేదా? అనేది చూడాలి. 'ఒక క్రికెటర్ 30 నుంచి 32 ఏండ్ల మధ్య సూపర్ ఫామ్‌లో ఉంటాడనే సామెత ఉంది. ఆ మాట నా విషయంలో నిజమవుతుందని నేను నమ్ముతున్నా. గత సీజన్‌లో నేను ఇంటికే పరిమితం అయ్యాను. చాలా అవకాశాలు మిస్ అయ్యాను. ఆ సమయంలో ఏమీ చేయాలి? అని నన్ను నేను ప్రశ్నించుకున్నా. ఇప్పుడు అవకాశం రాగానే జట్టుకు ఉపయోగపడే ఇన్నింగ్స్ ఆడాలనుకున్నా. నా కెరీర్‌లోని గడ్డు రోజులు నన్ను మరింత రాటుదేల్చాయి. ఇప్పుడు నా లక్ష్యం భారత జట్టుకు మళ్లీ ఆడడమే. ఆలోచన పరంగా, ఆట పరంగా నేను మంచి స్థితిలో ఉన్నాను. నాకు ట్రోఫీలు గెలవడం అంటే ఇష్టం. నిరుడు రంజీని మేము కోల్పోయాం. ఈసారి కచ్చితంగా ట్రోఫీ గెలవాలనే పట్టుదలతో ఉన్నాం' అని కరుణ్ వెల్లడించాడు.



# ఒక్క సీజన్‌లో 5 వేల కోట్ల లాభం

## నిండుకుండలా బీసీసీఐ ఖజానా

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తో కోట్లు వెనకేసుకున్న క్రికెటర్లు చాలామంది. ఆటగాళ్లను కోటీశ్వరులు చేసిన భారత క్రికెట్ నియంత్రణ మండలి సంగతి వేరే చెప్పాలా. ఐపీఎల్ ద్వారా బీసీసీఐ ఏటా భారీ మొత్తంలో ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఒకటి రెండు వేల కోట్లు కాదండోయ్ ఏకంగా 5 వేల కోట్లపైనే భారత బోర్డు ఖజానాలో చేరాయి. అవును.. 16వ సీజన్‌తో బీసీసీఐకి రికార్డు స్థాయిలో రూ. 5,120 కోట్ల లాభం వచ్చింది. పదిహేనో సీజన్‌తో పోల్చితే ఆదాయంలో పెరుగుదల 116 శాతం అధికంగా ఉండడం విశేషం. బీసీసీఐ తాజాగా 2022-23 వార్షిక నివేదిక విడుదల చేసింది. అందులో ఐపీఎల్ నిర్వహణ వ్యయం ఎంత మేర పెరిగింది? అనేది కూడా పేర్కొంది. గతంతో పోల్చితే మెగా టోర్నీ జరిపేందుకు 66 శాతం అదనంగా ఖర్చు పెడుతున్నట్టు బీసీసీఐ తెలిపింది. పదహారో సీజన్ కోసం సుమారు రూ.6,648 కోట్లు వెచ్చించినట్టు భారత బోర్డు వెల్లడించింది. ప్రపంచంలోనే సంపన్న క్రికెట్ బోర్డు అయిన బీసీసీఐ పాలిట ఐపీఎల్ బంగారు బాతులా మారింది. 2008లో తొలి సీజన్‌తో ఆరంభం.. టీవీ ప్రసార, మీడియా హక్కులు, ప్రకటనలు, ఫ్రాంచైజీలు చెల్లించే సొమ్ము.. ఇలా ప్రతి సీజన్‌లో దండిగా డబ్బులు వస్తున్నాయి. సీజన్ సీజన్‌కు ఐపీఎల్ క్రేజ్ పెరగడం కూడా బీసీసీఐ గల్లా పెట్టెను నింపుతోంది. దాంతో, నిత్యం భారత బోర్డు ఖజానా నిండుకుండలా ఉంటోంది. త్వరలోనే 18వ సీజన్‌కు ముందు ఐపీఎల్ మెగా వేలం జరుగనుంది.

# కోహ్లీ, రోహిత్‌లు కాదు

## మమ్మల్ని ఇబ్బంది పెట్టేది అతడే..?



కొంత కాలంగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న ఆస్ట్రేలియా ఈసారి విజయంపై ధీమాతో ఉంది. భారత్, ఆసీస్‌ల మధ్య నవంబర్‌లో ఈ సిరీస్ ఆరంభం కానుంది. ఈ నేపథ్యంలో కంగారూ జట్టు స్టార్ స్పిన్నర్ నాథన్ లియాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈసారి స్వదేశంలో జరుగబోయే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో తమను ఇబ్బంది పెట్టే బ్యాటర్ ఎవరో లియాన్ చెప్పేశాడు. అలాగని అతడు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల పేర్లు చెప్పాడనుకుంటే పొరపాటే. బీజీటీలో యువకెరటం యశస్వీ జైస్వాల్ నుంచి ఆసీస్‌కు ప్రమాదం ఉందని లియాన్ అన్నాడు. 'బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకు మాకు యశస్వీ నుంచే ముప్పు ఉండనుంది. నేను ఇప్పటి వరకూ అతడికి బౌలింగ్ చేయలేదు. అతడిని అడ్డుకోవడం మా బౌలర్లకు పెద్ద పరీక్షే. ఇంగ్లండ్‌పై అతడు ఆడిన తీరు అమోఘం. యశస్వీ బ్యాటింగ్ వీడియోలు జాగ్రత్తగా చూశాను. యశస్వీ చాలా అద్భుతంగా ఆడాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ స్పిన్నర్ టామ్ హర్ట్లేతో చాలాసేపు మాట్లాడాను. యశస్విని కట్టడి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నా' అని లియన్ తెలిపాడు. వరల్డ్ క్లాస్ బౌలర్ అయిన లియాన్ ఖాతాలో 503 టెస్టు వికెట్లు ఉన్నాయి. తనదైన రోజున ఒంటి చేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పగల సత్తా అతడి సొంతం. పైగా విరాట్ కోహ్లీపై ఈ స్పిన్నర్‌కు మంచి రికార్డు ఉంది. 23 మ్యాచుల్లో ఏకంగా ఏడుసార్లు విరాట్ వికెట్ సంపాదించాడు. అందుకని ఈసారి బీజీటీలో భారత బ్యాటర్లు లియాన్‌పై ఓ కన్నేసి ఉంచక తప్పదు.

### నాలుగు పర్యాయాలు

టెస్టు క్రికెట్‌లో ఆసీస్ ఆధిపత్యానికి భారత్ చెక్ పెట్టింది. కంగారూ జట్టును వాళ్ల దేశంలోనే ఓడించి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గెలుపొందింది. వరుసగా నాలుగు పర్యాయాలు భారత్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. దాంతో, 2017 తర్వాత ఒక్కసారి కూడా ఆసీస్ బీజీటీ ట్రోఫీని గెలవలే. దాంతో.. ఎలాగైనా సరే ఈసారి బీజీటీని ఒడిసిపట్టాలని కమిన్స్ బృందం పట్టుదలతో ఉంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 1992 తర్వాత తొలిసారి ఐదు టెస్టుల మ్యాచ్‌గా జరుగనుంది.



# టీమిండియా చాన్స్ మిస్

## ఐపీఎల్ మెంటర్‌గా వెటరన్ పేసర్

ఐపీఎల్ 18వ సీజన్ కోసం ఫ్రాంచైజీలు ఇప్పటికే కసరత్తులు మొదలెట్టాయి. కొత్త హెడ్‌కోచ్‌లతో పాటు బ్యాటింగ్, బౌలింగ్ కోచ్‌ల ఆధ్వర్యంలో కప్పు కొట్టాలనే కసితో ఉన్నాయి. ఈ నేపథ్యంలో లక్నో సూపర్ జెయింట్స్ కూడా కొత్త మెంటర్ కోసం అన్వేషిస్తోంది. వెటరన్ పేసర్ జహీర్ ఖాన్‌తో ఆ పోస్ట్‌ను భర్తీ చేయాలని లక్నో ఫ్రాంచైజీ భావిస్తోంది. ఈ విషయమై జహీర్‌తో చర్చలు కూడా జరుపుతోంది. ఒకవేళ అన్నీ కుదిరితే ఈ వరల్డ్ కప్ హీరో లక్నో జట్టుకు మెంటర్ అవ్వడం ఖాయం. భారత జట్టు పేసర్లలో అగ్రగణ్యుడైన జహీర్ ఖాన్ 2011 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం అతడు ఐపీఎల్లో ముంబై ఇండియన్స్‌కు బౌలింగ్ కోచ్‌గా సేవలందించాడు. ఐపీఎల్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్న జహీర్ ఈమధ్య టీమిండియా బౌలింగ్ కోచ్‌గా ఎంపికవుతాడనే వార్తలు వినిపించాయి. అయితే.. గంభీర్ మాత్రం మొండి పట్టుతో మోర్కెల్‌ను తన టీమ్‌లో చేర్చుకున్నాడు. దాంతో, జహీర్‌కు చాన్స్ దక్కలేదు. అందువల్ల ఈ యార్కర్ కింగ్‌ను తమ మెంటర్‌గా నియమించుకోవాలని లక్నో పావులు కదుపుతోంది. ప్రస్తుతం లక్నో కోచింగ్ సిబ్బందిలో జస్టిన్ లాంగర్ (హెడ్‌కోచ్), ఆడమ్ వోజెస్, లాన్సే క్లుసేనర్, జాంటీ రోడ్స్(ఫీల్డింగ్ కోచ్)లు ఉన్నారు.

# ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తా

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ రూరల్ ఆగస్టు 20 (జనం సాక్షి)**



ప్రజా సంక్షేమం కోసమే అహర్నిశలు పనిచేస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్ నగర్ గ్రామీణ మండలానికి చెందిన 60 మంది షాదీ ముబారక్ మరియు కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటివరకు ఏ ఒక్క పథకం కూడా ఆగిపోకుండా అన్ని పథకాలను అమలు చేస్తున్నామని, కానీ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే సిలిండర్ లాంటి ఎన్నో పథకాలను ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల కోసం అమలు చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులను ఆదుకొనాలనే ఉద్దేశంతో రెండు లక్షల రూపాయల వరకు ఉన్న రైతుకు రుణ మాఫీ చేసి 23 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసామన్నారు. కానీ కేటిఆర్, హరీష్ రావు లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి వర్గం కూడా సంతోషంగా స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సుందర్ రాజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లు నర్సింహ్మారెడ్డి, ధర్మాపూర్ నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# వనపర్తి జిల్లాకే డీసీసీబీ చైర్మెన్..!

- మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డికి గ్రీన్ సిగ్నల్
- కాంగ్రెస్‌కు దక్కనున్న సెంట్రల్ బ్యాంకు పీఠం

**వనపర్తి,ఆగస్టు 20 (జనంసాక్షి):**

అనారోగ్య కారణాల వల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ) చైర్మెన్‌గా ఉన్న నిజాంపాషా పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని ఈ నెల 23వ తేదీన భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సోమవారం డీసీసీబీ నూతన చైర్మెన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. మెజారిటీ డైరెక్టర్లు బీఆర్ఎస్ కు చెందిన వారే ఉన్నప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో డీసీసీబీని దక్కించుకోవడానికి అధికార పార్టీ వేసిన ఎత్తుగడలు ఫలించాయి. కేవలం 6 నెలలు మాత్రమే పదవీకాలం ఉండడంతో బీఆర్ఎస్ శ్రేణులు సైతం ఈ ఎన్నికను ఛాలెంజిగా తీసుకోలేదు. చైర్మెన్ పదవిని ఆశిస్తున్న వారు కూడా కాంగ్రెస్ పార్టీ గూటికి చేరడం, ఆయా పార్టీల మధ్య పోటీ లేకపోవడం వలన ఏకగ్రీవం అయ్యే సూచనలే మెండుగా ఉన్నాయి.





### వనపర్తి జిల్లాకే వరించనున్న డీసీసీబీ చైర్మెన్ పదవి

వనపర్తి జిల్లా పాన్ గల్ సింగిల్ విండో చైర్మెన్ మామిళ్ళపల్లి విష్ణువర్దన్ రెడ్డికి డీసీసీబీ చైర్మెన్ పదవి ఖరారైందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే ఎన్నికల్లో తటస్థంగా ఉండడం, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీలే చేరడం మామిళ్ళపల్లి విష్ణువర్దన్ రెడ్డికి కలిసొచ్చిన అంశంగా మారింది.

### డీసీసీబీ చైర్మెన్ పదవికి ముగ్గురి మధ్య పోటీ

డీసీసీబీ నూతన చైర్మెన్ పదవిని ఎలాగైనా తమ పార్టీ కైవసం చేసుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా అయినందున మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. మెజారిటీ డైరెక్టర్లు బీఆర్ఎస్ వాళ్ళే ఉన్నప్పటికీ, మహబూబ్ నగర్ డీసీసీబీని దక్కించుకునేందుకు ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలోని ఎమ్మెల్యేలతో సమాలోచనలు బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్లను తమ వైపు తిప్పుకోవడంలో సఫలం అయ్యారు.ప్రస్తుత వైస్ చైర్మెన్ కోరమోని వెంకటయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నుంచి వనపర్తి జిల్లాకు చెందిన మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, షాద్ నగర్‌కు చెందిన మంజులా రెడ్డి లాబీయింగ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ డైరెక్టర్ అయిన మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి గత పార్లమెంటు ఎన్నికల్లో మల్లు రవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినప్పటికీ ఆయనను మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యతిరేకించినట్లు సమాచారం. గతంలో విష్ణువర్ధన్ రెడ్డి కొల్లాపూర్ ఎమ్మెల్యేగా పలు సార్లు పోటీ చేయడం, ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కొరకు తీవ్రంగా పోటీపడుతుండడంతో డీసీసీబీ చైర్మెన్ అయితే భవిష్యత్తులో తనకే పోటీ దారుగా మారుతాడనే ఉద్దేశంతో మంత్రి అడ్డుచెప్పుతున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాల తెలుస్తున్నది. అయితే ఎంపీ డాక్టర్ మల్లురవి, స్టేట్ ప్లానింగు బోర్డు వైస్ చైర్మెన్ చిన్నారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు మామిళ్ళపల్లి విష్ణువర్దన్ రెడ్డికే మద్దతు పలుకుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం కూడా సర్ది చెప్పి ,చైర్మెన్ పదవిని ఏకగ్రీవం అయ్యే విధంగా పావులు కదపడంతో డీసీసీబీ చైర్మెన్ పదవి వనపర్తి జిల్లా పరిధిలోని పాన్ గల్ సింగిల్ విండోకు దక్కడానికి మార్గం సుగమమైందని, ఈ మేరకు మామిళ్ళపల్లి విష్ణువర్దన్ రెడ్డికి గ్రీన్ సిగ్నల్ లభించిందని తెలుస్తున్నది.



# కరాటే విద్యార్థిని అభినయశ్రీకి ఆర్థిక సహాయం

**ఖమ్మం ఆగస్టు 20 (జనంసాక్షి)**

ముదిగొండ కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చల్లగొండ. అభినయశ్రీ కరాటే బ్లాక్ బెల్ట్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది..ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరిగే అంతర్జాతీయ స్థాయిలో నేపాల్‌లో జరిగే కరాటే పోటీలకు పాల్గొనేందుకు అభినయశ్రీ ఎంపికైంది.చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన అభినయశ్రీ నేపాల్‌లో జరిగే కరాటే పోటీలలో పాల్గొనేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకుంటున్న విషయం తెలుసుకున్న జిల్లా మహిళా ప్రాంగణ అధికారిణి వేల్పుల విజేత వ్యక్తిగతంగా తన వంతు ఆర్థిక సహాయంగా పది వేల రూపాయలు మంగళవారం మహిళా ప్రాంగణంలో అందజేయడం జరిగింది...ఈ సందర్భంగా జిల్లా మహిళా ప్రాంగణ అధికారిణి వేల్పుల విజేత మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభినయశ్రీ నేపాల్‌లో జరిగే కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, దేశ ప్రతిష్టను మరింత పెంపొందించే విధంగా పోటీపడి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని అకాంక్షించారు. అదే విధంగా అభినయశ్రీ కరాటే శిక్షకుడు శ్రీ రామకృష్ణ కృషి నీ అభినందించారు.

# రుణమాఫీ అడిగితే అరెస్టు చేస్తారా..?

- రైతుబంధు సాయం ఎగ్గొట్టి మోసం చేశారు
- ఆందోళనలను అణచివేస్తే ఆగం కాక తప్పదు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,ఆగస్టు20(జనంసాక్షి):**

ప్రభుత్వం తమ రుణాలను మాఫీ చేయలేదని ప్రజాస్వామ్య పద్దతిలో నిరసనలు తెలుపుతున్న రైతులను ఎందుకు అరెస్టు చేశారని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. నిరసన అనేది ప్రజాస్వామిక హక్కని, అణచివేస్తే ఆగిపోతుందని అనుకోవడం అవివేకం అన్నారు. రైతాంగం కన్నెర్రజేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆగంకాక తప్పదని హెచ్చరించారు. రైతు రాజ్యం కాదని,పోలీసు రాజ్యంగా మారిందన్నారు. పంట పెట్టుబడుల కోసం బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన రైతుబంధు సాయం రూ.15000 వేల కోట్లు ఎగ్గొట్టి మోసం చేసిందని, కేవలం రూ.17,869 కోట్లు రుణమాఫీ చేసి రూ.2 లక్షల వరకు రుణాలు మొత్తం తీర్చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. మరి అన్ని రుణాలు మాఫీ అయితే ప్రభుత్వానికి ఉలుకెందుకు ? రాష్ట్రంలో రైతులు రోడ్డెందుకు ఎక్కుతున్నారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనిదే రుణమాఫీ పూర్తయిందని సీఎం, మంత్రుల అబద్దపు ప్రకటనలు చేస్తున్న కారణంగానే రైతులు ఆందోళనకు గురై నిరసనలు తెలుపుతున్నారని అన్నారు. అధికార పీఠం ఎక్కగానే కాంగ్రెస్ నేతల కండ్లు నెత్తిమీదకు ఎక్కాయని,నోటికొచ్చినట్లు మాట్లాడితే రాబోయే రోజుల్లో రైతులే ఈ ప్రభుత్వానికి పాడె కడతారని హెచ్చరించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, రైతుకూలీలు, మహిళలు అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని, ఆదిలాబాద్‌లో రైతుల మీద పెట్టిన కేసులను భేషరతుగా వెనక్కి తీసుకోవాలని, అరకొర రుణమాఫీ చేసి రైతుల ఆందోళనకు, మానసిక వేదనకు కారణం అయిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# ఆర్టీసీ బస్‌లో జన్మించిన చిన్నారికి జీవితకాలం ఉచిత బస్‌పాస్

- సాయపడిన నర్సుకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం : టీజీఎస్ఆర్టీసీ
- డెలివరీ చేసి ఉదారత చాటిన వారికి ఘన సన్మానం.. నగదు బహుమతుల అందజేత



**హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** రాఖీ పౌర్ణమి నాడు గద్వాల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులో జన్మించిన చిన్నారికి జీవిత కాలంపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్ ను అందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) యాజమాన్యం ప్రకటించింది. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్ లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్ ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. ఈ ఆడపిల్లకు బర్త్ డే గిఫ్ట్ గా లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్ ను మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. అలాగే, కండక్టర్‌తో పాటు గర్భిణి డెలివరీకి సాయం చేసిన వనపర్తిలోని మదర్ అండ్ చైల్డ్ గవర్నమెంట్ హాస్పటల్ స్టాఫ్ నర్స్ అలివేలు మంగమ్మకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్ పాస్‌ను సంస్థ అందించింది. బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణికి కాన్పు చేసి మానవత్వం చాటుకున్న గద్వాల్ డిపోనకు చెందిన కండక్టర్ భారతి, డ్రైవర్ అంజిలతో పాటు నర్సు అలివేలు మంగమ్మను హైదరాబాద్ బస్ భవన్‌లో మంగళవారం టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ వారిని ఘనంగా సన్మానించి.. నగదు బహుమతులు అందజేశారు. అనంతరం, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్ పాస్‌ను నర్సు అలివేలు మంగమ్మకు, చిన్నారి ఉచిత బస్ పాస్‌ను గద్వాల డిపో మేనేజర్ మురళీకృష్ణకు అందజేశారు. గద్వాల-వనపర్తి రూట్ పల్లె వెలుగు బస్సులో రాఖీ పండుగ రోజున సోమవారం ఉదయం సంధ్య అనే గర్భిణి రక్షాబంధనన్ సందర్భంగా తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్తున్నారు. బస్సు నాచహల్లి సమీపంలోకి రాగానే గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ జి.భారతి బస్సును ఆపించారు. అదే బస్సులో ప్రయాణిస్తోన్న నర్సు అలివేలు మంగమ్మ సాయంతో గర్భిణికి పురుడు పోశారు. పండంటి ఆడబిడ్డకు మహిళ జన్మనిచ్చారు. అనంతరం 108 సాయంతో తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి.. సకాలంలో కాన్పు చేసిన కండక్టర్ భారతి, నర్సు అలివేలు మంగమ్మ, డ్రైవర్ అంజి సేవలను ఈ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మెచ్చుకున్నారు. ఆపద సమయంలో సేవాతత్పరతను ఆర్టీసీ సిబ్బంది చాటుతుండటం గొప్ప విషయమని అన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు వారి ఆపద సమయంలో తాము ఉన్నామని భరోసా కల్పిస్తుండటం అభినందనీ యమని ప్రశంసించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శ్రీదేవి, డిప్యూటీ సీటీఎం జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ విగ్రహం కూలుస్తామంటే చూస్తూ ఊరుకుంటామా ?

- రాజీవ్ గురించి అడ్డదిడ్డంగా మాట్లాడితే బుద్ధి చెబుతాం
- ఘాటుగా హెచ్చరించిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి




**హైదరాబాద్, ఆగస్ట్20 (జనంసాక్షి) :** రాజీవ్ గాంధీ విగ్రహం కూలగొడతామంటే తామేమైనా ఖాళీగా కూర్చున్నామా కేటీఆర్ అంటూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కన్నెర్ర జేశారు. తల్లి గుండెల్లో ఉండాలి కాబట్టి తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకుంటే చెప్పుతో కొడతామన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందన్నారు. రాజీవ్ గాంధీ లాంటి గొప్ప నాయకుని గురించి అడ్డదిడ్డంగా మాట్లాడితే మర్యాదగా ఉండదంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ భవన్ ముందు ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామంటూ కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్, బీజేపీలకు సరైన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్ల నరకం చూపించింది కాబట్టే.. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారన్నారు. 'మా ధైర్యం, మా సాహసాల మీద నువ్వెంత. మీరు చాకులు తెస్తే.. మేము చాకులు తెస్తాం. కేటీఆర్ చీప్ లిక్కర్ తాగినోడి లాగా మాట్లాడుతుండు మీ అయ్య కేసీఆర్ చారాణ చేస్తే, నువ్వు బారాణ చెప్తావు. మేము సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి గులాం గిరి చేస్తాం నిజమే.' అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఐదు సంవత్సరాల తరువాత రాజీవ్ గాంధీ విగ్రహం తీసేసే దమ్ము, ధైర్యం మీకు లేదంటూ కేటీఆర్‌కు చురకలంటించారు. తెలంగాణ కోసం మీ కుటుంబం మొత్తం ఢిల్లీకి పోయినప్పుడు సోనియా గాంధీకి గులాం గిరి చేసినట్లు అనిపించలేదా? అని నిలదీశారు. దేశ ప్రజల కోసం రాజీవ్ గాంధీ బలిదానం కావడం నిజమా? కాదా? అని ప్రశ్నించారు. 18 సవత్సరాలు ఉన్న ప్రతి యువతి, యువతులకు రాజీవ్ గాంధీ ఓటు హక్కు కల్పించారని.. రాజీవ్ గాంధీ తెచ్చిన టెక్నాలజీతో చదువుకొని కేటీఆర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. అలాంటి మహనీయుడికి ధన్యవాదాలు తెలిపే గుణగణాలు కూడా లేవని కేటీఆర్‌పై జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌కు ఇంకా మాట్లాడటం రావడం లేదని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. పొలిటికల్ కోచింగ్ సెంటర్‌లో ట్రైనింగ్ తీసుకుంటే మంచిదన్నారు. కేటీఆర్‌కు ఎలాంటి ఇష్యూ మీద మాట్లాడాలో తెలియడం లేదని విమర్శించారు. కేటీఆర్ మాత్రమే కాకుండా.. కేటీఆర్‌కు కూడా కోచింగ్ ఇప్పించడం ఉత్తమం అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జర్నలిస్టుల సమస్యలను సైతం ప్రస్తావించారు జగ్గారెడ్డి. పదేళ్ల కాలంలో జర్నలిస్టుల సమస్యల కోసం, ప్లాట్ల కోసం ఏనాడైనా అల్లం నారాయణ పోరాటం చేశాడా? అని ప్రశ్నించారు. అల్లం నారాయణ మేధావి అనడం పెద్ద జోక్ అని.. ఆయన ఒక జోకర్ అంటూ ఘాటైన జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారు.

# శభాష్ వరంగల్ పోలీస్



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 20( జనం సాక్షి) :** వరంగల్ హంటర్ రోడ్డు లోని రైల్వే ట్రాక్ పక్క గుంతలో గుర్తుతెలియని వ్యక్తి రెండు రోజుల క్రితం నీటిలో పడి ఉన్నాడని డయల్ 100 రాగా బిసి 2 ఏరియాలో విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ హఫీజ్ పాషా మట్టవాడ ఇన్స్పెక్టర్ గోపికి మంగళవారం తెలియజేశాడు. ఈ విషయమై వెంటనే స్పందించిన ఇన్స్పెక్టర్ సంఘటన ప్రదేశానికి వచ్చి నీటి గుంతలో పడి ఉన్న వ్యక్తిని కాపాడి ఒక నిండు ప్రాణాన్ని కాపాడారు. ఇన్స్‌పెక్టర్ గోపిని అందరూ అభినందించారుఅంతేకాకుండా బ్లూకోర్ట్ కానిస్టేబుల్ హఫీజ్‌ను కూడా అందరూ పొగిడారు.

# సంక్షేమ పనుల్లో జాప్యం ఉండదు!





- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)

మందమర్రి మున్సిపాలిటీ లోని సింగరేణి సిఈఆర్ క్లబ్ లో 136 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. మాజీ ఎమ్మెల్యే ఓదెలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చామని,ఎమ్మెల్యే వివేకానంద పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణమాఫీ చేశామని, రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని, మందమర్రి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని,డ్రైనేజ్ సమస్యలు ఉన్నాయని, తన దృష్టికి రావడంతో రెండు కోట్లు శాంక్షన్ చేయించాను, అని,రోడ్లకు 80 లక్షల తో అభివృద్ధి పనులు ప్రారంభించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతోందని,అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమం లలో ఏమాత్రం జాప్యం ఉండబోదన్నారు. భూ దందాలు చేస్తే సహించేది లేదని వివేక్ హెచ్చరించారు. చట్టం ప్రకారం అధికారులు విధులు నిర్వహించాలి అన్నారు... దండాలు చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, మంచి నీటి ఇబ్బందులు ఉండద్దు అని ఏమైనా నిధులు అవసరం ఉంటే వెంటనే కేటాయిస్తానని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు. మందమర్రి మున్సిపాలిటీలో 20 లక్షల విలువ గల రెండు ట్రాక్టర్లను ఎమ్మెల్యే లబ్ధిదారుల కు అందజేశారు.జనంతో అడుగడుగునా మమేకం అవుతూ వారి సమస్యలు వింటూ, అధికారులకు సూచనలు ఇస్తూ సాగిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కి జనం నీరాజనం పట్టారు.

# జగన్ అక్రమాస్తుల కేసు విచారణ

- సెప్టెంబర్ 17కు వాయిదా వేసిన హైకోర్టు



**హైదరాబాద్, ఆగస్ట్20 (జనంసాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ మరోసారి వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలన్న పిల్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ కేసులప త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రతినిధుల కేసులను త్వరితగతిన జరపాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని పిటిషనర్ వాదించారు. ఈ క్రమంలో పిటిషన్లపై విచారణను సెప్టెంబర్ 17కు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. మరోవైపు ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి నమోదైన సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆగస్టు 14న ఈడీ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. వాదనలు వినిపించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు సిద్ధమవగా జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను లిస్ట్ చేయనున్నట్లు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. సెప్టెంబరు 2 నుంచి మొదలయ్యే వారంలో సీజేఐ ఆదేశాల మేరకు మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని ఆయన ఆదేశించారు.

# రుణమాఫీ అందని రైతులను గుర్తించండి

- వారికి అండగా నిలబడి అధికారులకు తెలపండి
- సమాచారం తెలియచేసి నిలదీయండి
- బిఆర్ఎస్ శ్రేణులకు మాజీమంత్రి వేముల పిలుపు



**నిజామాబాద్, ఆగస్ట్20 (జనంసాక్షి) :** గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకునే రుణమాఫీ కాలేని రైతులకు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ అండగా నిలవాలని, వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. నేరుగా రైతులను గుర్తించి వారి వివరాలను అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులకు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే స్థానికంగా ఉండే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను సంప్రదించాలని రైతులకు సూచించారు. రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ అయ్యేవరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఇకపోతే కాంగ్రెస్ పార్టీ తొమ్మిది నెలల క్రితం బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే వేముల అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటి రైతులకు ఆగస్టు 15వ తేదీ వరకు పూర్తిగా రుణమాఫీ చేస్తామని చెప్పారని, రాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్లినా.. ఆ జిల్లాలోని ప్రముఖ దేవాలయాల మీద ఒట్టు వేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని హామీని మరిచిపోయారని అన్నారు. వందశాతం రుణమాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే క్యాంపు కార్యాలయంపై గుండాలను పంపించి దౌర్జన్యం చేయించారని మండిపడ్డారు. దానికి పోలీసులు వత్తాసు పలకడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారి పోయాయని అన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు వెళ్లినా హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు, దొంగతనాలు పెరిగిపోయాయని అన్నారు. సిద్దిపేటలో అర్ధరాత్రి జరిగిన సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని, బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీని వంద శాతం అమలు చేసేలా బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలుస్తుందని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా 30 నుంచి 40 శాతం వరకు కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏ సీఎం ప్రవేశపెట్టని రైతుబంధును కేసీఆర్ ప్రవేశపెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతుబంధు పడలేదని అన్నారు. దేశంలో అతి తక్కువ కాలంలోనే సీఎం దిష్టిబొమ్మను దహనం చేసే వరకు దిగజారిన ఏకైక వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల శవయాత్ర చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రైతులకు రుణమాఫీ చేయాలని వేముల డిమాండ్ చేశారు.

# రుణమాఫీ కాలేదంటూ నిరసనలు



- ఏపీజీవీబీకి తాళం వేసి రైతు ఆందోళన

**ఖమ్మం, ఆగస్ట్20 (జనంసాక్షి) :** తమకు రుణమాఫీ కావడం లేదని ఆవేదన చెందిన ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన రైతులు ఏపీజీవీబీకి తాళం వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఏపీజీవీబీ బ్యాంక్ పరిధిలో సుమారు 7 గ్రామాలకు చెందిన 200 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఆందోళనతో మంగళవారం బ్యాంకు వద్దకు చేరుకున్నారు. తక్షణమే రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుబంధు నగదు విడుదల చేయాలన్నారు. ఏపీజీవీబీ పరిధిలోని ఒక్క గ్రామంలో కూడా 50 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం వ్యవసాయాధికారుల కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ సాధారణ రైతులను తిప్పించుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎలాంటి ఆంక్షలు లేకుండా సాగుచేసే ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# హైకోర్టుకు చేరిన వేణుస్వామి వ్యవహారం

- మహిళా కమిషన్ ఫిర్యాదులపై సవాల్
- విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్, ఆగస్ట్20 (జనంసాక్షి) :** ప్రముఖ జోతిష్యుడు వేణుస్వామి వివాదం తెలంగాణ హైకోర్టుకు చేరింది. ఇటీవల నటుడు అక్కనేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గాను మహిళా కమిషన్ నోటీసులు ఇచ్చింది. తనకు నోటీసులు ఇవ్వడాన్ని హైకోర్టులో వేణుస్వామి సవాల్ చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు.. స్వామికి నోటీసులు ఇవ్వడానికి ఎలాంటి అర్హత ఉందని మహిళా కమిషన్‌ను ప్రశ్నించింది. అతను జ్యోతిష్యాల పేరుతో అసత్య, మోసపూరిత వ్యాఖ్యలు చేస్తున్నాడంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టుకు తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను బుధవారం నాటికి వాయిదా వేసింది. జ్యోతిష్యుడు వేణుస్వామి ప్రముఖులపై వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. గతంలోనూ ఆయన అనేక మంది సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై మాట్లాడారు. నాగచైతన్య, సమంత వివాహ సమయంలోనూ వారు త్వరలో విడిపోతారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. అలాగే కొణిదల ఉపాసన, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ సహా అనేక మంది గురించి ఆయన తీవ్రంగా మాట్లాడారు. దీనిపై ఆయా హీరో, హీరోయిన్ల ఫ్యాన్స్ అతనిపై నిప్పులు చెరిగారు. యితే తాజాగా నాగచైతన్య, శోభితా నిశ్చితార్థం జరగగా.. వారు త్వరలో విడిపోతారంటూ వేణుస్వామి చేసిన వ్యాఖ్యలపై అక్కినేని ఫ్యాన్స్ మండిపడ్డారు. అసలే సమంతతో విడిపోయి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న తమ అభిమాన హీరో జీవితం గురించి మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త జంట వైవాహిక జీవితంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని కొందరు జర్నలిస్టులు, ఫ్యాన్స్ ఆయనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆయనకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు సవాల్ చేస్తూ ఆయన హైకోర్టు తలుపు తట్టారు.

# సిద్దిపేటలో మరోమారు టెన్షన్ వాతావరణం

- కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట



**సిద్దిపేట, ఆగస్ట్ 20 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం వద్ద ఫ్లెక్సీ వివాదం అనంతరం మరోసారి సిద్దిపేటలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఓ వైపు భారాస తమ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకుంది. ఈ సమావేశంలో రుణమాఫీ కాని రైతులకు పార్టీ నుంచి ఎలాంటి సహకారం అందించాలనే అంశాలపై చర్చించుకుంటున్నారు. మరోవైపు రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా పొన్నాల రహదారి వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో సిద్దిపేట చేరుకున్నారు. హరీశ్‌రావు క్యాంపు ఆఫీస్ ముందు నుంచి ర్యాలీకి మైనంపల్లి ప్రయత్నించారు. ఈ క్రమంలో బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వద్ద పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు సర్ది చెప్పడంతో మరో మార్గం ద్వారా కాంగ్రెస్ నేతలు పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇటు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం, భారాస శ్రేణల సమావేశం రెండూ ఒకేసారి కావడంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు, నాయకులు సిద్దిపేటకు చేరుకున్నారు. ఫ్లెక్సీ వివాదం అనంతరం ఇంత భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు ఒకచోటకు చేరుకోవడంతో పోలీసులు కూడా సిద్దిపేట పట్టణం మొత్తం మోహరించారు. ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370